# దైవికమైన కృపా నది



దయ్యాలు మనుషులకు ఏ విధంగా అబద్ధం చెప్తావో మరియు దేవుని ప్రేమపూరితమైన కృపను చూడకుండా వారినెలా అంధులను చేసావో, అటువంటి వారిని క్రీస్తు ఎలా స్వతంత్రులను చేస్తాడో ఈ కథ వివరిస్తుంది.

రచయిత :

**జార్జ్ ప్యాటర్‌సన్ మరియు గాలెన్ కుర్రా**

**View and freely download this and other Paul-Timothy studies for novice leaders of new Christian congregations from http://www.paul-timothy.net.**

**Copyright 2004 by George Patterson**

## అధ్యాయం - 1

# విక్టర్ మరియు లోరీలు కృపానదిని గుర్తించుట

విక్టర్ ఒక చిన్న గ్రామం నుండి పెద్ద నగరానికి వెళ్ళి, అక్కడ "వెల్డింగ్" చేయడం నేర్చుకొన్నాడు. కార్లను బాగుచేసే ఒక వర్క్‌షాప్‌లో ఉద్యోగం సంపాదించాడు. అక్కడ క్రొత్త వారితో స్నేహం చేసుకొనే క్రమంలో లోరీతో పరిచయమయ్యింది. ఆమె కూడా ఆ నగరానికి క్రొత్తగా వచ్చింది.

వారి స్నేహం వేగంగా వృద్ధిచెందింది. వారు పెళ్ళిచేసుకొన్నారు. తమ చిన్ని ఇంటిని ఆమె పూలు మొదలైన సాధారణ వస్తువులతో అలంకరించి అందంగా తీర్చిదిద్ది విక్టర్‌ను ఆశ్చర్యపర్చేది. లోరీవలె బాగా పుస్తకాలు చదివే వారు మాత్రమే అటువంటి పనులు చేయగలరు. విక్టర్ ఆనందంతో ఇలా అనేవాడు. "లోరీ! నీవు అందంగా ఉండడం మాత్రమే కాదు. నీకు ఎంతో సృజనాత్మకత కూడా ఉంది. ప్రతిరోజూ నిన్ను గూర్చి మరియు ఈ జీవితాన్ని గూర్చి ఏదో ఒక అద్భుతమైన విషయం గుర్తించేలా చేస్తావు నేనెంతో అదృష్టవంతున్ని!"

ఆమె దృఢమైన అతని రూపును పట్టుదలను సూచించే ముఖాన్ని చూస్తూ ఎటువంటి కఠినమైన బాధ్యతనైనా స్వీకరించగల పురుషున్ని అతనిలో చూసింది. "నీవెంతో ఆలోచనాపరునివి మరియు సహృదయునివి" అని మృదువుగా జవాబిచ్చింది. "నీవెంతో లోతుగా ఆలోచిస్తావు. ఈ జీవితం మనకెప్పుడూ విసుగుపుట్టదు. నీవెప్పడూ....ఎలా చెప్పాలి?! నీవెప్పుడూ క్రొత్త విషయాలను అన్వేషిస్తావు, గుర్తిస్తావు" అన్నది.

క్రొత్త వాటిని రూపొందించడం, గుర్తించడమే కలయికగా వారి చిన్న సంసారం స్వర్గములాగుండేది. కాని, ఒకనాటి సాయంత్రం విక్టర్ విచార వదనంతో వచ్చాడు. ఏం చెప్పకుండానే ఎవరు గుర్తించకపోయినా ఒకసారి అతని ముఖంచూస్తే చాలు అతని మనసులోని భావాలను పసిగట్టగలిగేది లోరీ. అందుకే అతన్ని చూడగానే "ఏం జరిగింది?" అని అడిగింది.

"మా షాప్‌లో ఇక "వెల్డర్" అవసరంలేదట. నేను మరొక చోట ఉద్యోగం వెతుక్కోవాలి" అన్నాడు విక్టర్.

లోరీ వెంటనే కూర్చుండిపోయింది తన రెండు చేతులు ఒడిలో పెట్టుకొని, చేతులు నలుపుకొంటూ "నీవాపని తొందరగా చేయాలి ఎందుకంటే మన కుటుంబం పెరుగబోతుంది. మనకు బిడ్డపుట్టబోతున్నాడని ఈరోజే నాకు తెలిసింది." అని చెప్పింది.

మూడు వారాల తర్వాత విక్టర్ ఇంటికొచ్చినప్పుడు అతని ముఖంలో విషాద మేఘాలు మరింతగా ముప్పిరిగొని ఉన్నాయి. "ఇప్పుడే మయ్యింది?" అన్నది లోరీ.

"ఎక్కడికెళ్ళినా వెల్డర్ అవసరం లేదని అంటున్నారు. డబ్బులన్ని అయిపోయాయి. ఈనెల ఇంటి అద్దె చెల్లించలేం. అందుకే నాకు చాలా దిగులుగా ఉంది" అని బదులిచ్చాడు.

విక్టర్! నాకు గూడ చాలా విషయాలను బట్టి దిగులుగా ఉంది. నేను చేసిన చెడుపనులను బట్టి దేవుడు నన్ను శిక్షస్తున్నాడేమోనని కొన్నిసార్లు అనిపిస్తుంది" అన్నది లోరీ.

నేను కూడ ఆ విషయం చాలాసార్లు ఆలోచిస్తున్నాను. నా స్నేహితులు కొందరు ధ్యానం కొరకు ఒక హిందూస్వామి దగ్గరికి ఈ రోజు రాత్రి వెళ్తున్నారని మా బంధువొకతను చెప్పాడు. మనం అది కూడా చేసి చూద్దాం. ఇంత వరకు మనం ఏ మతాన్ని పూర్తిగా అనుసరించలేదు కదా" అని బదులిచ్చాడు విక్టర్.

దానికి లోరీ ఆలోచనగా తలపంకిస్తూ "అది బాగానే ఉందనిపిస్తుంది. జీవితానికి లోతైన అర్థమేమిటో అన్వేషించాలని ఉంది. అంటే....మన జీవితాలకు! ఈ ప్రయోగం చేయడానికి నేను సిద్ధమే" అన్నది లోరీ.

"సరే మరి అక్కడే కలుసుకొందాం. ముందుగా నేను మన ఇంటి యజమానిని కలుస్తాను. అతని ఇల్లు దగ్గరే ఉంది. ఇంటి అద్దె కట్టడానికి కొంత సమయం ఇవ్వమని అడుగుతాను. అక్కడి నుండి స్వామి దగ్గరికి వస్తాను. నీవు నేరుగా అక్కడికి వెళ్ళు ఇదిగో అడ్రస్. నేను రావడం ఆలస్యం కావచ్చు" అన్నాడు విక్టర్.

విక్టర్ ఇచ్చిన అడ్రస్ స్పష్టంగా లేకపోవడంతో లోరీ తప్పుదారిలో వెళ్ళి వేరొక ఇంటికి చేరుకొంది. తలుపుతట్టి ధ్యానసమావేశం జరిగేది ఇక్కడేనా అని అడిగింది.

సుమారుగా లోరీ వయసే ఉన్న ఒక స్త్రీ "ధ్యానమా??" అవుననుకొంటా! మీరు సమయానికన్నా ముందే వచ్చినట్టున్నారు రండి!" అని ఆహ్వానించింది. "నా పేరు జూలీ. నా భర్త టినో ఈ బృందాన్ని నడిపించడంలో సహాయం చేస్తాడు ఈనాటి సమావేశాన్ని అతడే నడిపిస్తాడు. ఈలోగా మీరు టీ తీసుకొండి" అని సాదరంగా మాట్లాడింది.

కాసేపట్లో మరికొంత మంది వచ్చారు. వారిలో కొందరి దగ్గర బైబిళ్ళు ఉన్నాయి. వారు ఒకరికొరకు ఒకరు యేసుక్రీస్తు నామంలో ప్రార్థించడం లోరీ ఆశ్చర్యంగా విన్నది. ఒక మధ్యవయస్కురాలైన స్త్రీ తాను యేసు ప్రేమను ఎలా తెలుసుకొన్నదో వివరించింది. "నేను చాలా పాపం చేశాను క్షమించరానంత పాపం చేశానని అనుకొన్నాను. దేవుని కృప నా పాపాలన్నింటిని పరిహరించడానికి చాలినదని నాకు తెలియదు కాని...అంటూనే ఆనందంతో ఏడ్చేసింది.

మరొక వృద్ధుడు బిడియంగా చెప్పడం మొదలుపెట్టాడు. నలుగురిలో మాట్లాడడం అతనికి అలవాటు లేనట్టుగా అనిపించింది. "నా కొరకు మీరంతా ఎన్నో వారాలపాటు ప్రార్థించారు. నాకున్న "ఎంఫైసిమా" వ్యాధిని స్వస్థపర్చమని మీరు దేవున్ని వేడుకొన్నారు. ఆయన ఆ ప్రార్థనలు విన్నాడు. నా వ్యాధిని నయంచేశాడు. నేనే కొత్త మందు వాడానో చెప్పమని డాక్టర్ అడిగాడు. ఆ మందు ప్రార్థన అని నేను చెప్పాను. యేసు నామంలో ప్రార్థించడం ద్వారా స్వస్థత పొందానని వివరించాను. అదే అయ్యుండాలి. ఎందుకంటే నాకు తెలిసినంత వరకు ఈ విధమైన పూర్తి స్వస్థత ఏ విధంగాను సాధ్యంకాదని డాక్టరన్నాడు.

"దేవునికి స్తోత్రం!" అన్నది జూలీ వెంటనే. ఆమె ప్రక్కనే కూర్చున్న లోరీ అది విని చాలా ఆశ్చర్యపడింది.

ఒక యౌవనస్థుడు తన సాక్ష్యాన్ని ఇలా పంచుకొన్నాడు. "మీకు తెలుసుకదా నిషేధించబడిన మత్తు మందులకు బానిసనైన నా జీవితం ఎంత విషాదకరంగా ఎంత దయనీయంగా ఉండేదో! కానీ మన ప్రభువైన యేసుక్రీస్తు వాటి నుండి నన్ను విడుదల చేశాడు"

అందరూ తిరిగి దేవునికి స్తోత్రం చెల్లించారు. "నీవు దేవుని కృపలో ఎదిగేలా మేము నీకు సహాయపడ్తాం" అని టినో ఆ యౌవనస్థునికి అభయమిచ్చాడు.

"నన్ను కూడా మాట్లాడమని అడగరు కదా! ఇలా మాట్లాడడం నాకు చాలా క్రొత్తగా ఉంది" అని జూలీ చెవిలో గుసగుసగా చెప్పింది లోరీ.

"నీకు మాట్లాడాలని ఉంటేనే మాట్లాడు లోరీ" అన్నది జూలీ.

జూలీ భర్తయైన టినో విద్యావంతునిలా అన్పించాడు. అతని కళ్ళకు దళసరి కళ్ళద్దాలున్నాయి. ఒక ప్రొఫెసర్‌లా ఉన్నాడు. చక్కటి మీసంకట్టుతో స్పష్టంగా, కచ్చితంగా, ధైర్యంగా మాట్లాడుతున్నాడు. చిరునవ్వుతో కళకళలాడుతున్న అతని ముఖాన్ని చూస్తూ బహుశా నేనితన్ని నమ్మవచ్చునుకుంటా ఇతడు నమ్మదగిన వానిలా కన్పిస్తున్నాడు అనుకున్నది లోరీ!

"దేవుడు, కృపను గూర్చి ఏం చెప్తున్నాడో తెలుసుకోవడానికి మనం దేవుని వాక్యం చదువుదాం. దయచేసే రోమా 5వ అధ్యాయం చూడండి" అన్నాడు టినో. జూలీ లోరీకి ఒక బైబిల్ అందించింది. కాని ఆమె రోమీయులకు వ్రాయబడిన పత్రికను కనుక్కోలేకపోయింది. "నేను సాయం చేస్తానుండు!" మృదువుగా అన్నది జూలీ. ఆమె ఒక్కొక్కరినీ ఎలా పలుకరిస్తుందో వారి ఆరోగ్యం మరియు కుటుంబం గూర్చి ఎలా కుశల ప్రశ్నలడుగుతుందో, అందరికీ టీ అందిస్తూ నెమ్మదిగా ప్రశాంతంగా సమర్థవంతంగా ఎలా పనిచేస్తుందో లోరీ ఆసక్తిగా గమనించింది. ఆమె ముఖంలో ఎప్పుడూ కదలాడే నవ్వు అతిథులు ఎలాంటి మొహమాటం లేకుండా కలిసిపోయేలా తమ ఇంట్లో ఉన్నంత సౌకర్యంగా ఉండేలా చేస్తుందనిపించింది.

మత్తు మందును సేవించే అలవాటు నుండి విడుదల పొందిన యౌవనస్థుడు లోతైన భావంతో ఇలా చదివాడు. "పాపము మరణమును ఆధారము చేసికొని యేలాగు ఏలెనో, అలాగే నిత్యజీవము కలుగుటకై నీతి ద్వారా కృపయు

మన ప్రభువైన యేసు క్రీస్తు మూలముగా ఏలు నిమిత్తము పాపమెక్కడ విస్తరించెనో అక్కడ కృప అపరిమితముగా విస్తరించెను" "ఈ వాక్యం మనకు దేవుని గూర్చి ఏం తెలియజేస్తుంది?" అని ప్రశ్నించాడు టినో.

కొంతసేపు వారు దేవుని అనంతమైన కృపను గూర్చి చర్చించారు. ఆ తర్వాత టినో "కృపాప్రవాహనది" అని వివరించిన దేవుని కృపను గూర్చిన వాక్యాన్ని ఒక్కొక్కరు కొన్ని వచనాల చొప్పున అందరూ చదివారు.

ఒక నడివయస్కురాలైన స్త్రీ చదవడం మొదలు పెట్టింది. ఆమె పాత బట్టలు వేసుకొంది. చాలా పేదదానిలా అనిపించింది. "యెషయా 55:1 ఇలా వాగ్దానం చేస్తుంది. దప్పిగొనిన వారలారా నీళ్ళయొద్దకు రండి రూకలులేని వారలారా, మీరు వచ్చికొని భోజనము చేయుడి నాకీ వాగ్దానమంటే ఎంతో ఇష్టం అన్నదామె.

అద్భుతమైన విధానంలో స్వస్థత పొందిన వ్యక్తి కీర్తన 36:8-9 నెమ్మదిగా చదివాడు. "నీ మందిరము యొక్క సమృద్ధి వలన వారు సంతృప్తినొందుచున్నారు. నీ ఆనంద ప్రవాహము లోనికి నీవు వారికి త్రాగించుచున్నావు. నీ యొద్ద జీవపు ఊట కలదు"

బైబిల్‌లోని వేరువేరు గ్రంథాల నుండి ఒక్కొక్కరు ఒక్కొక్క వాక్యం చదువుతూ ఉంటే లోరీ హృదయపు లోతుల్లో ఏదో కదలిక మొదలయ్యింది. ఒక పది సంవత్సరాల అమ్మాయి సిగ్గుపడుతూ ప్రకటన 22:1 కంఠతా చెప్పింది. "మరియు స్ఫటికమువలె మెరయునట్టి జీవజలములనది దేవుని యొక్కయు, గొఱ్ఱెపిల్ల యొక్కయు సింహాసనము నొద్ద నుండి ఆ పట్టణపు రాజవీధి మధ్యను ప్రవహించుట ఆ దూత నాకు చూపెను. ఆ నది యొక్క ఈవలను ఆవలను జీవవృక్షముండెను అది నెలనెలకు ఫలించుచు పండ్రెండు కాపులు కాయును. ఆ వృక్షము యొక్క ఆకులు జనములను స్వస్థపర్చుటకై వినియోగించును.

ప్రకాశవంతమైన రంగురంగుల దుస్తులేసుకొన్న ఒక స్త్రీ హఠాత్తుగా లేచి నిలబడి నిశ్శబ్దంగా బయటికెళ్ళిపోయింది. సమావేశం జరుగుతున్నంతసేపు ఆమె ఏమీ మాట్లాడలేదు. ఆమె ముఖంలో ఏ భావమూ కనబడలేదు. ఆ తర్వాత దేవుని క్షమాపణను అనుభవించి ప్రస్తుతించిన మధ్య వయస్కురాలైన స్త్రీ ఆనందం ధ్వనించే స్వరంతో యోహాను 7:37-38 చదివింది. "ఆ పండుగలో మహాదినమైన అంత్యదినమున యేసు నిలిచి - ఎవరైనను దప్పిగొనిన యెడల నాయొద్దకు వచ్చి దప్పి తీర్చుకొనవలెను నా యందు విశ్వాసముంచువాడెవడో వాని కడుపులో నుండి జీవజలనదులు పారునని బిగ్గరగా చెప్పెను".

ఆ తర్వాత వారంతా ఇద్దరేసి ముగ్గురేసి గుంపులు గుంపులుగా కూర్చుండి ఒకరితో ఒకరు మాట్లాడుకోసాగారు. మరికొంతమంది ప్రార్థించడం మొదలుపెట్టారు. "ఇప్పటి వరకు సమావేశంలో మాట్లాడుకొన్న విషయమేమిటో నీ కర్థమయ్యిందా?" అని జూలీ లోరీని ప్రశ్నించింది.

"అంత బాగా అర్థం కాలేదు. ఈ కృపా ప్రవాహనది అనే దాన్ని గూర్చి నేనింతకుముందెన్నడూ వినలేదు. కాని అది చాలా ఆస్తికరంగా అనిపించింది అని బదులిచ్చింది లోరీ.

సమావేశం అయిపోయింది కాని ఎవరూ వెళ్ళడంలేదు కొంతమంది నిలబడి మాట్లాడుకొంటుంటే మరికొంతమంది గుంపులు గుంపులుగా కూర్చుండి ముచ్చటించుకొంటున్నారు. "టినో! దయచేసి "కృపాప్రవాహనది" అంటే ఏమిటో మాకు వివరిస్తావా?" అని భర్తనడిగింది జూలీ.

"ఓ తప్పకుండా! అన్నాడు టినో. వచ్చి లోరీ ఎదురుగా కూర్చుండి ఒక్క నిముషం తటపటాయించాడు. ఎలా మొదలుపెట్టాలా, ఎలా వివరించాలా అని ఆలోచిస్తున్నట్టు అనిపించాడు. హఠాత్తుగా అతని ముఖం సంతోషంతో వికసించింది. "కృప అనేది నాకిష్టమైన అంశం! మనంతంట మనం సంపాదించుకోలేని గొప్ప వరం దేవుని కృప! అది ఆయన యొక్క పరిపూర్ణమైన ప్రేమ అంతులేని దయ. మనమెప్పటికీ దానికర్హులం కాదు కేవలం విశ్వాసం ద్వారా మాత్రమే మనమాయన కృపను స్వీకరించగలం అప్పుడు యేసు క్రీస్తు మనలను మన పాపముల నుండి రక్షిస్తాడు మరియు ఆయన కృప ఈ భూమి మీద మన మిగిలిన జీవితకాలమంతా నిత్యజీవంలో ఎన్నిటెన్నటికీ కూడ మనతో

వుంటుంది. నేను దానిని ఒక ప్రవాహమని ఎందుకన్నానంటే "ఎక్కడ పాపం విస్తరించిందో అక్కడ కృప కూడ విస్తరించింది" అని దేవుని వాక్యం చెప్తుంది. అంతేకాదు పరలోకములో దేవుని సింహాసనం వద్ద నుండి స్వస్థపర్చే శక్తి ఉన్న జీవజలములనది ప్రవహిస్తుందని మరొక వాక్యభాగం వివరిస్తుంది".

"ఆ వాక్యమెక్కడుంది?" అడిగింది లోరీ.

"మన రక్షకుడైన యేసు క్రీస్తునందు విశ్వాముంచు, ఆయన నీ పాపాలు క్షమిస్తాడు. తండ్రియైన దేవుని నుండి పరిశుద్ధాత్మ ప్రవహించి విశ్వాసులందరికి సమృద్ధియైన జీవాన్నిస్తుంది. లోరీ! ఆయన నీకు కూడా నూతనమైన, స్వచ్ఛమైన, సమృద్ధియైన నిత్యజీవాన్నిస్తానని వాగ్దానం చేస్తున్నాడు. అది పూర్తిగా ఉచితమైంది దేవుని యొక్క అద్భుతమైన బహుమానం. ప్రభువైన యేసు పరలోకంలో ఉన్న తండ్రియైన దేవునికి సర్వశక్తిమంతుడైన ఏకైక దేవునికి ప్రార్థించి మనకొరకు తన పరిశుద్ధాత్మను పంపమని కోరినట్టుగా యోహాను 14:16–17లో వ్రాయబడి ఉంది. దేవుని కృపను మనవద్దకు తీసుకొని వచ్చే నది ఆయన!"

"నేనింతకు ముందెన్నడూ దీని గూర్చి వినలేదు అని ఒప్పుకొంది లోరీ. మనం చేసిన పాపాలు లేదా మంచి పనులనుబట్టి దేవుడు మనకు తీర్పుతీరుస్తాడని విన్నాను. నా తల్లిదండ్రులుగానీ లేదా ఉపాధ్యాయులు గానీ కృప అనే అద్భుతమైన విషయం గూర్చి ఎప్పుడూ ఎందుకు చెప్పలేదో నాకు ఆశ్చర్యంగా ఉంది! అన్నది లోరీ."

మన శత్రువైన సాతాను మనుషులకు ఆత్మీయ అంధత్వం కలిగిస్తాడని బైబిల్ స్పష్టంగా తెలియజేస్తుంది. ధారాళంగా ప్రవహించే కృప నుండి అపవాది మన దృష్టిని ప్రక్కకు మరల్చుతాడు. మనుషులెవరూ గ్రహించలేని అనంతమైన తన జ్ఞానంతో దేవుడు సాతానునలా చేయనిస్తాడు. మన నమ్మకాన్ని పరీక్షించేందుకై సాతాను మనకు అబద్ధం చెప్పడానికి ఆయన అనుమతిస్తాడు. మనం సాతానును ఎదిరించి దేవుని కృప మన జీవితాలలోకి ప్రవహించేలా చేసుకోవాలి. కొంత మంది సాతాను అబద్ధాలను నమ్మడానికి ఇష్టపడతారు ఎందుకంటే వారు తమ జీవితాలను తామే నియంత్రించుకోవాలనుకొంటారు. దేవున్ని తమ హృదయాల లోకి రానివ్వరు. దేవుని ఆత్మ తమలో విశ్వాసం పుట్టించడానికి వారు ఇష్టపడరు. మన రక్షకుడైన యేసుక్రీస్తు నందు మనం విశ్వాసముంచినప్పుడు పొందే దేవుని ప్రేమను నీవు గుర్తించడానికి మేము సహాయపడడానికి అనుమతిస్తావని అనుకొంటున్నాను" అని వివరించాడు టినో.

"మీరంతా ఈరోజు సమావేశమైన తర్వాత సభ నడిచిన విధానమేనా ధ్యానించడమంటే? నీ భర్త టినో స్వామీజీనా?" అని జూలీ నడిగింది లోరీ.

"అయ్యో కాదు! ఆ స్వామి బృందం వారు ఈ వీధిలో అటువైపు ఇంట్లో సమావేశమౌతారు. ఆయన మరియు అతని అనుచరులు ఈ పాటికి మత్తు మందు సేవించి జోగుతూ ఉంటారు. మాది క్రైస్తవ బృందం, ఒక గృహకూడిక ఇది. అంటే ఒక చిన్న సంఘమన్న మాట. నీవిక్కడికి పొరపాటున వచ్చావా?" అడిగింది జూలీ.

ఇది నేను చేసిన అదృష్టకరమైన అత్యుత్తమమైన పొరపాటు! నేనిటువంటి సంతోషాన్ని, ప్రేమను ఎప్పుడూ చూడలేదు" ఆనందంగా ఉన్నది లోరీ.

## 2వ అధ్యాయం

## విక్టర్ మరియు లోరీ నిత్యరక్షణను గూర్చిన నిశ్చయతను పొందుట

ఇంటికి వచ్చిన తర్వాత లోరీ విక్టర్‌కు దేవుని కృప అనే అద్భుతమైన నదిని గూర్చి చెప్పడానికి ప్రయత్నించింది. "అది చాలా పెద్దది ఆ స్వామీజీఅంటే ఆ క్రైస్తవ గురువు లేదా అతన్నేమని పిలుస్తారోగానీ అతడు, ఆ కృపాప్రవాహనది అమెజాన్ నదికన్నా, నైలునది కన్నా, గంగానదికన్నా పెద్దదనీ వాటన్నింటిని కలిపినా దానికి సాటిరావనీ చెప్పాడు. అది పరలోకంలో దేవుని సింహాసనం వద్ద నుండి నిరంతరాయంగా ఎల్లప్పుడూ ప్రవహిస్తుందట" అని అన్నది.

"ఏం మాట్లాడుతున్నావ్? అటువంటి నది ఈ భూమిమీద లేనేలేదు!" అన్నాడు విక్టర్.

“వారి నాయకుడైన టినో ఏమన్నాడంటే మనం ఎప్పుడనుకొంటే అప్పుడు, దానిలోని నీరు త్రాగడానికి వీలైనంత దగ్గరగా ఆ కృపాప్రవాహముందట. ఎందుకంటే దేవుని పరిశుద్ధాత్మ మనం పీల్చేగాలి ఎంత సన్నిహితంగా ఉందో మనకంత సన్నిహితంగా ఉన్నాడట” వివరించింది లోరీ.

“వారు క్రైస్తవులా?” అడిగాడు విక్టర్.

“మేము యేసుక్రీస్తును ప్రేమించేవారమని వాళ్ళు చెప్పారు. ఆయనను గూర్చి చాలా మాట్లాడారు కూడ. దేవుని యందలి మన విశ్వాసం ఎప్పుడైతే బలహీనమవుతుంతో అప్పుడు మనం సాతాను అబద్ధాలను వింటామని జీవజలంపై నుండి మన దృష్టిని తిప్పుకొంటామని ఆ బృందం నాయకుడు టినో అన్నాడు. మన ప్రాణాలు దాహంగొంటాయి మన ఆత్మలు శుష్కించిపోతాయి అంతేకాదు దేవుని కృపను మనం అనుమానిస్తే మనం చట్టపరంగా జీవించే వారమౌతామట” అని చెప్పింది లోరీ.

“ఆగు! నేను చెప్పేది విను! అక్కడ నీవేం తాగావు? ఏవైన మందులు వేసుకొన్నారా చట్టబద్ధమైన జీవితం అంటే వారి ఉద్ధేశం ఏమిటి? అని ప్రశ్నించాడు విక్టర్.”

“అబ్బా! ఎన్ని ప్రశ్నలు!! ప్రాముఖ్యత లేని మతాచారాలను పాటించి మనలను మనం పవిత్రులనుగా చేసుకోవడానికి ప్రయత్నించడమే వారి ఉద్దేశంలో చట్టబద్ధమైన జీవితం అని నేననుకొంటాను. మనం కృపానదికి లేదా కృపాప్రవాహానికి దూరంగా వెళ్ళడమేకాక ఇతరులు దానిలో నుండి ఉచితంగా త్రాగకుండా ఆటంకపరుస్తాం. మన హృదయాలలో దేవుడు చేయవల్సిన పనికి బదులుగా మానవ ఆచారాలను మతపరమైన కార్యాలను ప్రతిష్టించుకొంటాం అని వివరించింది లోరీ.”

“వారేదైనా ఘాటైన వాసనగల ధూపం వేశారా? వికృతమైన పటాలతో గదిని అలంకరించారా? మంత్రతంత్రాలతో కూడిన భయంకరమైన సంగీతం ఎలక్ట్రానిక్ పరికరాల నుండి వినిపించబడిందా?” అడిగాడు విక్టర్.

“ఓహ్! లేదు! అసలలాంటి వాతావారణమే లేదు విక్టర్! దేవుని కృప మనకు ప్రేమను, సంతోషాన్ని మరియు క్షమాపణను అనుగ్రహిస్తుందని వారన్నారు. అది దేవుని నుండి మనుషులలోకి ప్రవహిస్తుందని అన్నారు. ఎలక్ట్రానిక్ పరికారాల ద్వారానో లేదా అందమైన భవనాల ద్వారానో లేక ఘాటైన వాసనగల ధూపం, మంత్రోచ్ఛారణ ద్వారానో కాదు!” అన్నది లోరీ.

ఆ తర్వాత, టినో మరియు జూలీ విక్టర్ మరియు లోరీలను దర్శించారు. “మేము మీకు క్రీస్తు మరణం మరియు పునరుత్థానం గూర్చిన యదార్ధగాథను అంటే సువార్తను తెలియజేయవచ్చా? తన యందు విశ్వాసముంచి దేవునివైపు తిరిగే వారందరికి పాపక్షమాపణ మరియు నిత్యజీవం దయచేస్తానని యేసు వాగ్ధానం చేశాడు” అని విక్టర్‌ను అడిగాడు టినో.

“అలాగే! దయచేసి వివరించండి లోరీ టీ తీసుకురా” అన్నాడు విక్టర్.

టినో బైబిల్ నుండి లూకా 24:46–48 వచనాలు చదివి, “మన పాపముల నుండి మనలను రక్షించి, నిత్యజీవ మివ్వడానికై యేసు మరణించి పునరుత్థానుడైనాడన్న సువార్తను అంగీకరించి, దేవునివైపు తిరిగే ప్రజలందరిని, వారే దేశపువారైనా దేవుడు క్షమిస్తాడు” అని సంక్షిప్తంగా వివరించాడు.

వినడానికి అది చాలా బాగుంది! కానీ దానిలో వాస్తవమెంతుందో! అంటూ దాన్ని గూర్చి అనేక ప్రశ్నలడిగాడు విక్టర్.

జూలీ, టినోలు వెళ్ళిబోయే ముందు, మరుసటి రోజు టినో ఇంట్లో జరగబోయే సమావేశానికి విక్టర్ మరియు లోరీలను ఆహ్వానించారు. ఆ సమావేశంలో ఇష్మాయేలు అనే ఒక పెద్దాయన విక్టర్‌తో “నీవు వెల్డర్‌వని విన్నాను. నాకొక చిన్న వర్క్‌షాప్ ఉంది. అక్కడ ఒక వెల్డర్ కావాలి” అన్నాడు.

మరుసటి రోజే విక్టర్ ఇష్మాయేలు వర్క్‌షాప్‌లో పనికి కుదిరాడు. ఆ రాత్రి లోరీని దగ్గరికి తీసుకొని “మనం కూడా క్రైస్తవులవలె ప్రార్థన చేద్దామా. నాక్రొత్త ఉద్యోగం కొరకు దేవునికి వందనాలు తెలుపుదాం” అన్నాడు.

"నా స్వంత పదాలనుపయోగించి మన స్నేహితులవలె ప్రార్థన చేయడం ఇదే మొదటిసారి" అని ఆనందించాడు.

ఆ తర్వాత జరిగిన సమావేశంలో విక్టర్ మరియు లోరీ, సర్వశక్తిమంతుడు అద్వితీయుడైన దేవుని కుమారుడగు యేసును ప్రార్థించి తమ పాపాలను క్షమించి, తమ్మును రక్షించమని వేడుకొన్నారు. సమావేశానంతరం చాలా మంది విశ్వాసులు ఆగి వారితో మాట్లాడి వెళ్లారు.

"నా కెంతో ప్రశాంతంగా భారం దిగిపోయినట్లుగా ఉంది" అన్నది లోరీ. "మీరు పశ్చాత్తాపపడి ప్రభువైన యేసుక్రీస్తు నందు విశ్వాసముంచారు గనుక ఇప్పుడు బాప్తీస్మం పొందాలి" అన్నాడు టినో.

ఆగు టినో! అన్నాడు ఇష్మాయేల్, విక్టర్ పనిచేసే వర్క్‌షాప్ యజమాని. "తాము మారుమనస్సు పొందామన్న దానికి ఋజువుగా వారు తమ జీవితాలను ముందు క్రమపర్చుకోవాలి అవెంత చిన్ని విషయాలైనా సరే! వర్క్‌షాప్‌లో పనిచేసే సమయంలో విక్టర్ చేసిన పని సరిగ్గా కాకపోతే, అతడు బూతు పదాలు ఉపయోగిస్తాడు. లోరీ నీవుకుడా ఒక క్రైస్తవురాలిగా వస్త్రధారణ చేయడం నేర్చుకోవాలి. నీవు చాలా కాస్మటిక్స్ వాడుతున్నట్టనిపిస్తుంది.విక్టర్ నీవు సిగరెట్ త్రాగడం మానేయాలి. మీరు కనీసం ఒక సంవత్సరమన్నా ఆగి మా సిద్ధాంతాలన్నీ నేర్చుకోవాలి. ఆ సమయంలో మీరే పాపంలో పడకుండా నిలబడగలిగితే మేము మీకు బాప్తీస్మమిస్తాము" అన్నాడు. అతడు మాట్లాడేది చాలా అన్యాయంగా అనిపించింది లోరీకి. అతనికా మాట చెప్పాలనుకొంది కాని అంత కచ్చితంగా మాట్లాడే వ్యక్తిని ధైర్యంగా ఎదుర్కొలేకపోయింది. ఇష్మాయేలు రూపం కూడ గంభీరమైనదే. విశాలమైన ఛాతి, కండలు తేలిన బలమైన చేతులతో పట్టుదలను సూచించే ముఖంతో చూడగానే ఒక రకమైన భయంకలిగేది. అతడెప్పుడూ నవ్వేవాడు కాదు.

కాని టినో అతని మాటలకు అభ్యంతరం చెప్పాడు. "ఇష్మాయేల్! నూతనంగా మారుమనస్సు పొందినవారి విశ్వాసాన్ని బలపర్చడానికి అపొస్తలులు చెప్పిన పద్ధతి ఇది కాదు అన్నాడు.

ఇష్మాయేలు అది పట్టించుకోలేదు. ఒక కాగితం విక్టర్‌కిస్తూ క్రొత్త విశ్వాసులు పాటించవల్సిన నియమాలు దానిలో ఉన్నాయి. వాటి ప్రకారం నడుచకొన్నప్పుడు మీరు మా బృందంలో సభ్యులౌతారు. క్రొత్త సభ్యులంతా మొదట మత్తు మందులు, మద్యపానం, అశ్లీల సాహిత్యం, పేకాట, అన్ని రకాల నాట్యం. పొగత్రాగడం, బూతులు మాట్లాడడం, ఈ లోకపు సంగీతం మొదలైనవన్నీ వదలిపెట్టాలి. అవన్నీ ఈ జాబితాలో ఉన్నాయి. వారానికి ఒకరోజు ఉపవాసముండాలి. రోజూ కనీసం రెండు గంటలు ప్రార్థనలో గడపాలి. మీరు పూర్తిగా పరిశుద్ధ జీవితం జీవిస్తున్నారని మాకు ఋజువు చేయాలి.

"ఈ విధమైన ఆలోచనా విధానం ఇష్మాయేలుకు ఏదో తప్పు పద్ధతిలో అబ్బింది. మానవులు దేవుని కృపను గుర్తించకుండా చేయడానికి సాతాను ఉపయోగించే ఆయుధాలలో ఒకదాని ఫలితమే ఇష్మాయేలు వ్రాసిన నియమాల జాబితా. దీనిపేరే "చట్టబద్ధమైన లేదా నియమానుసారమైన జీవితం" అని లోరీ చెవిలో గుసగుసగా చెప్పింది జూలీ.

జూలీ గుసగుసగా మాట్లాడడం గమనించిన ఇష్మాయేలు స్వరం స్థాయి పెరిగింది, కోపంగా మారింది. 'మనం దేవుని కృప విషయంలో జాగ్రత్తగా ఉండాలి. టినో చెప్పినంత వేగంగా మనం ముందుకు పోలేం. ఒక పాపి మారుమనస్సు పొంది క్రైస్తవుడైనప్పుడు, ఈ జాబితాలో ఉన్న పాపాలన్నీ వదిలిపెట్టి మతాచారాలన్నీ పాటించడం ద్వారా మన సమ్మతిని పొందాలి" అన్నాడు.

ఇష్మాయేల్ విక్టర్ కిచ్చిన కాగితంలోని జాబితాను లోరీ చదవడం మొదలుపెట్టింది. "నీవు కూడా మా సిద్ధాంతాలన్నీ నేర్చుకోవాలి. నా దగ్గర డెబ్భైతొమ్మిది సిద్ధాంతాలున్న మరొక జాబితా ఉంది. మీరు మా బృందంలో సభ్యత్వం పొందడానికి ముందు అవన్నీ నేర్చుకోవాలి" అన్నాడు ఇష్మాయేల్ లోరీతో.

లోరీ ఆ జాబితాను విక్టర్‌కు అందించి "దీనిలోని అంశాలన్నీ నేనెప్పటికీ గుర్తుపెట్టుకోలేను" అన్నది.

విక్టర్ ఆ జాబితాను తిరిగి ఇష్మాయేలుకు ఇచ్చాడు. "ఈ జాబితా మమ్మల్ని ఈ బృందానికి దూరం చేస్తుంది. మాకు ఇది ఆచరణ సాధ్యమని అన్పించడంలేదు. సారీ!" అన్నాడు.

విక్టర్ చెప్పిన మాటలు విన్న టినో ఇష్మాయేలును మృదువుగా గద్దించాడు. "ఈ నూతన విశ్వాసులకు శక్తికిమించిన నియయమాలను విధిస్తున్నావు. దేవుని దృష్టిలో వారిప్పుడే ఆత్మీయంగా జన్మించిన శిశువులు. ఈ ఆత్మీయ శిశువులను ఇప్పుడే పరిణితి చెందిన క్రైస్తవులుచేసే పనులు చేయమంటున్నావు వారు ఈ సిద్ధాంతాలన్నీ నేర్చుకొని ప్రతిచిన్న విషయంలో తాము పరిపూర్ణులమని ఋజువు చేసుకొనేదాక మనం వారిని స్వీకరించకపోతే వారినెంతో నిరుత్సాహపర్చినవారమౌతాము. దీనిలో చేయకూడని పనులంటూ నీవు నిషేధించిన విషయాలు నీ వ్యక్తిగత అభిప్రాయాలు. అవి వాక్యాధారమైనవి కావు. విక్టర్ మరియు లోరీలకు దేవుని కృపను గూర్చిన నిశ్చయత కావాలి" అని చెప్తూ అపొస్తలుల కార్యముల గ్రంథంలో నుండి నూతన విశ్వాసులు మారుమనస్సు పొందిన వెంటనే ఆలస్యం చేయకుండా తమ రక్షణను నిర్ధారించడానికి ఏ విధంగా బాప్తీస్మం పొందారో చదివి వినిపించాడు.

ఇష్మాయేల్ ఒక్క నిముషం విని కోపంగా "ఆ రోజుల్లో పరిస్థితులు వేరు" అన్నాడు.

అప్పుడు టినో "ఇష్మాయేల్! లోరీ మరియు విక్టర్‌లు ఆత్మీయంగా ఇప్పుడే పుట్టిన శిశువులని మర్చిపోయావా? వారు ఆత్మీయంగా శిశువులు! నీవు పుట్టినప్పుడు, పొత్తిగుడ్డలను పాడుచేయడం మానేదాకా నిన్ను ముట్టుకోనని మీ అమ్మ నిన్ను ఇంటిబయట చలిలో, వానలో వదిలేసిందా? అదే విధంగా నూతన విశ్వాసులను మనం వెంటనే సంఘమనే వెచ్చదనంలోకి చేర్చుకోవాలి అపొస్తలులెప్పుడూ అలాగే చేశారు. నూతన విశ్వాసలను సంఘంలో చేర్చుకోకుండా వేచి ఉండమని అపొస్తలులెప్పుడూ చెప్పలేదు. ఎంత చెడ్డవారైనా యేసు నంగీకరించినప్పుడు అపొస్తలులు వెంటనే బాప్తీస్మమిచ్చేవారు. దేవుని గురించి బాగా తెలిసిన యూదులైనా, ఆయనను గూర్చి మొదటిసారిగా అప్పుడే తెలుసుకొన్న అన్యులైనా వెంటనే బాప్తీస్మం పొందేవారు. నూతన విశ్వాసులు చేసిన మొట్టమొదటి పని బాప్తీస్మం పొందడం" అంటూ నచ్చజెప్పాడు.

ఆ వారంలోనే టినో ఆ యువజంటకు బాప్తీస్మమిచ్చాడు. వారు చాలా ఆనందించారు. కాని అదే సమయంలో ఇష్మాయేలు చెప్పిన విషయాలను బట్టి ఆందోళన చెందారు. తర్వాత సమావేశంలో ఆరాధన ప్రారంభించడానికి ముందు టినో వారిద్దరినీ ఆ బృందం యొక్క క్రొత్త సభ్యులుగా పరిచయం చేయాలనుకొన్నాడు. కాని ఇష్మాయేలు కలుగజేసుకొని "నా మాట విను! ఇంకా తమ జీవితాలలో పాపానికి చోటిచ్చేవారిని మన బృందంలో సభ్యులుగా చేర్చుకోలేం!" అన్నాడు.

"అపొస్తలులు అటువంటి వారిని స్వీకరించారు ఇష్మాయేల్" అన్నాడు టినో నెమ్మదిగా, చిరునవ్వు చెదరిపోకుండా. క్రొత్త విశ్వాసులను ఖండించి గాయపర్చకుండా వారినెలా సరిదిద్దాలో అపొస్తలులు మనకు మాదిరి చూపించారు. అపొస్తలుడైన పౌలు కొరింథి సంఘంలోని క్రైస్తవులలో ఉన్న ఘోరమైన పాపాలను వారి ఆత్మలను ఖండించకుండా చక్కదిద్దాడు. దేవుని కృపచేత ఆయన బిడ్డలుగా దత్తతచేసుకోబడిన వారుగా వారి స్థానమేమిటో పాపంచేసిన వారికి మృదువుగా జ్ఞాపకం చేశాడు. ఆ తర్వాత దేవుని కుమారులుగా, క్రీస్తుతోటి వారసులుగా అవిశ్వాసులవలె జీవించవద్దని ఉపదేశించాడు అందుకని...

అతడింకా పూర్తి చేయకముందే ఇష్మాయేల్ దేవుని రాజ్యంలోకి ప్రవేశం నీవు చాలా సులభం చేస్తున్నావు టినో! క్రైస్తవుడు కావడమనేది చాలా ప్రాముఖ్యమైన విషయం అంత, సులభంకాదు. ఉదాహరణకు, సబ్బాతు దినాన పనిచేసిన వారిని రాళ్ళతో కొట్టాలని పాతనిబంధన చెప్తుంది" అన్నాడు.

"ఇష్మాయేలు దయచేసి నన్ను పూర్తిగా చెప్పనివ్వు!" టినో బ్రతిమిలాడాడు. క్రొత్తగా విశ్వాసంలోకి వచ్చిన వారిలో లోపాలుంటాయి, తప్పులుంటాయి వాటిలో కొన్ని ప్రస్ఫుటంగా కన్పిస్తాయి. కొన్ని కన్పించవు. అందుకే గొఱ్ఱెలను మృదువుగా కాయడానికి, సరియైన దారిలో నడిపించడానికి దేవుడు సంఘాలకు కాపరుల నిచ్చాడు. క్రొత్త నిబంధనలో బాప్తీస్మము చెడ్డవారి కొరకే. విక్టర్ మరియు లోరీ పశ్చాత్తాప్త హృదయాలతో తమ పాపాలు ఒప్పుకొన్నారు. గనుక వారు బాప్తీస్మం పొందడానికి అర్హులు.

"నీవు మన సంఘం యొక్క స్థాయిని దిగజారుస్తున్నావ్!" కోపంగా అన్నాడు ఇష్మాయేల్.

"నీవు దేవుని కృపను తక్కువచేసి మాట్లాడుతున్నావ్" స్థిరంగా జవాబిచ్చాడు టినో. "మతపెద్దలు బాప్తీస్మమిచ్చే యోహాను దగ్గరికి వచ్చి బాప్తీస్మమివ్వమని అడిగినప్పుడు, వారు తమ్మును తాము మంచివారని అనుకొంటున్నారు గనుక అతడు వారిని సర్పాలని అంటూ బాప్తీస్మమివ్వడానికి తిరస్కరించాడు. కాని తమ పాపాలను ఒప్పుకొని పశ్చాత్తాపపడిన దుష్టులకు అతడు వెంటనే బాప్తీస్మమిచ్చాడు. ఎవరైతే తమ పాపాలను బట్టి పశ్చాత్తాపపడి యేసునందు విశ్వాసముంచారో వారందరికీ అపొస్తలులు బాప్తీస్మమిచ్చి ఆ తర్వాత బోధించి వారిని విశ్వాసంలో స్థిరపర్చారు. ఆ తర్వాత క్రీస్తు శరీరంలో అంటే సంఘంలో, పరిశుద్ధాత్ముడు పనిచేస్తుండగా వారి చెడు అలవాట్లను సరిదిద్దారు. వారికి ప్రేమపూర్వక నడిపింపును సంరక్షణను ఇచ్చారు. బాప్తీస్మమివ్వడానికి మనం నియమాలను నిర్దేశించకూడదు" అని వివరించాడు.

"కాని అప్పటికీ ఇప్పటికీ పరిస్థితులెంతో మారిపోయాయి" అన్నాడు ఇష్మాయేలు మళ్ళీ.

"అవును నిజమే! సమాజమెంతో మారిపోయింది. సాంకేతిక అభివృద్ధి జరిగింది కాని అది కేవలం భౌతిక విషయాలలోనే. బాప్తీస్మానికి సంబంధించిన ఆత్మీయ వాస్తవాలు మారలేదు. పాపం ఎప్పుడూ పాపమే. కృప ఎప్పుడూ కృపయే. యేసు ఎప్పుడూ ఒకే విధంగా ఉంటాడు. క్రొత్తగా జన్మించిన దేవుని గొర్రెపిల్లలకు దేవుని కృపను ఉచితంగా, ధారాళంగా అందించే బాధ్యత సంఘానికి ఈనాడు కూడ ఉంది అది మారలేదు పౌలు దమస్కుకు వెళ్తున్నప్పుడు దారిలో అతనికి కృప ఎంత అవసరమయ్యిందో, విక్టర్ మరియు లోరీకి కూడా అంతే అవసరం.

ఇష్మాయేలు ఆ యువజంటవైపొకసారి చూశాడు. "టినో ఏం చెప్తున్నాడో నాకనవసరం! విక్టర్ నీవు నా దగ్గర పనిచేస్తున్నావు గనుక నేను చెప్పినట్టు వినాలి' అన్నాడు.

"వాళ్ళు యేసు చెప్పినట్టు వింటారు ఆయనకు లోబడతారు" అన్నాడు టినో. "దయచేసి అర్థం చేసుకో ఇష్మాయేల్! యేసు ఏం చేయమని చెప్పాడో అవే చేయమని నూతన విశ్వాసులకు చెప్తాం. వారు ప్రేమతో యేసుకు లోబడతారేగాని మనం భయపెట్టినందుకు కాదు. అపొస్తలులు నూతన విశ్వాసులకు చెప్పినవి కాక మరే ఇతర పనులు చేయమని వారిని బలవంతపెట్టే హక్కు మనకు లేదు. వారిని బెదిరించే అధికారంలేదు. వారు క్రీస్తుకు లోబడడానికి బదులుగా నీకు లోబడాలని అనుకొంటున్నావా? ఇష్మాయేల్! యేసును వెంబడించడానికి బదులుగా నిన్ను వెంబడించాలనీ యేసు మరియు ఆయన అపొస్తలుల ఆజ్ఞలు పాటించడానికి బదులుగా నీ ఆజ్ఞలు పాటించాలని ఆశిస్తున్నావా? అని నిలదీశాడు.

ఆ ప్రశ్నలకు బదులివ్వకుండా "నేనొక అతిథిని మీకు పరిచయం చేయాలనుకొంటున్నాను" అన్నాడు ఇష్మాయేల్. వారి మధ్య చర్చ ప్రారంభమైన కొంతసేపటికే ఒక వ్యక్తి ఆ గదిలోకి ప్రవేశించాడు. ఆ వ్యక్తిని విక్టర్ మరియు లోరీ ఇంతకుముందెన్నడూ చూడలేదు. "అసాధారణమైన ఆత్మీయ తృష్ట మరియు ఆత్మీయ జ్ఞానం కలిగిన వ్యక్తి ఆర్థర్. మనందరం హాయిగా నిద్రపోయే రాత్రి సమయంలో అతడు టాక్సీ నడిపిస్తాడు. పగలంతా దేవునిసేవ చేస్తాడు. అతడెప్పుడు నిద్రపోతాడో తెలియదు" అన్నాడు.

అందరూ ఆర్థర్‌కు ఆహ్వానం పలికారు. తర్వాత "మేమింతసేపు చర్చించిన దానిపై నీ అభిప్రాయమేమిటి ఆర్థర్?" అని అడిగాడు ఇష్మాయేల్.

"వారానికి ఒకసారి ఉపవాసముండాలన్న మాట నాకు నచ్చింది. మీ జాబితాలో చేర్చడానికి ఇంకా, చాలా అంశాలు నా దగ్గరున్నాయి. కచ్చితమైన, కఠినమైన నియమాలు పాటించే సహవాసమే ఆత్మీయత కలిగిన సహవాసం! అవును క్రొత్త సభ్యులు యదార్థంగా నడుచుకొంటున్నారో లేదో కచ్చితంగా తెలుసుకొండి!" అన్నాడు ఆర్థర్.

ఇష్మాయేల్ మరియు ఆర్థర్, నూతన విశ్వాసులపై అన్ని నిమయాలు విధించాలన్న మీ కోరిక మనలను తిరిగి పాత నిబంధనకు తీసుకువెళ్తుంది" అని అర్థింపుగా అన్నాడు టినో. ఆందోళనతో నిండిన విక్టర్ మరియు లోరీల ముఖాలు చూసి, ఈ విషయాలు మనమిప్పుడు చర్చించకపోతే మంచిది అన్నాడు.

ఆ మాటలను ఆర్థర్ ఎంత మాత్రం పట్టించుకోకుండా "ఒక నిజమైన క్రైస్తవుడు" ఏయే విషయాలు పాటించాలని తాను నమ్ముతున్నాడో అవన్నీ విక్టర్‌కు చెప్పాడు. తర్వాత టినోతో "అయినా కొన్ని పాతనిబంధన నియమాలు పాటిస్తే

తప్పేమిటి?” అన్నాడు.

“నియమాలు పాటించడం కాదు పాత నిబంధన దృక్పథం ఉండడం తప్పు పాతనిబంధన ధర్మశాస్త్రం క్రింద మనుషులు తమ స్వంత పనులను బట్టి దేవుని అనుగ్రహాన్ని పొందడానికి ప్రయత్నించారు. క్రీస్తు తన రక్తంతో ముద్రించిన క్రొత్త నిబంధన మాత్రం విశ్వాసం ద్వారా దేవుని కృపను పొందే అవకాశం కల్పిస్తుంది. మన స్వంత ప్రయత్నాలను బట్టికాక, మరణం జయించి లేచిన క్రీస్తును బట్టి దేవుడు తన కృపద్వారా మనలను తన చేతులలో సురక్షితంగా కాపాడుతాడు. విక్టర్ మరియు లోరీ వంటి నూతన విశ్వాసులు సమృద్ధియైన దయను, ప్రేమను మరియు శాంతి సమాధానాలను అనుభవించవచ్చని ఎఫెసి 1 అధ్యాయం చెప్తుంది” అన్నాడు టినో.

“అవుననుకోండి! మా సభ్యులందరూ వారి సంపాదనలో పదవ వంతుకన్నా ఎక్కువ ఇవ్వాలని నేను చెప్తాను. వారు దేవుని సేవకు సహాయపడాలి. వారిచ్చే డబ్బుతో మేమేం చేయగలిగామో తెలుసా? మేమొక అందమైన, ఖరీదైన ఫుల్‌పీట్‌ను కొన్నాం. అలాంటివే ఇంకెన్నో చేయగల స్తోమత మాకిప్పుడు ఉంది. విశ్వాసులందరూ అధికంగా ఇచ్చేలా నేను చేశాను. అవును వారు నిజంగా నమ్ముతున్నారని ఋజువు చేయడానికి అదొక మార్గం.”

“ఆర్థర్ కళ్ళు నాకు గుడ్లగూబ కళ్ళలా అన్పిస్తున్నాయి” విక్టర్‌తో నెమ్మదిగా అన్నది లోరీ.

ఆ టాక్సీ డ్రైవర్ ఏకధాటిగా అలా మాట్లాడుతూనే ఉన్నాడు. మధ్య మధ్యలో పెదాలు తడుపుకోవడానికి మాత్రమే ఆగుతున్నాడు. మెషీన్‌గన్ నుండి వచ్చే తూటాలలాగ పేలుతున్నాయి అతని మాటలు. అందరినీ ఒకేసారి చూడడానికో లేక ఆసక్తిగా చూసే వాళ్ళను తప్పించుకోవడానికో అన్నట్టుగా అతడు అటూ ఇటూ వేగంగా కలియజూస్తున్నాడు. అయితే ఎవరైనా ఒకరితో మాట్లాడేటప్పుడు మాత్రం ఒక విగ్రహంలాగా ముందుకు వంగి వాళ్ళ కళ్ళలోకి తీక్షణంగా, కళ్ళార్పకుండా చూస్తూ దాడిచేయడానికి సిద్ధంగా ఉన్న సింహంలా కనిపించాడు.

ఆ తర్వాత అందరూ చిన్న చిన్న గుంపులుగా ఏర్పడి, వాళ్ళు నేర్చుకొన్నదాన్ని గూర్చి చర్చించసాగారు. ఆ తర్వాతి కార్యక్రమాలకు ప్రణాళికలను తయారు చేసుకొని ఒకరి కొరకు ఒకరు ప్రార్థించారు. టినో మాత్రం విక్టర్ మరియు లోరీలతో కూర్చున్నాడు. “దేవుని అనుగ్రహం మరియు ఆయన సమ్మతి పొందాలంటే, ఆర్థర్ చెప్పినవన్నీ చేయాల్సిన అవసరం లేదంటారా?” అని అడిగాడు విక్టర్.

“మనం మంచి పనులుచేస్తే దేవుడు తప్పక ఆనందిస్తాడు విక్టర్! మీరిప్పుడు చేసిన మంచి పనులకు ఆయన పరలోకంలో బహుమానమిస్తాడు కాని మన మంచి పనులు మనలను రక్షించలేవు. కేవలం క్రీస్తు మాత్రమే మనలను రక్షించగలడు. దాని కొరకు తన మరణ పునరుత్థానాలలో మనం విశ్వాసం ద్వారా పాలుపొందేలా ఆయన చేశాడు. దేవున్ని సంతోషపెట్టడానికి మంచి పనులు అవసరమే కాని దేవుని రక్షణ యొక్క ఫలితంగా రూపాంతరపర్చే ఆయన శక్తి మనలో ఉన్నప్పుడే మనం మంచి పనులు చేయగలం.”

మరుసటి రోజు టినో విక్టర్ మరియు లోరీలను దర్శించాడు. “మేము నిన్న దేవుని కృపను గూర్చి వాదించుకొంటున్నప్పుడు మీరు వినడం నాకు చాలా బాధగా ఉంది. సార్వభౌమాధికారి మరియు పరిపూర్ణుడు, పరిశుద్ధుడు అయిన అద్వితీయ దేవుడు మిమ్మల్ని క్షమించాడని దేవుని వాక్యం చెప్తుంది. మీరాయనయందు విశ్వాసముంచారు. ఆయన మిమ్మల్ని క్షమించాడని నమ్మారు. ఆయన రూపాంతరపర్చడమనే తన కార్యాన్ని మీలో ప్రారంభించాడు. మిమ్మల్ని తన హస్తాలలో సురక్షితంగా భద్రపరుస్తాడు. అంతేకాదు ఎన్నటెన్నటికీ, శాశ్వతంగా మనలను కాపాడుతాడు. ఆ విషయాన్ని యోహాను 10వ అధ్యాయయంలో యేసు చెప్పాడు” అన్నాడు.

“లోరీ మరియు నేను దేవుని కృపను పొందామని ఇష్మాయేల్ ఒప్పుకోవడంలేదు. ఇష్మాయేల్ మరియు ఆర్థర్ వంటి పెద్దలు, పరిణితి చెందిన విశ్వాసులు ఆ విషయాన్ని సందేహిస్తుంటే, లోరీ మరియు నేను ఎలా నమ్మగలం?” అని ప్రశ్నించాడు విక్టర్.

“అందుకే నేను మీ దగ్గరికి వచ్చాను. నిన్న నేను ఇతర సంఘాల పెద్దలను కూడ కలిశాను. స్థానిక సంఘంలో

బాప్తీస్మం పొంది, సభ్యత్వం స్వీకరించడానికి అన్ని మానవ నియమాలను పాటించవల్సిన అవసరం లేదని వారు కూడ అన్నారు. దేవుని కృపను గూర్చిన నిశ్చయతను పొందడానికి మనం రోమా 8వ అధ్యాయం చదువుదాం. మీరు చదువుతారా విక్టర్" అన్నాడు టినో.

విక్టర్ రోమా 8వ అధ్యాయం గట్టిగా చదివాడు. క్రీస్తునందు విశ్వాసముంచిన వారు దేవుని శాశ్వత ప్రేమ నుండి వేరుకావడం అసాధ్యమని అతడు చదివినప్పుడు లోరీ ఏడ్చేసింది. చదవడం పూర్తిచేసిన తర్వాత "ఈ వాక్యం మరొకసారి నిశ్చయతను కలిగిస్తుంది" అని ఆనందంగా అన్నాడు విక్టర్. "ఇష్మాయేల్ మరియు ఆర్థర్ చెప్పిన విషయాలు విని మేమెంతో నిరాశపడ్డాం. ఎవరో కడుపు మీద గుద్దినట్టు అన్పించింది. ఇంత త్వరగా మేం సందేహానికి ఎలా తావిచ్చామా అన్పిస్తుంది" అన్నాడు సాలోచనగా.

"సాతాను యొక్క అగ్ని బాణంతో మీరు గాయపడ్డారు" అన్నాడు టినో.

ఆ అగ్నిబాణానికి "నియమబద్ధ జీవితం" అని పేరుపెట్టింది జూలీ. అది చాలా బాధాకరమైంది. దాని నుండి కాపాడుకొనే మార్గం లేదా టినో?" అని అడిగింది జూలీ.

"సర్వశక్తిమంతుడైన దేవుడే దాని నుండి మనలను కాపాడుకొనే మార్గాన్ని ఇచ్చాడు. దేవుని వాక్యం ఉపదేశించినట్టుగా మనం దుష్టుని బాణాలను ఎదుర్కోవడానికి విశ్వాసమనే డాలును గట్టిగా పట్టుకోవాలి" అని చెప్పాడు టినో.

"మనం ఆ వాక్యమిప్పుడు చదవొచ్చా?" ఆశగా అడిగాడు విక్టర్.

"అవును తప్పక చదవొచ్చు! అపవాదిని ఎదిరించి నిలవడానికి దేవుడిచ్చిన సర్వాంగ కవచం గూర్చి ఎఫెసి 6:10–18లో వ్రాయబడింది" అని వివరించాడు టినో.

ఆ వచనాలు చదివిన తర్వాత "మాకెందుకంత బాధయ్యిందో నాకిప్పుడర్థమయ్యింది. సాతానుని అగ్నిబాణాలచేత మా ఆత్మలుగాయపడ్డాయి" అన్నాడు విక్టర్.

"మీరిద్దరే కాదు, మన సోదరులైన ఇష్మాయేల్ మరియు ఆర్థర్ ఈ నియమబద్ధమైన జీవితమనే బాణంచేత చాలా కాలంగా విషపూరితమయ్యారు" అన్నాడు టినో.

లోరీ ఒక్క నిముషం కళ్ళు మూసుకుంది తర్వాత ఉత్సాహంగా "ఒక్కసారి ఇలా ఊహించుకో! నిన్న ఒకవేళ మనం ఆత్మీయ నేత్రాలతో చూడగలిగితే సాతాను విల్లంబులుచేత పట్టుకొని కనిపించేవాడు. నియమబద్ధమైన జీవితం అనే బాణం వాడు గురిచూసి మనపైకి ఎక్కుపెట్టడం కనిపించేది" అన్నది.

నిమయబద్ధమైన జీవితానికి బానిసలుగా బ్రతకడం విషయంలో జాగ్రత్తగా ఉండాలని యేసు మనలను హెచ్చరించాడు. అది పరిసయ్యుల నుండి వ్యాపించే "వైరస్". వారు మత ఛాందసులు. యేసు దేవుని ఉచిత కృపను పాపులకు అనుగ్రహించడానికి ప్రయత్నించినప్పుడు వారు తీవ్రంగా ఎదిరించారు. తప్పు బోధనలను విన్న మన మిత్రుడైన ఇష్మాయేల్‌వలె పరిసయ్యులు కూడ అన్ని విషయాలలో లోపరహితంగా, పరిపూర్ణంగా ఉండాలని నిర్దేశించేవారు. మనం మన విశ్వాసమనే డాళ్ళను ఉపయోగిద్దాం" అని వివరించాడు టినో.

**అభ్యాసం**

దేవుడు వారిని ప్రేమిస్తున్నాడనీ, అంగీకరిస్తాడనీ మరియు క్షమిస్తాడని విశ్వాసులకు నిశ్చయత కలిగించగల మంచి మార్గమేది?

దేవుని వాక్యాన్ని మరియు ఆయన ప్రేమను నమ్మమని బోధించడం.

చాలా కఠినమైన నియమాలను పాటించమని చెప్పడం.

*(కొలస్సి 2:20 నుండి 3:1 వరకు గల వాక్యంలో జవాబును కనుగొనండి)*

ఒక విశ్వాసి యేసుకు లోబడడానికి సరియైన కారణం ఏదై ఉండాలి?

ప్రేమ

భయం

*(యోహాను 14:15లో జవాబు కనుక్కోండి)*

మీ సంఘంలోని విశ్వాసులు దేవుని కృపను అనుభవించి, దానిని ప్రశంసించడానికి మీరు వారికి ఏ విధంగా సహాయపడగలరో చెప్పగల ప్రణాళికను వివరించండి.

..........................................................................................................................

..........................................................................................................................

..........................................................................................................................

..........................................................................................................................

..........................................................................................................................

..........................................................................................................................

..........................................................................................................................

## 3వ అధ్యాయం

## లోరీ మరియు విక్టర్ ఆది సర్పాన్ని (ఘటసర్పాన్ని సాతానును) ఎదిరించిన విధానం

ట్యాంగ్ !

విక్టర్ మరియు లోరీలకు కనబడకుండా సమస్త మానవాళికి శత్రువైనవాడు వారి మీదికి మరొక అగ్ని బాణం ఎక్కుపెట్టాడు అది "భయం".

ట్యాంగ్ !

రెండవ బాణం ఎగిరింది, దాని పేరు "ఆవిశ్వాసము".

విరోధి మరలా ఇష్మాయేల్ మరియు ఆర్థర్ వైపు గురి పెట్టాడు. ట్యాంగ్ ! వెంటనే "పధార్థవాదం" మరియు " హేతువాదం" అను రెండు బాణములు భూమి వైపు ఎగిరెను.

అన్ని అపవిత్రాత్మల అధిపతియైన అపవాది వికటాట్టహాసం చేశాడు. ఆ తర్వాత తన సహాయకులతో అన్ని బాణాలకన్నా అధిక శక్తివంతమైన బాణం తెండి దానినిప్పుడు ప్రయోగిద్దాం అన్నాడు. ఒక దుష్టాత్మ బాణానికి నిప్పంటించాడు.

సాతాను దానిని ఎక్కుపెట్టాడు. ట్వాంగ్! "అధికార దాహం" అనే ఆ బాణం టినో ఇంట్లో కూడుకొనే సంఘం వైపు దూసుకెళ్ళింది.

"ఇక దేవుని కృప అక్కడ ప్రవహించడం ఆగిపోతుంది" గర్వంగా అన్నాడు అపవాది.

ఆ తర్వాత సమావేశంలో స్తుతి, ఆరాధన సమయానికి ముందు ఇష్మాయేల్ ఒక ప్రకటన చేశాడు. "నేనొక మంచి వార్త చెప్పాలి. ఆర్థర్ ఇప్పటి వరకు తాను నాయకత్వం వహిస్తున్న సహవాసాన్ని వదిలి మన సహవాసానికి రావాలని నిర్ణయించుకొన్నాడు అతడు చాలా అనుభవజ్ఞుడు. కచ్చితంగా క్రమశిక్షణను ఏ విధంగా అమలుచేయాలో అతనికి బాగా తెలుసు.

"మీ గుడ్లగూబ వచ్చాడు" అన్నాడు విక్టర్ లోరీ చెవిలో నెమ్మదిగా. ఆమె ఫక్కున నవ్వి ఆ తర్వాత నోటికి చేయి

అడ్డం పెట్టుకొంది.

"మీరు మీ సహవాసాన్ని ఎందుకు వదలిపెట్టారు?" టినో ఆర్థర్‌ను అడిగాడు.

"ఎందుకంటే, వారిలో ఏ మాత్రం ఆత్మీయతలేదు" వారి నాయకునిగా నేను పాటించమని చెప్పిన నియమాలు పాటించడానికి వారు ఇష్టపడలేదు. కాబట్టి వారితో సహవాసం దూరం చేసుకోవడం నా విధి. వారు నిజమైన క్రైస్తవులు కాదు" అని సంభాషణ మధ్యలో తుంచేసాడు.

"పెద్దపులి పంజా విసిరింది" లోరీ విక్టర్ చెవిలో గుసగుసగా అన్నది నవ్వుతూ.

సమావేశం జరుగుతున్నంత సేపు వీలైనప్పుడల్లా ఇష్మాయేల్ మరియు ఆర్థర్ మాట్లాడుతూనే ఉన్నారు. టినోకు అసహనం పెరిగిపోసాగింది. ప్రభురాత్రి భోజనానికి అందరూ సిద్ధపడుతుండగా ఇష్మాయేల్ నూతన విశ్వాసులతో "ఈ వారంలో మీరేదైనా పాపంచేసి ఉంటే ప్రభురాత్రి భోజనంలో పాలుపుచ్చుకోరాదు" అన్నాడు.

ఆర్థర్ దానిని బలపరుస్తూ "క్రొత్తగా విశ్వాసంలోకి వచ్చిన మీరంతా ఒక విషయం అర్థం చేసుకోవాలి. ప్రభురాత్రి భోజనంలో దేవుడు చేసిన ప్రత్యేకమైన విషయమేమి లేదు. దానిలో మర్మమేమీ లేదు. యేసు మరణించాడని మనకు జ్ఞాపకంచేయడానికి అదొక దృశ్యప్రదర్శన మాత్రమే. పరిశుద్ధాత్ముడు మానవాతీత కార్యమేమీ చేయలేదు. రొట్టె యేసు శరీరానికి గుర్తు. అవును. అది మనం జ్ఞాపకముంచుకోవడానికి ఒక దృశ్యరూపం అంతే. మరేమీలేదు. దానిని "యేసు శరీరం" అని మీరనడం నాకిష్టంలేదు. అది యేసు శరీరానికి గుర్తు మాత్రమే.

దానికి టినో వెంటనే స్పందించాడు "ఇప్పుడు ఆర్థర్ ప్రభురాత్రి భోజనం గూర్చి చెప్పిందంతా అతని వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే "ప్రభు సంస్కారం"లో గొప్ప మర్మముందనే విషయం మీరందరూ తెలుసుకోవాలని నేను కోరుతున్నాను అన్నాడు. ఆర్థర్ వాదనకు దిగాడు కాని, టినో అతన్ని అడ్డుకొంటూ "దీన్ని గూర్చి మనమిప్పుడేమీ వాదించకూడదు, దేవున్ని ఆరాధించడానికి మనమిక్కడ కూడుకొన్నాం. ఒకవేళ దీన్ని గూర్చి మీరు తప్పక మాట్లాడాలనుకొంటే తర్వాత మాట్లాడుదాం" అన్నాడు.

కొన్ని రోజుల తర్వాత టినో మరియు జూలీ మళ్ళీ విక్టర్, లోరీలను దర్శించారు. వారప్పటికి బాప్తీస్మం పొంది తమ నూతన విశ్వాసంలో వేగంగా ఎదుగుతున్నారు. మగవాళ్ళిద్దరూ మాట్లాడుకొంటుంటే ఆడవాళ్ళిద్దరూ వంటింట్లోకి వెళ్లారు "నీవీ వేళ ఏదో ఆందోళనగా ఉన్నట్టనిపిస్తుంది లోరీ" అన్నది జూలీ.

అవును జూలీ! నేను యేసును స్వీకరించినప్పుడు మొదటిసారి కలిగిన ఆనందం నాకిప్పుడులేదు. నా విషయంలో కృపా ప్రవాహం ఎండిపోయినట్టనిపిస్తుంది. నేను కొన్ని తప్పు పనులు చేశాను. నేను లోబడవల్సిన సమయంలో విక్టర్‌తో వాదనకు దిగాను. చాలా మొండిగా ప్రవర్తించాను. నీలా అన్ని సమయాలలో మృదువుగా ప్రశాంతంగా ప్రవర్తించలేకపోతున్నాను జూలీ! నేను విఫలమయ్యాను! ఓడిపోయాను జూలీ!! అని బాధగా అన్నది.

లేదు లోరీ నీవు నూతన విశ్వాసివి. క్రీస్తులో ఆత్మీయంగా ఒక శిశువువు. మేమందరం అటువంటి వైఫల్యాలను ఎదుర్కొన్న వారమే" అన్నది జూలీ.

"దేవుడు మమ్మల్ని నిజంగా రక్షించాడా? ఇష్మాయేల్ మరియు ఆర్థర్ మాట్లాడింది విన్న తర్వాత విక్టర్‌కు నాకు ఎంతో నిరాశగా అనిపించింది. వారెన్నో నియామాలు పాటించమని చెప్పారు. అసలు మేము దేవుని కృప పొందడానికి అర్హులమేనా అని విక్టర్ వాపోతున్నాడు" అన్నది లోరీ.

"మనమెవ్వరమూ దేవుని కృపకు పాత్రులం కాదు లోరీ! పరిశుద్ధాత్ముడు నీలో నివసించి దేవుని కృపను నీకు అందిస్తాడు. కృప ఎప్పుడూ నీకు అందుబాటులో ఉంటుంది. తన కృప మరియు తన సన్నిధిని గూర్చిన నిశ్చయత మనకు కలిగించడానికి దేవుడిచ్చిన వాటిని మనం గట్టిగా పట్టుకోవాలి" అని చెప్పింది జూలీ.

ఏ విషయాలు జూలీ? మనం ఇంతగా అవమాన భారంతో కృంగిపోతుంటే, దేవుని కృపను గూర్చిన నిశ్చయత ఎలా కలుగుతుంది? అన్నది లోరీ.

ఈ విషయం వివరించమని టినోను అడుగుదాం. దేవుని వాక్యం ద్వారా వ్యక్తులను ప్రోత్సహించడం అతనికెంతో ఇష్టం అని చెప్పింది జూలీ.

ఇద్దరూ వంట గది నుండి బయటకు వచ్చి, విక్టర్ మరియు టినోల దగ్గర కూర్చున్నారు.

టినో! మనం దేవుని కృపను పొందామని నిశ్చయంగా ఎందుకుండవచ్చు? అడిగింది జూలీ.

దేవుడు తన పిల్లలకు సంతోషం, సమాధానం మరియు ఇతర క్రైస్తవ సుగుణాలు ఇస్తాడు. ఆయన కృప మనకు అనేక మార్గాలలో లభిస్తుంది. దేవుని పరిశుద్ధాత్మ శక్తి ద్వారా మనం ఒకరికొకరం సేవచేస్తున్నప్పుడు ఆయన వాక్యం ద్వారా లేదా మనహృదయంలో ఆయనచేసే పనుల ద్వారా రావచ్చు. లేదా బాప్తీస్మం, ప్రార్థన మరియు ప్రభురాత్రి భోజనం ద్వారా కూడా రావచ్చు.

"విక్టర్ మరియు నేను దేవుని వాక్యం చదివి ప్రార్థిస్తాం మేం బాప్తీస్మం పొందాం, ప్రభురాత్రి భోజనంలో పాలుపుచ్చు కొంటున్నాం. ఇతరులకు సేవచేయాలని కూడా అనుకొంటున్నాం. అయినా నేను చేసిన అనేక తప్పు పనులను బట్టి ఇంకా నాలో అవమాన భావం, భయం ఉన్నాయి" అన్నది లోరీ.

సాతాను తన అగ్నిబాణాలను మళ్ళీ నీపై సంధిస్తున్నాడు లోరీ. నీ మనసును సందేహంతో కలుషితం చేయడానికి వాడు ప్రయత్నిస్తున్నాడు. చాలా మంది విశ్వాసులలో తొలి సంతోషం తగ్గుముఖం పట్టిన తర్వాత ఇదే జరుగుతుంది. మన భావాలను మనం నమ్మకూడదు అన్నది జూలీ.

"ఆర్థర్ చెప్పే మాటలు విన్న తర్వాత కలిగే సందేహాలను నేను ఆపలేకపోతున్నాను ఎందుకో అర్థంకావడంలేదు" చెప్పాడు విక్టర్.

ఆర్థర్ ఉద్దేశం మంచిదేకాని అతడు హేతువాది" అని వివరించడానికి ప్రయత్నం చేశాడు టినో.

"హేతువాది అంటే ఎవరు?"

"క్రైస్తవులలోని హేతువాదులు దేవుని వాక్యాన్ని తమ మానవ తర్కంతో విశ్లేషించడానికి ప్రయత్నిస్తారు. ఏదైనా నమ్మడానికి ముందు దాన్ని పూర్తిగా అర్థంచేసుకోవాలని వారనుకొంటారు. కాని ఏ మానవుడు కూడ దేవుని కృపను మానవ తర్కంతో అర్థం చేసుకోలేడు. తీర్పు అనేది తర్క బద్ధమైనది కాని కృప తర్కానికి అందదు దయను కూడా తర్కంతో అర్థం చేసుకోవచ్చు కాని కృప మానవ జ్ఞానానికి విశ్లేషణకు తర్కానికి అందనిది. ఎందుకంటే ఎవరూ అది పొందడానికి అర్హులు కారు. ప్రభువైన యేసుక్రీస్తుపై అందరూ ఉమ్మివేసి, అవమానించి కొట్టి సిలువవేసినప్పుడు తనను హింసించిన వారి పట్ల ఆయన ప్రేమతోనూ, దయాళుత్వంతోనూ ప్రతిస్పందించాడు అదే శుద్ధమైన కృప అంటే! మానవ జ్ఞానానికి గ్రహింపుకు మించినది కృప విక్టర్!" వివరించాడు టినో.

"అందుకేనా ప్రభురాత్రి భోజనంలో మర్మమేదీ లేదన్నాడు ఆర్థర్? అది నాకు ఒక పెద్ద సమస్యలా అనిపించింది. 1 కొరింథి 10:6లో, మనం యేసు శరీరంలో పాలిభాగస్తులమౌతామని వ్రాయబడింది. అది నాకు నిజంగా ఒక పెద్ద మర్మంలా అనిపించింది" అన్నాడు విక్టర్.

"అదెంత ప్రశస్తమైంది" అన్నది లోరీ.

"అది నిజంగా ఒక దైవమర్మం దేవుడు దానిని తీవ్రంగా పరిగణిస్తాడు. ప్రభు సంస్కారంలో పాల్గొనేటప్పుడు క్రీస్తు శరీరమని ఆలోచించకుండా తిన్న వారిని ఆయన శిక్షించాడని 1 కొరింథి 11లో వ్రాయబడింది. అయితే ఆర్థర్ దానిని పూర్తిగా హేతుబద్ధమైన పదాలతో వివరించాడు. ఏ మానవాతీత కార్యం దానిలోలేదని అతడంటాడు. మనందరం కలిసి రొట్టె విరిచినప్పుడు పరిశుద్ధాత్ముడుసెలవు తీసుకొంటాడని అతని ఉద్దేశం కావచ్చు. నేను కూడ ఒకసారి అలాగే ఆలోచించాను కాని నా సందేహాలను క్షమించమని దేవున్ని కోరాను. ఆయన క్షమించాడు. లోరీ! నా స్వంత సంశయమును సందేహించడం నేర్చుకున్నాను" టినో స్పష్టం చేశాడు.

“మర్మమంటే ఏమిటి?” విక్టర్ అడిగాడు.

“రొట్టె అంటే క్రీస్తు శరీరమని యేసు మరియు అపొస్తలుడైన పౌలు చెప్పారు. అది క్రీస్తు శరీరాన్ని సూచిస్తుందని వారు చెప్పలేదు. రొట్టె, రొట్టెయే కాని ఆత్మీయంగా అది క్రీస్తు శరీరమే. అది ఒక గుర్తు కావచ్చు, కాని మనం దానిని విశ్వాసం ద్వారా అంగీకరించినప్పుడు దేనికైతే అది గుర్తుగా ఉందో దానిగా మారే శక్తిగల గుర్తది.”

“ప్రభురాత్రి భోజన సమయంలో దేవుడు పనిచేయడం నేను గుర్తించాను. క్రీస్తు నిజంగానే అక్కడున్నట్టు అనిపించింది. ఎందుకలా అన్పించిందో ఇప్పుడు నాకర్థమయ్యింది కాని నాలో ఇంకో ప్రశ్న కూడా ఉంది ఇష్మాయేల్ స్నేహితుడైన ఆర్థర్ అందరూ డబ్బులివ్వాలనీ, సంఘానికవసరమైన నిధులు సమకూర్చాలనీ అంటున్నాడు. అతడు చెప్పిన మరికొన్ని విషయాలు కూడ నాలో అపరాధ భావనను కలిగించాయి. మీరు మరియు ఆర్థర్ ఇద్దరూ బైబిల్ ఆధారంగానే బోధిస్తారు కదా మీరు బోధించినప్పుడు మాలో అపరాధ భావం కలిగించరు ఎందుకంత భేదం?” తన మనసులోనిదంతా వెళ్ళగక్కాడు విక్టర్.

“ఆర్థర్ ఒక భౌతికవాది అని నేననుకొంటాను. వ్యక్తులు కలిగి ఉన్న వివిధ వస్తువులు మరియు సంపదను బట్టి వారి జీవితాలలో దేవుని కృప ఎంత ఉందో అంచనా వేస్తాడతడు. ఒక సంఘానికి విలువైన ఆస్తులున్నప్పుడే అది విజయవంతమైన సంఘమని అతడు భావిస్తాడు. కొంత కాలం క్రితం నేను వారి సహవాసానికే వెళ్ళేవాన్ని. దేవున్ని సేవించడం గూర్చి ఎవరైనా క్రొత్త ఆలోచనలు సూచిస్తే వారిని ఊపిరాడకుండాచేసి ఆ ఆలోచనను అక్కడే తుంచేసేవాడు. అటువంటి పద్ధతులవల్ల సంఘం యొక్క ఆదాయమునకు నష్టమనీ సంఘం యొక్క నిధులు అడుగంటి పోతాయనీ అనేవాడు అసలు డబ్బు అవసరంలేని ఆలోచనలైనా సరే అలాగే అనేవాడు. మనం అతని కొరకు ఇష్మాయేల్ కొరకు ప్రార్థించాలి. వారి ఉద్దేశం మంచిదే కావచ్చు కాని ఈ లోకం తన ప్రభావాన్ని వారిపై చూపించడానికి వారు అనుమతిస్తున్నారు. కొన్నిసార్లు ఎంతో భక్తిగల క్రైస్తవులు కూడా దేవుని నుండి కాకుండా మనుషుల నుండి, అపవాది నుండి వివిధ ఆలోచనలను స్వీకరిస్తారు, వాటిచేత ప్రభావితమౌతారు.”

ఒకనెల రోజుల తర్వాత ఇతర సహవాసాల కాపరులను, నాయకులను టినో కలుసుకొన్నాడు. విక్టర్‌ను కూడ ఆ సంఘాలు దర్శించి వారి ఆచార వ్యవహారాలను గమనించమని చెప్పాడు. ఒకనాటి కూడికలో నేను నాయకత్వం వహిస్తున్న సహవాసం రోజు రోజుకు అభివృద్ధి చెందుతుంది. పెద్ద సంఖ్యకు చేరింది. అందువల్ల సభ్యులందరిని గూర్చి వ్యక్తిగత శ్రద్ధ కనపర్చడం కష్టమవుతుంది. కాబట్టి నేను దానిని రెండు గుంపులుగా విభజించాలనుకొంటున్నాను. ఒక గుంపు విక్టర్ ఇంట్లో కూడుకొంటే బాగుంటుందనుకొంటున్నాను. వారు క్రీస్తులో వేగంగా ఎదుగుతున్నారు. త్వరలోనే వారు ఒక గుంపుకు నాయకత్వం వహించగలరు. నేనూ, జూలీ వారికి తగిన శిక్షణ నిస్తాం” అని అన్నాడు టినో.

అది అనైక్యతకు వేర్పాటుకు దారితీస్తుంది టినో “ఆవేశంగా అన్నాడు. ఇష్మాయేల్. క్రొత్త విశ్వాసులకు తమ ఇండ్లలో సహవాసాలుగా కూడడానికి అనుమతిస్తే సంఘంలో తప్పక చీలికలు వస్తాయి.” అన్నాడు.

ఆర్థర్ వెంటనే అందుకొని “నీలా క్రొత్త క్రొత్త ఆలోచనలు చేసేవాళ్ళను నేను నమ్మను టినో! మీరు ఎప్పుడూ క్రొత్త విషయాలు ప్రారంభిచడానికి ప్రయత్నిస్తారు కాని గృహాలలో జరిగే కూడికల మీద మనం నియంత్రణ కలిగి ఉండాలి. మనకు కఠినమైన నియమాలుండాలి. అవును! గృహాలలో జరిగే సహవాసాలకు స్వతంత్రం ఇచ్చి అవి చిన్న చిన్న సంఘాలవలె విధులు నిర్వహించడానికి మనం అనుమతించకూడదు. వారికి పరిమితమైన స్వేచ్ఛనివ్వాలి. ఇష్మాయేల్ ఇచ్చే పాఠ్యప్రణాళికనే వారు ఉపయోగించాలి. వారు కేవలం బైబిల్ స్టడీ బృందాలుగానే ఉండిపోవాలే తప్ప సంఘాలుగా మారకూడదు” అన్నాడు.

“ఆర్థర్ దయచేసి ఆగు” కోపంగా అన్నాడు టినో. మనం సహవాసాల మీద అటువంటి షరతులు విధించడం వల్ల వారిలో దేవుడు చేస్తున్న కార్యాన్ని నాశనం చేస్తాం కేవలం బైబిల్ చదవడం మాత్రమే కాదు దేవునికి కావల్సింది, ఒక విశ్వాసుల గుంపు దేవున్ని సేవించడానికి మరియు ఒకరికొకరు పరిచర్య చేసుకోవడానికి అవసరమైన విషయాలన్నింటిని మా బృందం నెరవేరుస్తుంది. మీరన్నట్టు మేమందరం ఒకే విధమైన పాఠాలను చదివితే మా సహవాసంలోని వివిధ విశ్వాసుల ఆత్మీయ అవసరాలకు తగిన పాఠాలను ఎన్నుకోవడంలో విఫలమౌతాం” అన్నాడు టినో.

అప్పుడు విక్టర్ "టినోతో మన క్రైస్తవ జీవితానికి మార్గదర్శక సూత్రాల కొరకు క్రొత్త నిబంధనను ఆధారంగా తీసుకొంటామని ఎందుకు చెప్పావు? మనం పాత నిబంధనను కూడ చదువుతాము కదా! అన్నాడు.

"అవును మనం పాత నిబంధనను కూడా పాటిస్తాం. కాని అది వేరే సందర్భాలలో క్రొత్త నిబంధన సంఘం యొక్క కార్యక్రమాలను నిర్దేశించడానికి కాదు. లేకపోతే శనివారం రోజు వంట చెరకు ఏరుకొనే వారందరిని రాళ్ళతో కొట్టి చంపవల్సివస్తుంది. క్రీస్తు మరియు ఆయన అపొస్తలులు ఏమి చేయమని మనకు చెప్పారో అవన్నీ మనం చేయాలి" అని విక్టర్‌కు అర్థమయ్యేలా చెప్పాడు టినో."

టినో విక్టర్‌తో చెప్పినదంతా ఆర్థర్ విన్నాడు. వెంటనే ఇలా అన్నాడు "మనం తప్పకుండా ఆ పనులన్ని చేద్దాం! అవును! వివిధ అవసరాలకు తగినట్టుగా వివిధ పరిచర్యలు చేయడానికి తగిన వ్యక్తులను నియమిద్దాం. ఒక్కొక్క గుంపు ఒక రకమైన పరిచర్యను అభ్యాసం చేయాలి. ప్రతి గుంపు తనకు నిర్దేశించబడిన పరిచర్యకు కట్టుబడి ఉండాలి. అవును! అన్ని గుంపులూ దేవుని వాక్యం బోధిస్తాయి, కాని ఒక గుంపు మాత్రం సువార్త విషయంలో అన్ని గుంపులపై అజమాయిషీ చేస్తుంది. మరొక గుంపు ఆరాధన విషయంలో బాధ్యత తీసుకొంటుంది మరొక గుంపు ఆర్థికపరమైన వియాలను సంభాళిస్తూ అందరూ ధారాళంగా ఇచ్చేలా ప్రోత్సహిస్తుంది. ఈ విధంగా మనం అన్ని గుంపులపై పట్టుకలిగి ఉండి అన్ని పనులూ నియంత్రించ గలుగుతాం. అందరూ ఏం చేస్తున్నారో మనకు తెలుస్తుంది" ఆర్థర్ గట్టిగా మాట్లాడుతుండడంవల్ల మిగిలిన పెద్దలందరూ ఆ మాటలు విన్నారు.

"అలా ఎవరికి వారే వేరు వేరుగా పనిచేయడం వాక్యానుసారమైనది కాదు. దానివల్ల వ్యక్తులను వేరేవేరు గదులలో బంధించినట్టవుతుంది. సంఘమనే శరీరానికి దేవుడిచ్చిన ఆత్మీయవరాలను వేరుచేసినట్టవుతుంది. ఒకే రకమైన ఆత్మీయవరమున్న వారిని ఇతర విశ్వాసులకు అందుబాటులో ఉంచి వారికి ఉపయోగపడేట్టు చేయడానికి బదులు ఆ వరమున్న వారందరిని ఒకే చోట బంధించినట్టవుతుంది, చిన్నచిన్న గుంపులుగా కూడి వివిధ రకాలుగా ఒకరికొకరు పరిచర్యచేసుకొనే విధానంతో మీరు చెప్పే పద్ధతి ఏకీభవించదు. ప్రతి గుంపులోని వ్యక్తులు ఒకరికొకరు పరిచర్య చేసుకోగలుగునట్లు వివిధ ఆత్మీయ వరాలు అంటే వివిధ పరిచర్యలుచేసే తలాంతులుగలవారు ప్రతి గుంపులోనూ ఉండాలని దేవుని వాక్యం చెప్తుంది" అని హెచ్చరికగా చెప్పాడు టినో.

"నేనొప్పుకోను! వెంటనే అన్నాడు ఆర్థర్. వివిధ కార్యక్రమాలను ఏర్పాటు చేయడం ద్వారా మనం అన్ని గుంపులను నియంత్రించవచ్చు! అవును అదొక్కటే మార్గం" మిగిలిన వారిలో ఇద్దరు పెద్దలు ఆర్థర్ చెప్పినదాన్ని ఒప్పుకొంటున్నట్టుగా నెమ్మదిగా ఏదో అన్నారు.

టినో ముఖంలో నిరుత్సాహం కొట్టవచ్చినట్టుగా కన్పించింది. "దయచేసి వాక్యానుసారంగా ప్రతిదీ చేయాలన్న విషయం గమనించండి. క్రీస్తు శరీరంలో ఏకత్వముండాలంటే అన్ని పనులు వాక్యానుసారంగా జరగాలంటే వేరువేరు ఆత్మవరాలు గలవారిని ఒక్కచోటచేర్చి అందరు కలిసి ఏకత్వంతో పనిచేసేలా చూడాలని దేవుడు కోరుతున్నాడేగాని వారిని వేరుచేయమని చెప్పడంలేదు. దయచేసి 1 కొరింథి 12, రోమా 12. మరియు ఎఫెసి 4:11-16 చదవండి. ఒకే శరీరంలోని అవయవాలుగా ఉంటూ మనకున్న వేరువేరు తలాంతులతో, వేరేవేరు సామర్థ్యాలతో, ప్రేమతో ఒకరికొకరం పరిచర్య చేసుకోవాలి. మన చిన్న చిన్న గృహ సహవాసాలు దీన్ని చక్కగా చేయగలవు. వాక్యానుసారమైన మన పద్ధతులను వదిలిపెట్టవల్సిన అవసరంలేదు" అన్నాడు ఓపికగా.

"అంటే ప్రతి గుంపునూ నీవొక చిన్న సంఘంగా చేయాలనుకొంటున్నావన్న మాట" గట్టిగా అరిచినట్టుగా అన్నాడు ఆర్థర్. అటువంటి సహవాసాలను మనం నియంత్రించలేం, మనవంటి నాయకులకు బలమైన అధికారాలిచ్చేదిగా మన సహవాసముండాలి" అన్నాడు.

"నీవు నీ అధికారం గురించే ఎక్కువగా ఆలోచిస్తున్నావు ఆర్థర్. నిజానికి ప్రతి గుంపును పరిశుద్ధాత్ముని శక్తి నియంత్రిస్తుందని అజమాయిషీ చేస్తుందని మనం నమ్మాలి. దేవుని నడిపంపు ప్రకారం ప్రతి గుంపూ తన పరిచర్యలను

అభివృద్ధి చేసుకొని విస్తరించాలి. ఆత్మలో ఈ విధమైన స్వేచ్ఛను మనకు 2 కొరింథి 3:17 వాగ్దానం చేస్తుంది" అని నచ్చచెప్పడానికి ప్రయత్నించాడు టినో.

"నీవు క్రొత్తక్రొత్త విషయాలను ఆచరించడానికి ప్రయత్నిస్తున్నావు టినో! నీ గుంపులో ఉండే ప్రతి ఒక్కరూ ఒక్కొక్క పనిని చేయాలని నీవు కోరుతున్నావు. అందరూ భిన్నమైన పరిచర్యలు చేయాలని నీ ఉద్దేశం. అలాగైతే మొత్తం మీద ఒక వారంలో ఏం జరగిందో ఎవరికీ తెలియయదు. అంత స్వేచ్ఛనిస్తే గందరగోళ పరిస్థితి ఏర్పడుతుంది. అది మన ఐక్యతను నాశనం చేస్తుంది. అన్ని గుంపులకూ మనం ఒకే విధమైన ప్రమాణ కార్యక్రమాలను నిర్దేశించాలి. అది కూడ ప్రతి గుంపులో ప్రతి ఒక్కరికి  అవును! ఐక్యతను కాపాడాలంటే అలాగే చేయాలి" అన్నాడు ఆర్థర్.

"ఐక్యంగా ఉండడం, ఒకే తీరుగా ఉండడం రెండు వేరువేరు విషయాలు. క్రీస్తులో ఐక్యంగా ఉండడం అంటే ప్రతి ఒక్కరు ఒకే రకమైన పనులు చేయాలని అర్థంకాదు. నిజానికి దాని అర్థం పూర్తి వ్యతిరేకమైనది. ఆత్మీయ వరాలను గూర్చి మాట్లాడిన సందర్భంలో అపొస్తలులు ఐక్యతను గూర్చి బోధించారు. క్రీస్తులో ఐక్యత అంటే మనందరికీ వేరువేరు వరాలు, వేరువేరు సామర్థ్యాలుంటాయి. పరిశుద్ధాత్ముడే మన పరిచర్యలన్నింటిని ప్రేమతో ఐక్యపరుస్తాడు" అని వివరించాడు టినో. ఆర్థర్ మాటలతో ఏకీభవించిన ఒక వ్యక్తి ఇలా మాట్లాడసాగాడు. "అదొక ఆసక్తికరమైన సత్యం బ్రదర్ టినో! దానిని వేనింతకు ముందు గమనించలేదు. అవును 1 కొరింథి 12వ అధ్యాయం దానిని స్పష్టంగా బోధిస్తుంది. మన శరీరంలోని అవయావాలన్ని ఒకటిగా ఎలా పనిచేస్తాయో అలాగే దేవుడు వేరువేరు పరిచర్యలను ఒకటిగా చేస్తాడు. చాలా థాంక్స్ టినో! మా సహవాసంలోని విశ్వాసులందరినీ వేరువేరు పరిచర్యలకు సిద్ధపర్చుతూ బోధించడం ద్వారా శరీరమంతటినీ బలపర్చే పనిని ప్రారంభిస్తాను" అన్నాడు.

"చాలా మంచిది! ఒకరికొకరు పరిచర్య చేసుకొనేటప్పుడు వ్యక్తుల అవసరాలు మరియు పరిచర్యచేసే అవకాశాలు ఎప్పటికప్పుడు మారుతుండడం కూడా మీరు గమనిస్తారు. క్రొత్త నిబంధనలోనూ అలాగే జరిగింది" అన్నాడు టినో.

ఇష్మాయేల్ మరియు ఆర్థర్ తప్ప మిగిలిన నాయకులంతా టినోతో ఏకీభవించారు. అయినా ఇష్మాయేల్ వాదించడం ఆపలేదు. "నీవు కృపను మరీ ఎక్కువగాచేసి బోధిస్తావు టినో! విశ్వాసులు తమకేది ఇష్టమైతే అది చేయవచ్చున్నట్టుగా నీవు మాట్లాడతావ్! నీ బోధవల్ల మన సహవాసంలో క్రమశిక్షణ లోపిస్తుంది" అన్నాడు.

"మనం కృపను సరిగ్గా నిర్వచించచగలిగితే దానిని ఎక్కువగాచేసి బోధించలేం! మనకు ఏది ఇష్టమైతే అది చేయగల హక్కును కృప ఇస్తుందని కొంతమంది బోధిస్తారు. అటువంటి ప్రమాదకరమైన తప్పు బోధన నేనెప్పుడైనాచేయగా విన్నావా? నీ భయానికి అర్థంలేదు. దేవుని కృపను పొందినవారు పాపం విషయంలో మరణిస్తారని అపొస్తలుడైన పౌలు చెప్పాడు. దేవుడు ఎలా చెప్పాడో అలాగే మనం కృపను వివరిద్దాం" టినో అన్నాడు.

"మరి బైబిల్ కృపను ఏమని నిర్వచిస్తుంది టినో?" ఆష్మాయేల్ అడిగాడు.

"అనర్హులైన వారికి దేవుడిచ్చిన వరం కృప! ఎవరైతే పశ్చాత్తాపపడి, పాపం విషయంలో మరణించి, క్రీస్తుతో పాటు నూతన జీవంతో లేపబడి దేవుని కుటుంబంలో సభ్యులౌతారో వారందరూ క్రీస్తు ద్వారా ఉచితంగా కృపను పొందుతారు. వారు దేవునికి దత్తత చేసుకోబడిన పిల్లలౌతారు మరియు దేవుని అనంతమైన మహదైశ్వార్యానికి క్రీస్తుతో పాటు వారసులౌతారు."

"ఈ విషయాలన్ని బైబిల్‌లో ఎక్కడ వ్రాయబడ్డాయి?" అడిగాడు ఇష్మాయేల్.

టినో బైబిల్ తెరిచాడు "ఒక్క నిమిషం ఆగండి, నేను మంచి వాక్య భాగాల రెఫరెన్స్‌లు చెప్తాను అన్నాడు." టినో చెప్పే రెఫరెన్స్‌లు ఇష్మాయేల్ వ్రాసుకోవడం విక్టర్ గమనించాడు. "రోమా 5:12; 6:18, రోమా 8వ అధ్యాయం మరియు ఎఫెసి 2:4–7" విక్టర్ కూడా ఆ రెఫరెన్స్‌లు వ్రాసుకొన్నాడు.

"దురదృష్టకరైన విషయమేమిటంటే కొంతమంది క్రైస్తవ బోధకులు కృపను తప్పుగా వివరిస్తారు." కృప అంటే ఎప్పుడూ ఎవరినీ బాధపెట్టవద్దనీ, ఎట్టి పరిస్థితులలోనూ ప్రేమతో సంబంధాలను కొనసాగించాలనీ వారనుకొంటారు.

ఈ అభిప్రాయం దేవుని వాక్యం యొక్క అర్థాన్నే మార్చే ప్రమాదముంది. కాని దేవుని రాజ్యంలో కాపరులుగా పనిచేసేవారు తప్పుపనిచేస్తున్న వారిని కచ్చితంగా సరిచేయాలి. దాని వల్ల మొదట కొంత బాధకలిగినా అది స్వల్పకాలముండేదే. క్రీస్తు మరియు అపొస్తలుడైన పౌలు అలాగే చేశారు. క్రీస్తునందు మన సహోదరుడు పాపంలో పడ్డట్లైతే ప్రేమతో మనం చేయగల సహాయమేమిటంటే, అతనికి బాధ కలిగించినా సరే, అతన్ని సరిదిద్దాలి. అవసరమైనప్పుడు బుద్ధిచెప్పడానికి వెనుకాడవద్దు. ఒకవేళ అతడు నిజంగా దేవుని బిడ్డ అయితే వెంటనే తన తప్పు దిద్దుకొని సరియైన మార్గంలోకి వస్తాడు. అంతేకాదు మనకు కృతజ్ఞత తెలుపుతాడు కూడ. ఎవరైతే తప్పుచేసి దిద్దుబాటును ఇష్టపడరో పశ్చాత్తాపపడరో అటువంటి వారితో మనం సహవాసం వదులుకోవాలి. పశ్చాత్తాపపడని క్రైస్తవులతో మనం సహవాసం చేయకూడదనీ వారితో కలిసి ప్రభురాత్రి భోజనంలో పాల్గొనకూడదనీ క్రీస్తు మరియు అపొస్తలుడైన పౌలు చెప్పాడు" అని స్పష్టం చేశాడు టినో.

"అటువంటి క్రమశిక్షణను గూర్చి ఏ వాక్యభాగలు వివరిస్తాయి?" అని టినోను అడిగాడు ఇష్మాయేల్.

టినో మళ్ళీ తన బైబిల్ తెరిచి చూసి చెప్పాడు. "మత్తయి 18:15–20; 1 కొరింథి 5 మరియు తీతు 3:10–11" ఇష్మాయేల్ మరియు విక్టర్ లిద్దరూ ఆ రెఫరెన్స్‌లు వ్రాసుకొన్నారు.

టినో కొనసాగించాడు. "కృపను తప్పుగా అర్థం చేసుకొన్న మరొక బోధ ఏమిటంటే విశ్వాసులు చేసిన పాపాలకు దేవుడు వారిని బాధ్యులుగా ఎంచడని చెప్పే బోధ. అది తప్పు! దేవుడు తప్పక వారినే బాధ్యులుగా ఎంచుతాడు. అయితే ఆయనిచ్చిన పాపక్షమాపణ మనకేమి నిశ్చయతను కలిగిస్తుందంటే దేవుడు ఎవరినైతే మరణం నుండి లేపి నిత్యశిక్షకు పంపిస్తాడో వారిలో మనముండమని! ఈ విషయమై ఆయన యోహాను 5:24–29లో హెచ్చరించాడు. అయితే ఆయనతో పాటు నిరంతరం జీవించగలుగునట్లు మనలను మరణం నుండి లేపినా, ఆయన తన న్యాయసింహాసనంపై కూర్చుండి తన మహిమగల రాజ్యంలోకి ప్రవేశించే ముందు మన పనులను పరీక్షిస్తాడు. మనం చేసిన చెడు పనులన్నీ కాలిపోతాయి. సంఖ్యాకాండం 31వ అధ్యాయంలో దేవుని పరిశుద్ధ సమూహంలోకి కొందరు నిషేధించబడిన వాటిని తీసుకొని రావడానికి ప్రయత్నించినప్పుడు మోషే వాటిని కాల్చివేసినట్టుగా అన్నమాట! ఆయన తీర్పులో కాలిపోకుండా నిలబడిన మంచి పనులను బట్టి దేవుడు మనకు ప్రతిఫలమిస్తాడు. బహుమానమిస్తాడు. అని వివరిస్తూ టినో కొన్ని రెఫరెన్స్‌లు చెప్పాడు." 1 కొరింథి 3:11–15 మరియు 2 కొరింథి 5:10". వాటిని కూడా ఇష్మాయేల్ మరియు విక్టర్ వ్రాసుకొన్నారు.

"అయినా నీవు కృపను మరీ ఎక్కువగాచేసి చెప్పినట్టే అన్పిస్తుంది టినో" గొణిగాడు ఇష్మాయేల్.

"మీరు చెప్పే నియమానుసారమైన జీవితం మరియు చట్టబద్ధతలోని లోపాలను సవరించడానికి నేనది నొక్కి చెప్పవల్సివస్తుంది ఇష్మాయేల్!" అన్నాడు టినో.

"నేనీ వాక్యాలు చదివి నీవు చెప్పేది సత్యమా లేక నేను చెప్పేది సత్యమా కనుక్కొంటాను' అంటూ ఇష్మాయేల్ సవాలు చేశాడు.

మరుసటి వారంలో టినో మరియు జూలీ, విక్టర్ లోరీలను దర్శించారు. "పోయిన సమావేశాలకి మీరెందుకు రాలేదు విక్టర్? అని అడిగాడు టినో.

"ఎందుకంటే ఇష్మాయేల్ మరియు ఆర్థర్‌లను నేను బాధపెడ్తానేమోనన్న భయంతో అలిసిపోయాను. మేము ఏవేవి చేయాలని వారు చెప్పారో అవన్నీ చేస్తున్నాం కాని అవి యేసును ప్రేమించినందుకు కాదు. వారలా చేయమని బలవంతపెడ్తున్నారు గనుక చేస్తున్నాం. దినమంతా వర్క్‌షాప్‌లో పనిచేస్తున్నప్పుడు ఒక క్రైస్తవునిగా ఉండాలంటే నేనేమేమి చేయాలో ఇష్మాయేల్ తరచుగా చెప్తుంటాడు ఒకవేళ నేనతనితో ఏకీభవించకపోతే నేనేదో తప్పు చేస్తున్నానన్న భావన కలిగేలా చేస్తాడు." అన్నాడు విక్టర్.

వెంటనే లోరీ అందుకొని "ఆర్థర్ మాటలు వింటుంటే సహవాసంలోని వారు మమ్మల్ని తిరస్కరిస్తారేమో లేక దేవుడు మమ్మల్ని తిరస్కరిస్తాడేమో అన్పిస్తుంది. ఇటువంటి భయాలుంటే మేం సహవాసాన్ని సంతోషంగా అనుభవించలేం కదా?!" అన్నది.

టినో ఒక్క నిముషం ఆలోచించి ఇలా అన్నాడు. "ఒక వేళ ఇష్మాయేల్ మరియు ఆర్థర్‌లు నూతన విశ్వాసులను ఆటంక పర్చినట్టయితే, మనలో విభజనను కలిగించినట్టయితే మనం దేవుడు కోరినట్టుగా వారిని సరిదిద్ది, క్రమశిక్షణలోకి తేవల్సి ఉంటుంది".

"మీరు వారినెలా శిక్షిస్తారు? అని అడిగాడు విక్టర్ "నా ఉద్దేశం వారిని శిక్షించాలని కాదు. శిక్ష విధించడం దేవుని పని. అది ఆయనకే వదిలేద్దాం. దేవుడు తన బిడ్డలను సరిదిద్దుతాడు. క్రమశిక్షణలోకి తెస్తాడు. ఎందుకంటే ఆయన వారిని ప్రేమిస్తున్నాడు గనుక. తప్పుగా ఆలోచిస్తున్న లేక తప్పుదారిలో వెళ్తున్న విశ్వాసులను సరియైన మార్గంలోకి తేవడానికే వారిని మనం సరిదిద్దుతాం కాని శిక్షించడానికి కాదు. విశ్వాసులు తీవ్రమైన తప్పు చేసినట్టయితే వారిని మృదువుగా సరిదిద్దాలి, అయితే కచ్చితంగా తప్పును సరిచేయాలని గలతీ 6:1 తెలుపుతుంది. ఒకవేళ వారు దిద్దుబాటును ఒప్పుకోకుండా పాపం చేస్తూనే ఉంటే 1 కొరింథి 5లో చెప్పినట్టుగా వారు పశ్చాత్తపపడేంత వరకు ప్రభురాత్రి భోజనంలో వారిని పాల్గొననీయకూడదు." అన్నాడు టినో.

తర్వాత, వారు కలిసి ప్రార్థించారు. టినో మరొకసారి ఆ యువజంటకు దేవుని ప్రేమను గూర్చి నిశ్చయత కలిగించే మాటలు చెప్పాడు. వారికి కొంత ధైర్యం కలిగింది. ఆ తర్వాత రెండు వారాలపాటు దేవుని కొరకు కష్టపడి పనిచేశారు. తన పట్ల లోరీపట్ల దేవుడు ఏం చేశాడో విక్టర్ తన స్నేహితులకు చెప్పాడు. అంతేకాదు వారికి శాశ్వతమైన రక్షణను గూర్చి మరియు క్రీస్తునందు దేవుడిచ్చే కృపను గూర్చి వివరించాడు. లోరీ కూడా ఇరుగు పొరుగు మహిళలకు యేసు కృపను గూర్చి వివరించింది.

ఒకనాడు సమావేశం తర్వాత టినో, విక్టర్ మరియు లోరీలనుద్దేశించి ఇలా అన్నాడు. "మీ స్నేహితులు కొందరు క్రీస్తునంగీకరించారు. విక్టర్! నేననుకుంటాను మీ ఇంట్లో ఒక క్రొత్త బృందానికి నీవు నాయకత్వం వహించవచ్చు".

"నేను చేయగలనంటారా? నేనొక బృందానికి నాయకత్వం వహించడం ఇష్మాయేల్ ఇష్టపడడు. నేనేమైనా పొరపాట్లు చేస్తానేమో" అన్నాడు. విక్టర్.

"అందరం పొరపాట్లు చేస్తాము. కాబట్టి నీవు దాన్ని గూర్చి భయపడకు. నేనూ జూలీ మీకు కావల్సిన శిక్షణనిస్తాం. మీరు సరియైన పనులు చేయడానికి సహాయం చేస్తాం. మీరు ఇష్మాయేల్‌కుగానీ, ఆర్థర్‌కుగానీ భయపడనవసరంలేదు. ఇతర సహవాసాల నాయకులు వారితో ఏకీభవించడం లేదు, ప్రేమగల సంబంధ బాంధవ్యాలపై మా సహవాసాలను కట్టుకోవాలన్న అంగీకారానికి మేము వచ్చాము."

"అది వినడం మాకెంతో సంతోషంగా ఉంది. ఇష్మాయేల్ మరియు ఆర్థర్ తప్పు చేసామన్న భావనను మాలో కలిగిస్తూనే ఉంటారు" అన్నది లోరీ.

"వారిని పట్టించుకోకండి లోరీ వారిప్పుడు మీకు నాయకులు కాదు" టినో అన్నాడు.

"దేవుని కృప విషయంలో వారు పిసినారులు" మన విశ్వాసం మనం స్థిరంగా ఉన్నంతకాలం కృపా ప్రవాహాన్ని ఆపే శక్తి వారికిలేదు".

క్రొత్త సహవాసాన్ని విక్టర్ ఇంట్లో స్థాపించడం గూర్చి మాట్లాడుకొని, ప్రార్థించిన తర్వాత దానికి నాయకత్వం వహించడానికి విక్టర్ ఒప్పుకొన్నాడు. వారి ఇంట్లో ఒకటి రెండు సమావేశాలు అయిన తర్వాత, విక్టర్ లోరీతో ఇలా అన్నాడు "క్రొత్త సహవాసాన్ని ఏర్పర్చడం తేలిక. మనం చేయాల్సిందల్లా టినో మరియు జూలీలు మనకు చెప్పిన విషయాలను ఉన్నదున్నట్టుగా వారికి చెప్పడమే".

"ఈరోజు ఉదయం 1 కొరింథి 11:1లో పౌలు ఏమని ఉపదేశించాడో నేను చదివాను. నేను క్రీస్తునుపోలి నడుచుకొన్న ప్రకారం మీరు నన్ను పోలి నడుచుకొనుడి అని అతడన్నాడు మనమది చేస్తున్నాం విక్టర్ మన శిక్షకుడైన టినోను మనం అనుకరిస్తున్నాం అతడు యేసును అనుకరిస్తున్నాడు" అన్నది లోరీ.

"అవును ఫలితం చూడు! ఆనందంగా అన్నాడు విక్టర్ మన మిత్రులలో కొందరు, వారి మిత్రులు, వారి మిత్రుల మిత్రులు క్రీస్తు దగ్గరికి వచ్చారు! నేనూహించిన దానికన్నా వేగంగా కృపానది ప్రవహిస్తున్నది"

విక్టర్ ఇంట్లోని సహవాసం ఎలా ముందుకెళ్తుందో తెలుసుకోవడానికి టినో వారానికి ఒకసారి విక్టర్‌ను కలుసుకొనేవాడు. ఆ తర్వాత జరగబోయే సమావేశాల కొరకు ప్రణాళికలు తయారుచేసుకోవడానికి సహాయపడేవాడు సూచనలిచ్చేవాడు. క్రీస్తులో ఎదుగుతూ దేవుని వాక్యాన్ని ఎలా అన్వయించుకోవాలో గ్రహించిన తర్వాత విక్టర్ టినోను కలుసుకోవడం తగ్గిపోయింది. వారిద్దరూ కలుసుకొన్న సమయంలో

ఒకసారి టినో ఇలా అన్నాడు. "మా సహవాసం వారు, మన దేశంలో దూరప్రాంతానికి పంపించిన మిషనెరీలను నేను దర్శించాలను కొంటున్నాను నేను వెళ్ళిరావడాని కొన్ని వారాలు పట్టవచ్చు, నేను లేని సమయంలో నీవు మరియు లోరీ మీ సహవాసంలోని ఒక్కొక్క వ్యక్తి తమ ఆత్మీయ వరాలతో ఇతరులకు పరిచర్య చేయడానికి సహాయపడాలి. అయితే అందరికి తమకున్న ఆత్మీయ వరాలను గూర్చి తెలిసి ఉండకపోవచ్చు కాని వారు క్రొత్త నిబంధనలోని, "ఒకరి–కొకరు" ఆజ్ఞలను పాటించడం మాత్రం ప్రాముఖ్యమైన విషయం.

"ఒకరి – కొకరు ఆజ్ఞలు" అంటే ఏమిటి? విక్టర్ కుతూహలంగా ప్రశ్నించాడు."

"ఒకరి – కొకరు" ఆజ్ఞలంటే, ఒకరికొకరు పరిచర్య చేసుకోవడం, ఒకరి భారాలనొకరు భరించడం, మీ తప్పిదాలను ఒకరితో ఒకరు ఒప్పుకోవడం, ఒకరినొకరు సరిదిద్దుకోవడం, ఒకరినొకరు స్థిరంగా ప్రేమించడం, ఒకరినొకరు క్షమించడం మొదలైనవి. వాటిలో కొన్ని పదేపదే ప్రస్తావించబడ్డాయి. ఒక సహవాసంలోని వ్యక్తుల మధ్య, అలాగే వేరువేరు సహవాసాల మధ్య ప్రేమపూరిత సంబంధాలుండడం వీటికి చాలా అవసరం" వివరించాడు టినో.

ఇద్దరు కలిసి బైబిల్‌లోని క్రొత్త నిబంధనలో యేసు మరియు ఆయన అపొస్తలులు చెప్పిన "ఒకరి–కొకరు" ఆజ్ఞలను, విశ్వాసుల మధ్య సత్సంబంధాలుండడానికి సహాయపడే మరికొన్ని ఆజ్ఞలను చదివారు. విక్టర్ వాటిని జాగ్రత్తగా వ్రాసుకొని వాటి భావం మరియు ఆచరణలో ఏ విషయంలో ఉపయోగించాలనే దానిని బట్టి క్రింద చూపిన విధంగా వేరువేరు అంశాలుగా వర్గీకరించాడు.

## విశ్వాసుల మధ్య సత్సంబంధాలకై "ఒకరి – కొకరు" ఆజ్ఞలు

**ప్రేమ :**

ఒకరినొకరు ప్రేమించాలి: యోహాను 13:34–35; 5:12, 17; రోమా 12:10; 1 థెస్సలోనిక 4:9; 1 యోహాను 3:11,14,23; 4:7,11,12; 2 యోహాను 1:5; 1 పేతురు 1:22

ధర్మశాస్త్రాన్ని నెరవేర్చడానికి ప్రేమించాలి: రోమా 13:8

ఒకరిపట్ల ఒకరు చూపించే ప్రేమ విస్తరించాలి. 2 థెస్స 1:3

ఒకరిపట్ల ఒకరు ప్రేమలో అభివృద్ధి చెందాలి: 1 థెస్స 3:12

అనేక పాపములను మరుగుపర్చేంత మిక్కుటంగా ప్రేమించాలి. 1 పేతురు 4:8.

**జాగ్రత్తగా సత్సంబంధాలు నెలకొల్పుకొనుట :**

ఒకరితో ఒకరు సహవాసం కలిగి ఉండాలి : 1 యోహాను 1:7

ఒకరినొకరు క్షమించాలి : ఎఫెసి 3:13; 4:32; కొలస్సి 3:13

పవిత్రమైన ముద్దుతో ఒకరినొకరు పలకరించుకోవాలి. (కొంత మందిలో కౌగిలించుకొనే ఆచారం కూడా ఉంటుంది) రోమా 16:16; 1 కొరింథి 16:20; 2 కొరింథి 13:12; 1 పేతురు 5:14.

రొట్టె విరిచి సంస్కారంలో పాల్గొనడానికి ఒకరి కొరకొకరు వేచి చూడాలి 1 కొరింథి 11:33.

ఒకరి శ్రమలనొకరు భరించాలి : 1 కొరింథి 12:26.

ఒకరికొకరు పరిచర్యచేయాలి. (ఇది వ్యక్తులకు మరియు సహవాసాలకు అన్వయించవచ్చు. ఒక గుంపు మరొక గుంపుకు పరిచర్య చేయాలి) గలతి 5:13.

**పరిచర్య :**

తమకున్న ఆత్మవరాల ద్వారా ఒకరికొకరు పరిచర్యచేయాలి. 1 పేతురు 4:10.

ఒకరికొకరు ప్రేమతో పరిచర్య చేయాలి : గలతీ 5:13,

ఒకరిపట్ల ఒకరు దయగా ప్రవర్తించాలి : 1 థెస్సలోనిక 5:15,

ఒకరిపట్ల ఒకరు శ్రద్ధ కలిగి ఉండాలి : 1 కొరింథి 12:25.

ఒకరి భారాలనొకరు భరించాలి : గలతీ 6:2.

ఒకరి పాదాలనొకరు కడగాలి : (నమ్రతతో ఇతరులకుచేసే సేవకు అది గుర్తు) : యోహాను 13:14.

ఒకరితో ఒకరు కలిసి పనిచేయాలి : 1 కొరింథి 3:9; 2 కొరింథి 6:1.

**బోధించుట :**

ఒకరి కొకరు బోధించుకోవాలి : కొలస్సి 3:16.

ఒకరి కొకరు ఉపదేశించుకోవాలి : రోమా 5:14.

**ప్రోత్సహించుకొనుట :**

ఒకరి నొకరు ప్రోత్సహించుకోవాలి : కొలస్సి 3:16; హెబ్రీ 10:25.

ఒకరి నొకరు హెచ్చరించుకోవాలి : హెబ్రీ 3:13.

ఒకరితో ఒకరు సత్యమే మాట్లాడాలి : ఎఫెసి 4:25.

ఒకరి కొరకొకరు ప్రాణాలు అర్పించగలిగి ఉండాలి : 1 యోహాను 3:16.

ప్రేమించడానికి మరియు మంచి పనులు చేయడానికి ఒకరి నొకరు పురికొల్పుకోవాలి. హెబ్రీ 10:24.

**బలపర్చుట :**

ఒకరినొకరు బలపర్చుకోవాలి (స్థిరపర్చుకోవాలి, జీవితాలను కట్టుకోవాలి) 1 థెస్సలోనిక 4:18; 5:1,11.

ఒకరినొకరు బలపర్చుకొనుటకు కూడివచ్చునప్పుడు కీర్తన పాడవలెను, బోధింపవలెను, ప్రకటన చేయవలెను మరియు భాషలలో మాటలాడవలెను. 1 కోరింథి 14:26

**ఆత్మీయ శ్రద్ధను కనపర్చుట :**

ఒకరికొకరు తమ తప్పులను ఒప్పుకోవాలి. యాకోబు 5:16.

ఒకరికొరకొకరు ప్రార్థించాలి. యాకోబు 5:16.

సహవాసంలో ఒకరితో ఒకరు ఐక్యత కలిగిఉండాలి. అలాగే వేరువేరు సహవాసాల మధ్య కూడ ఐక్యత పెంపొందించుకోవాలి.

**వినయమనస్కులై ఉండుట :**

ఒకరినొకరు గౌరవించుకోవాలి : రోమా 12:10

ఒకరు చెప్పిందొకరు ఒప్పుకోవాలి : 2 కొరింథి 13:11; రోమా 12:16; 15:5.

ఒకరి నొకరు విమర్శించకూడదు : రోమా 14:13.

ఒకరి గూర్చి ఒకరు చెడుమాట్లాడకూడదు : యాకోబు 4:11, 5:9.

ఒకరికొకరు లోబడాలి : ఎఫెసి 5:21.

ఒకరిపట్ల ఒకరు వినమ్రతతో నడుచుకోవాలి : 1 పేతురు 5:5.

**ఏకత్వంలో జీవించాలి :**

ఒకరితో ఒకరు ఓపికగా వ్యవహరించాలి. ఎఫెసి 4:2.

ఒకరితో నొకరు సమాధానంగా ఉండాలి. మత్తయి 9:50

ఒకరి నొకరు ప్రేమతో ఆతిథ్యమివ్వండి. రోమా 15:7; 1 పేతురు 4:9.

అందరూ కలిసి దేవుని మహిమపర్చాలి. రోమా 15:6

"మా సహవాసంలోని నూతన విశ్వాసులు ఈ "ఒకరి కొకరు" ఆజ్ఞలను ఆచరించేలా చేయవచ్చను కొంటున్నాను కాని పోయిన వారం వారిలో కొందరు ఒకరితో ఒకరు వాదించుకొన్నారు. దాన్ని గూర్చి నాకు కొంచెం బాధగా ఉంది" అన్నాడు విక్టర్.

"నీకు దేవుని సహాయం కావాలి. ఎందుకంటే ప్రేమపూర్వక సంబంధాలను సాతాను వ్యతిరేకిస్తాడు. దేవుడు చెప్పినట్టుగా మనం ఒకరికొకరం పరిచర్య చేసుకోకుండా వాని దుష్టాత్మలు మనలను నిరోధించడానికి ప్రయత్నిస్తాయి. దేవుని కృపా ప్రవాహం స్వేచ్ఛగా ప్రవహించకుండా చేయడానికి వాడు, వాని అపవిత్రాత్మలు ఎప్పుడూ ప్రయతిస్తూనే ఉంటాయి. ఎందుకంటే విశ్వాసులు తమ ఆత్మీయ వరాలను ఉపయోగించి ఒకరికొకరు పరిచర్య చేసుకోవడమంటే సాతానుకు అసహ్యం. అయితే యేసు తన మరణం మరియు పునరుత్థానం ద్వారా మనపై సాతాను ప్రభావాన్ని ఎప్పటికిని నాశనం చేశాడు. కొలస్సి 2:13–15. లోని వాక్యం ఆ విషయమైన నిశ్చయతనిస్తుంది.

"దయచేసి ఆత్మవరాలంటే ఏమిటో మరి కాస్త వివరంగా చెప్పు టినో!" అభ్యర్థించాడు విక్టర్.

"వరాలు" అనే మాటకు బైబిల్‌లో వాడబడిన పద్యాన్ని "కృపలు" లేదా "వరాలు" అని తర్జుమా చేయవచ్చు. ఇతరులకు పరిచర్య చేయడానికి దేవుడు ఈ ప్రత్యేక సామర్థ్యాలనిస్తాడు. అవి ఆయన కృపలో నుండి ఉత్పన్నమయ్యేవే. మనం ఒకరికొకరం పరిచర్య చేసుకోవడం ద్వారా ఆయన కృప మన ద్వారా ప్రవహించి ఇతరులను చేరుకోవడానికి మనం వీలు కల్పిస్తామన్నమాట. విశ్వాసులందరికి ప్రత్యేకమైన వరాలుంటాయి వాటిని ఏదో ఒక రకమైన పరిచర్యలో వారుపయోగించాలని ఎఫెసి 4:11–12 వివరిస్తుంది.

"పరిచర్య అంటే ప్రధానంగా బోధించడమేనని ఆర్థర్ నిన్న చెప్పాడు. అది నిజమేనా?"

"పరిచర్య అంటే బోధించడం కన్నా ఎంతో ఎక్కువ"చెప్పాడు టినో. "మనం ఇతరులకు ఆశీర్వాదకరంగా ఉండగలుగునట్లు దేవుడు విశ్వాసులందరికీ వేరువేరు పరిచర్యల కొరకు ప్రత్యేక వరాలనిస్తాడు" అని వివరించాడు. క్రైస్తవ సంఘాలు, సహవాసాలు ఎటువంటి పరిచర్యలు చేయాలని నూతన నిబంధన చెప్పిందో వారు కొంతసేపు చర్చించారు. ఇతరులకు పరిచర్య చేయడానికి తగిన పద్ధతులను విక్టర్ ఇలా వ్రాసుకున్నాడు: కాపరిగా సలహాలనిచ్చుట, తప్పులను సరిదిద్దుట, దుఃఖపడుతున్న వారిని ఆదరించి తగు రీతిలో సలహాలనిచ్చుట, నడిపింపు, స్వస్థపర్చడం, సహాయపడడం, దయ చూపించడం, హెచ్చరికతో కూడిన ప్రవచనాత్మకమైన మరియు ప్రోత్సహించే మాటలు మాట్లాడటం.

**నిర్వాహకత్వం లేక జవాబుదారి తనాన్ని అభ్యాసం చేయడం, ఇవ్వడం, విజ్ఞాప ప్రార్థనలు చేయడం, గృహకూడికలలో వాక్యాన్ని అధ్యయనం చేయడం, వివాహం, కుటుంబం మరియు బిడ్డల శిక్షణను బలపర్చడం, ఆరాధించడం మరియు**

**సహవాసం కొరకు వివిధ ప్రత్యేక సమావేశాలను ఏర్పరచడం.**

**సువార్తనందించడం, క్రమశిక్షణ పాటించేలా చూడడం, కాపరిగా బాధ్యతలు నిర్వర్తించడం.**

**క్రొత్త సంఘాలను లేదా కూడికలను ప్రారంభించడం, మిషనెరీలను (సువార్తికులను) పంపించడం.**

**ప్రజల అవసరాలకు దేవుని వాక్యాన్ని అన్వయించడం, మరియు నాయకులకు శిక్షణ నివ్వడం."**

"ఇప్పుడుమా సహవాసంలో బోధించవల్సిన ఎన్నో విషయాలున్నాయని తెలిసింది. అసలు అవన్నీ బోధించగలనా? అని అన్పిస్తుంది." అన్నాడు విక్టర్."నిజమే! దేవుని సహాయం లేకుండా నీవు చేయలేవు! కాని ఆయన నీకు సహాయం చేస్తానని వాగ్దానం చేశాడు" అనునయించాడు టినో.

మరునాడు ఉదయమే వాళ్ళ ఇంటి గుమ్మం దగ్గర ఏదో శబ్దం వినబడడంతో నిద్రలేచాడు విక్టర్. కిటికీలో నుండి బయటకు చూశాడు. ఇష్మాయేల్ కనబడ్డాడు. "అంటే ఏదో జరిగిందన్న మాట" అనుకొన్నాడు విక్టర్.

అతడు వెంటనే ఇష్మాయేల్‌ను లోపలికి పిలవడానికి త్వరత్వరగా వెళ్ళాడు. "విక్టర్, ఈ రోజు నీకు పనికెళ్ళే అవసరంలేదు" అన్నాడు.

"ఎందుకు?" అన్నాడు విక్టర్ ఆందోళనగా

"వర్క్‌షాప్ కాలిపోయింది?"

"ఏంటీ?!" ఆశ్చర్యంతో ఆందోళనతో అరిచినట్టుగా అన్నాడు విక్టర్.

"అవును షాప్ అంతా కాలిపోయింది. అన్ని పరికరాలు పాడయ్యాయి. ఏమీ మిగలలేదు" అంటూ ఏడ్చాడు ఇష్మాయేల్.

లోరీ వచ్చి అతని రెండు చేతులు పట్టుకొంది ఓదార్పుగా, విక్టర్ ప్రార్థన చేశాడు.

తర్వాత వర్క్‌షాప్ అంతా శుభ్రం చేయడంలో ఇష్మాయేల్‌కు సహాయం చేశాడు విక్టర్. కాని ఏవో కొన్ని చిన్నచిన్న పరికరాలు తప్ప ఆ బూడిదలో ఏమి దొరకలేదు. వర్క్‌షాప్ అంతా ధ్వంసమైంది ఏమి మిగులలేదు. మరునాడు ఇష్మాయేల్ మళ్ళీ విక్టర్ దగ్గరికి వచ్చాడు చాలా సేపు నిశ్శబ్దంగా కూర్చున్నాడు. లోరీ టీ ఇస్తూ "మీకు సహాయపడడానికి మేమేం చేయగలం" అని అడిగింది.

అతడేమీ జవాబివ్వలేదు చాలా సేపు వారు కూడా అలాగే నిశ్శబ్దంగా కూర్చున్నారు. చివరకు "దేవుడే ఇలా చేశాడు" అన్నాడు ఇష్మాయేల్.

"లేదు సాతాను చేశాడు" దృఢంగా అన్నది లోరీ.

"అయితే సాతాను చేయడానికి దేవుడనుమతించాడు" అన్నాడు ఇష్మాయేల్.

విక్టర్ ఇష్మాయేల్‌తో మాట్లాడడానికి ప్రయత్నించాడు. కాని అతడేమీ జవాబివ్వలేదు. మళ్ళీ చాలాసేపు అలాగే నిశ్శబ్దంగా కూర్చున్నాడు. హఠాత్తుగా మృదువైన స్వరంతో "దయచేసి ఒక అగ్గిపెట్టె ఇవ్వండి" అన్నాడు. అగ్గిపెట్టెనా? ఎందుకు? మళ్ళీదేన్నైనా కాల్చేస్తావా?" అన్నాడు విక్టర్ ఆతృతగా.

"అవును అంటూ తన జేబులో నుండి ఒక కాగితంతీసి "నీవు మరియు లోరీ తప్పక చేయాలని నేను నిర్దేశించిన పనుల జాబితా ఇది. దీన్నే కాల్చేయాలి" అన్నాడు ఇష్మాయేల్. లోరీ అగ్గిపెట్టె తెచ్చింది. ఇష్మాయేల్ ఆ కాగితాన్ని జాగ్రత్తగా కాల్చేశాడు తర్వాత ఇలా అన్నాడు.

"నేను గతంలో మా అంకుల్ వాళ్ళ గుడికెళ్ళేవాన్ని. మా నాన్నలాగ అతడు కూడ ఇస్లామ్ మతాన్ని వదిలి మిక్కిలి శ్రద్ధ, పట్టుదల, ఉత్సాహంగల క్రైస్తవుడయ్యాడు. అయితే నియమాలను పాటించడం విషయం తీవ్రంగా పరిగణించేవాడు. మిమ్మల్ని నేను ఏవైతే చేయమన్నానో అవన్నీ అతడే నాకు బోధించాడు. ఒకవేళ నేనవి చేయకపోతే దేవుడు నన్ను శిక్షిస్తాడని భయపడేవాన్ని. భయంలోనే జీవించాను. నీవు నా దగ్గర పనిచేస్తున్నావు గనుక నీ గురించి కూడా నేనలాగే

శ్రద్ధతీసుకోవాలని దేవుడు కోరుతున్నాడనుకొన్నాను. నీవా నియమాలన్నీ అనుసరించేలా చూడడం నా బాధ్యత అనుకొన్నాను. నీవు దేవుని శిక్ష పొందకుండా చూడాలనుకొన్నాను. అయితే ఈ అగ్ని ప్రమాదం జరిగినప్పటి నుండి మన కాపరియైన టినో చెప్పిన విషయాలను గూర్చి దేవుని వాక్యం చదవడం మొదలుపెట్టాను. నేను చేసింది చాలా తప్పని తెలుసుకొన్నాను. నేను దేవుని కృపకు మరియు ఆయన పరిశుద్ధాత్మకు వ్యతిరేకంగా పోరాడానని తెలుసుకొన్నాను" అన్నాడు..

విక్టర్ ఆశ్చర్యంతో నోట మాట రానట్టుగా ఉండిపోయాడు. కొంతసేపు నిశ్శబ్దంగా ఉన్నతర్వాత "నేను సంతోషంతో అరవాలా లేక ఏడ్వాలా నాకర్థం కావడంలేదు" అన్నది లోరీ మృదువుగా! ఆమె ఆ రెండూ చేసింది కూడ.

ఆ తర్వాతి రోజు సాయంత్రం విక్టర్ ఇంటికి వచ్చి, నాకు మరొక చోట ఉద్యోగం దొరికింది నన్ను పరీక్షించడానికి కేవలం ఒక అనుభవజ్ఞుడైన వెల్డర్ మాత్రమే చేయగల కష్టమైన పని ఇచ్చారు. నాకు వేగంగా, సరిగ్గా చేయగల నైపుణ్యముందని ఆ మేనేజర్ అన్నాడు. నేనింతకు ముందు సంపాదించిన దానికి రెట్టింపు జీతమిస్తానన్నాడు" అని చెప్పాడు.

"మన కష్టాలన్నీ తీరిపోయాయి" సంతోషంగా అన్నది లోరీ.

"అప్పుడే కాదు! ఆర్థర్ ఒక పెద్ద సంఘంలోని క్రైస్తవుల నుండి తన పరిచర్య అభివృద్ధి కొరకు డబ్బు తీసుకొన్నాడట. అతనికొక స్వంత పరిచర్య ఉందని నాకు తెలియదు. కాని తనకొక సేవా పరిచర్య ఉందని అతడు వారిని నమ్మించాడు. అయితే ఆ డబ్బుతో అతడు వివిధ వ్యక్తులను మన సహవాసానికి తీసుకొని వచ్చి ఇంతకు ముందు ఇష్మాయేల్ బోధించిన విషయాలను వారితో బోధింపజేస్తున్నాడు. టినో ఊర్లో లేకపోవడాన్ని అదనుగా తీసుకొన్న ఆర్థర్, రెండు కుటుంబాల వాళ్ళను తన మాటలతో వశపర్చుకొని టినో సహవాసం వదిలి తనవెంట వచ్చేలా చేసుకొన్నాడు. వారిప్పుడు "ఏకైక సత్యమార్గం" అనే పేరుతో ఒక క్రొత్త సహవాసాన్ని ప్రారంభిస్తున్నారు. నేను ఇంటికి వస్తున్నప్పుడు దారిలో మన సహవాసానికి వచ్చే కుటుంబం యొక్క ఇంట్లోకి ఆర్థర్ వెళ్ళడం చూశాను. సాతాను బాణం యొక్క విషం నిమ్మదిగా వ్యాపిస్తున్నది" అన్నాడు విక్టర్.

లోరీ నిశ్శబ్దంగా కూర్చుండి పోయింది మనసులోనే బాధపడ్తూ.

## అభ్యాసం

ఈ లోకంలో దేవుడు మనకు క్రింది వాటిలో వేటినిచ్చి ఆశీర్వదిస్తానన్నాడు?

- ❑ భౌతిక ఆశీర్వాదాలు.
- ❑ ఆత్మీయ ఆశీర్వాదాలు.

(ఎఫెసి 1:3 ఆత్మీయ ఆశ్వీర్వాదాలను వాగ్దానం చేస్తుంది. లేకపోతే ఈ లోకంలో ఎన్నో లక్షల మంది క్రైస్తవులు నిరుపేదలుగా ఉండడాన్ని మనం వివరించలేం. అయితే నిరుపేద క్రైస్తవులు దేవుని మహదైశ్వార్యానికి వారసులు. క్రీస్తుతో కూడ రాజ్యమేలుతారు.)

ఎవరికైనా క్రీస్తునందలి తమ స్థానం విషయంలో నిశ్చయత కల్గించాలంటే ఈ క్రింది వాటిలో ఏది ఉత్తమమైనది?

- ❑ తామేమైనా నియమాలను పాటించడంలో విఫలమౌతామేమో, దేవుని కృపను పోగొట్టుకొంటామేమో అన్న భయంలోనూ దేవుని శిక్షను అనుభవిస్తామేమోనన్న భయంలోనూ విశ్వాసులనుంచడం.
- ❑ వారు చేసిన పాపాలను పదేపదే గుర్తుచేసి వారు అపరాధ భావనతో తల్లడిల్లేలా చేయడం.
- ❑ వాక్యానుసారంగా దేవుని ఉచిత కృపను గూర్చి బోధించి దాని కొరకు ప్రతిదినం కృతజ్ఞతలు చెల్లించడం. ప్రార్థనా పూర్వకంగా విశ్వాసమనే డాలును ధరించి, సంపూర్ణ పాప క్షమాపణను గూర్చిన నిశ్చయతను ప్రభురాత్రి భోజనం ద్వారా పొందడం.

(దేవుని వాక్యం కృపను గూర్చి ఏం బోధిస్తుందో మీరింకా చదవకపోతే, దయచేసి రోమా 1–8 అధ్యాయాలు మరియు ఎఫెసి 1, 2 అధ్యాయాలు చదవండి)

హేతుబద్ధంగా ఆలోచించేవారు దేవుడు తన మానవాతీతమైన కృపను ప్రభు సంస్కారం ద్వారా మన వద్దకు తెస్తాడని నమ్మరు. కేవలం మానవ తర్కంతో ఆలోచించి కృపను నిర్వచించడంలో ప్రమాదమేమిటి? మనం దేవుని కృపను ఎలా పొందుతాం?

........................................................................................................................

........................................................................................................................

........................................................................................................................

(దేవుని కృప మానవ తర్కానికి అందనంత దూరం వెళ్తుంది. బైబిల్‌లోని ప్రత్యక్షతతోకాక ఏ మతనాయకుడు లేదా ఏతత్వవేత్త కూడ కృపను అర్థం చేసుకోలేదు)

వస్తు, వాహన సంపద కృపను ఈ లోక ఐశ్వర్యపరంగా వివరిస్తుంది. ఒక మేలైన బైబిల్ నిర్వచనం వ్రాయండి.

........................................................................................................................

........................................................................................................................

........................................................................................................................

“ఒకరికొకరు” ఆజ్ఞలలో దేవుడు కోరినట్టుగా విశ్వాసులు ప్రేమతో ఒకరికొకరు పరిచర్య చేయడానికి మీ సంఘం లేదా గృహసహవాసం చేస్తున్న ప్రయత్నాలు మరియు ప్రణాళికలు ఏమిటి?

........................................................................................................................

........................................................................................................................

........................................................................................................................

........................................................................................................................

........................................................................................................................

........................................................................................................................

........................................................................................................................

విశ్వాసులు తమ ఆత్మీయ వరాలను ఉపయోగిస్తూ నూతన నిబంధన చెప్పిన అన్ని పరిచర్యలలో పాల్గొనడానికి మీ సహవాసంలో మీరు తయారుచేస్తున్న ప్రణాళిక లేమిటి?

........................................................................................................................

........................................................................................................................

........................................................................................................................

........................................................................................................................

మీరు లేదా మీరు శిక్షణనిస్తున్న నూతన నాయకులు విశ్వాసులను భయపెట్టి, బెదిరించి నియంత్రించకుండా ఉండడానికి ఎటువంటి జాగ్రత్తలు తీసుకొంటున్నారు?

........................................................................................................................

.......................................................................................................................................

.......................................................................................................................................

## 4వ అధ్యాయం

## లోరీ మరియు విక్టర్‌లు సంతోషకరమైన ఆత్మీయ స్వాతంత్ర్యాన్ని కనుగొన్న విధానం

విక్టర్, లోరీ మరియు జూలీలు టినోతోపాటు రైల్వేస్టేషన్‌కి వెళ్ళారు. సంఘాలు ఫలవంతంగా పనిచేయని ప్రదేశాలకు వారి సంఘం పంపించిన మిషనెరీలను దర్శించడానికి అతడు తిరిగి ప్రయాణమయ్యాడు. స్టేషన్‌కి వెళ్ళే దారిలో “దయచేసి నేనులేని సమయంలోనూ ఇంట్లో జరిగే కూడికకు మీరు మళ్ళీ హాజరుకండి. వారిని సరియైన దారిలో నడిపించండి. నేను లేని సమయాన్ని అదనుగా భావించి విశ్వాసులపై దాడిచేసే తోడేళ్ళ విషయంలో జాగ్రత్తగా ఉండండి అని చెప్పాడు టినో.

“తోడేళ్ళా!? అంటే?” ప్రశ్నించాడు విక్టర్.

“బాగా ఆకలితో ఉన్న పెద్దపెద్ద కుక్కలు, పెద్దపులులవలె బలహీనమైన గొర్రెలను వెదుకుతుంటాయి. యేసు మరియు అపొస్తలుడైన పౌలు అబద్ధపు కాపరులను తోడేళ్ళని” అన్నారు. ఎందుకంటే వారు ఇతర కాపరుల గొర్రెలను దొంగిలిస్తారు” వివరించాడు టినో.

“మీరు ఈ విషయమై మమ్మల్ని హెచ్చరించడం మంచిదయ్యింది. ఇప్పటికే ఒక తోడేలు మన మంద చుట్టూ తిరుగుతున్నది. ఆర్థర్‌కు వరుసకు సోదరుడయ్యే షాజీ తానొక్కడే నిజంగా ఆత్మీయమైన వ్యక్తి అని విశ్వాసులందరూ అనుకోవాలని ప్రయత్నిస్తున్నట్టు అనిపిస్తుంది” అని చెప్పాడు విక్టర్.

“అలాగైతే జాగ్రత్త! సాతాను మాటలు “పులుపు” లాంటివి. పులుపు పాలల్లో లేదా పిండిలో అంతా వ్యాపించి పులిసేటట్లు చేస్తుంది. అలాగే వాని మాటలు చాలా ఆత్మీయంగా అన్పించి విశ్వాసులలో ఒక అంటువ్యాధివలె చాలా వేగంగా వ్యాపిస్తాయి. వారిని కనుక్కోవడానికి మరియు ఎదిరించడానికి దేవుడు మనకు సహాయం చేస్తాడు. ఎఫెసి 6:16 వివరించినట్టుగా దుష్టుని అగ్నిబాణాలను ఎదుర్కొవడానికి మనకు విశ్వాసమనే డాలును ఇస్తాడు. అగ్ని బాణాలంటే, భౌతికవాదం, హేతువాదం, వ్యక్తిత్వ ప్రధానవాదం, గర్వం, మూర్ఖత్వం, విగ్రహారాధన, దురాశ మరియు కామాతురత మొదలైనవి. ప్రతిరోజూ మనం అన్ని వైపుల నుండి ఎన్నెన్నో దుష్టసిద్ధాంతాల దాడికి గురి అవుతుంటాం” అన్నాడు టినో.

“మీరన్న వ్యక్తిత్వ ప్రధాన వాదమేమిటి? అది కృపాప్రవాహాన్ని ఏ విధంగా అడ్డగిస్తుంది?” విక్టర్ ప్రశ్నించాడు.

“మీరు విశ్వాసులకు ఒకరి – కొకరు నియమాలను పాటించమని చెప్తుండగా సాతాను వారిలోకి ఈ వ్యక్తిత్వ ప్రధానవాదాన్ని ఎక్కిస్తాడు. దాని ద్వారా విశ్వాసుల మధ్య ఉండే సంబంధ బాంధవ్యాలను లేకుండా చేస్తాడు. విశ్వాసులు వ్యక్తిగతమైన విశ్వాసం కోరుకొంటారు. వారు తమ స్వంత పద్ధతిలో దేవున్ని సేవించాలనుకొంటారు. వారు సాధారణంగా ఆరాధన సమయంలో తాము విన్నదంతా చక్కగా ఆకలింపు చేసుకొంటారు. ఒక “స్పాంజి” ముక్క నీటిని పీల్చుకొన్నట్టు. కాని మిగిలిన కార్యక్రమాలలో పాల్గొనరు. సన్నిహితమైన, ప్రేమగల సంబంధ బాంధవ్యాలుగల సహవాసం వారిష్టపడరు. దానిని తప్పించుకొంటారు. అలా ఎవరితో కలవకుండా అంటి ముట్టనట్టు ఉండే విధానం, ఒంటరి తనాన్ని కలిగిస్తుంది. ప్రేమను నిర్లక్ష్యం చేస్తుంది. సాతాను ప్రేరేపించే ఈ వ్యక్తిత్వ ప్రధానవాదాన్ని పాటించే సహవాసాలు క్రొత్తనిబంధన నిర్దేశించే ఒకరి – కొకరు నియమాలను పాటించడమేనేది చాలా అరుదైన విషయం” అన్నాడు టినో.

“అహంకారంతో కూడిన మూర్ఖత్వం” కృపను ఎలా అడ్డగిస్తుంది? అని అడిగాడు విక్టర్.

“జ్ఞానం మరియు సంపాదించిన సమాచారంపై విశ్వాసాన్ని కట్టడానికి ప్రయత్నిస్తుంది. అహంకారంతో కూడిన మూర్ఖత్వం లేదా పిడివాదం. 1 కొరింథి 8:1 హెచ్చరించినట్టుగా జ్ఞానం, అధిక సమాచారం తెలిసి ఉండడం మనలో

గర్వాన్ని, అహంకారాన్ని పుట్టిస్తుంది. మనకున్న ఒకే ఒక్క పునాది యేసుక్రీస్తు. బుద్ధిగలవాడు దేనిమీద ఇల్లుకట్టాడో ఆ బండ ఆయనే. బుద్ధిగలవాడు మరియు ఇసుకమీద ఇల్లుకట్టుకొన్న బుద్ధిలేనివాడు, ఇద్దరూ యేసు మాటలు విన్నారు. వారిద్దరికీ సమాచారం అంతా తెలుసు అయితే ఆయన చెప్పిన మాటలకు లోబడేంతగా ఆయనను ప్రేమించింది బుద్ధిగలవాడు మాత్రమే. అహంకారంతో కూడిన మూర్ఖత్వంగల వ్యక్తి లేదా పిడివాదంచేసే వ్యక్తి మంచి సిద్ధాంతాలను బోధించడం ద్వారా తృప్తిపడతాడు. తన జ్ఞానం మీద ఎంతో నమ్మకం పెట్టుకొంటాడు, యేసు చేయమని ఆదేశించిన ఇతర అంశాలను నిర్లక్ష్యం చేస్తాడు" చెప్పాడు టినో.

జూలీ అందుకొని "కొంతమంది అహంకారులైన బోధకులు విశ్వాసుల తలలలో ఒక రంధ్రంచేసి దానిలో ఒక గరాటు నుంచి తమ అభిప్రాయాలను, సిద్ధాంతాలను దానిలో నింపినట్టుగా చేస్తారు. అదృష్టవశాత్తు చాలా మంది యువ విశ్వాసులు "కేవలం వినేవారుగా" ఉండడానికి ఇష్టపడరు. ఇటువంటి బోధను గూర్చి యాకోబు 1:22 హెచ్చరిస్తుంది. వారు ఏదైనా నేర్చుకొన్నప్పుడు దాని విషయం చర్చించి చురుకుగా వాటిలో పాల్గొనాలని అనుకొంటారు. అహంకారంతో కూడిన మూర్ఖత్వం గలవారు బోధించిన వాటన్నింటిని గుడ్డిగా అనుసరించడం కాకుండా, దేవుని వాక్యం వాటిని గూర్చి ఏం చెప్తుందో తెలుసుకోవడానికి మరియు పరిశుద్ధాత్ముని నడిపింపును పొందడానికి వారికి స్వేచ్ఛకావాలి. దేవుడు ఏం చెప్పున్నాడో కేవలం తెలుసుకోవడం మాత్రమే కాదు దాని ప్రకారం చేయాలని వారనుకొంటారు" అని విడమర్చి చెప్పింది.

"ఈ పిడివాదం ఎప్పుడూ తప్పేనా?" తమ మందలోని గొర్రెలు వారి కిష్టమైన చోటికల్లా వెళ్ళడానికి కాపరులు అనుమమతిం చడం ప్రమాదకరం కాదా? అడిగాడు విక్టర్.

"అవును, నిజమే విశ్వాసులందరికీ కాపరుల నడిపింపు అవసరం. అయితే కాపరులమైన మనం బైబిల్ చెప్పినట్టుగా మందను కాయాలి.

అంటే ఎలాగ?"

ఒక మంచి కాపరి తన సహవాసంలోని విశ్వాసులు, స్వాతంత్ర్యాన్నిచ్చే దేవుని వాక్యాన్ని ఎలా అన్వయించుకోవాలో నేర్చుకోవడం ద్వారా పరిణితి చెందడానికి సహాయపడ్తాడు. లేకపోతే ఈ లోకం వారి మనసులను అనవసరమైన సిద్ధాంతాలతో వశపర్చుకొని అబద్ధపు దేవుళ్ళకు బానిసలుగా చేస్తుంది.

అహంకారంతో కూడిన మూర్ఖత్వం గలవారు లేదా పిడివాదంచేసేవారు విస్తారంగా చదవడం, అధ్యయనం చేయడంవల్ల దేవుని కృపలభిస్తుందని అనుకొంటారు. కాబట్టి వారు ఇతరులకు బోధించేవన్నీ తమ ఇరుకైన ఆలోచనా విధానం నుండే వస్తాయి" అన్నాడు టినో.

"నేను యువతరానికి చెందిన దాన్ని. ఇతర విశ్వాసులతో సజీవమైన, ఉత్సాహభరితమైన సంబంధాన్ని కలిగి ఉండడానికి ఇష్టపడతాను. మన కాపరులు దానికి వీలుకలిగిస్తారని ఆశిస్తున్నాను అన్నది లోరీ."

"కాని అది జరిగేలా చూడడం ఎలా? విశ్వాసులు దేవుని వాక్యం నేర్చుకొని దానికి లోబడడానికి నేర్చుకొంటున్నప్పుడు వారు చురుకుగా కలిసి మెలిసి అన్ని కార్యక్రమాలలో పాల్గొనేటట్లు చేయడమెలా?"

"వారిని బైబిల్ కథలు చెప్పమని గానీ లేదా చదవమని గానీ అడగవచ్చు" సూచించాడు టినో. తర్వాత ఆ కథ దేవుని గూర్చి ఏం చెప్తుందో మనం చేయవల్సిందేమిటో చర్చించండి, ఏకపాత్రాభినయాలు, నాటికలు కూడ ప్రదర్శించవచ్చు. వారేం నేర్చుకోవాలని మీరు భావిస్తున్నారో స్పష్టం చేయండి. దేవుని గూర్చి ఆయన కార్యాలను గూర్చి వారు ధ్యానించడానికి సహాయపడగల ప్రశ్నలడగండి. దేవున్ని స్తుతిస్తూ లేక విశ్వాసులను ప్రోత్సహిస్తూ పద్యాలను, పాటలను వ్రాయమని చెప్పండి. ఎప్పుడూ ఒక్కరే బోధించినట్టు ఉండకుండా అందరూ బోధించడానికి సిద్ధపడాలి.

"ఓహ్! దేవుని వాక్యం బోధించగల చిన్నచిన్న నాటికలు తయారుచేయడానికి నేను వారికి సహాయపడగలను. ఏదెను తోటలో జరిగిన సంఘటనలను మనం నాటికలా ప్రదర్శిద్దామా లేక రూతు కథను ప్రదర్శిద్దామా. లోరీ ఉత్సాహం

కనపర్చింది. నీవు ఎస్తేరు రాణి పాత్రను ధరిస్తే చూడాలని ఉంది అన్నాడు విక్టర్. నేను తప్పిపోయిన కుమారుని పాత్రను చక్కగా ధరించగలరు. అతడు తన తండ్రి ఇచ్చిన ఆస్తినంతా వ్యర్ధంగా ఖర్చుపెట్టినట్టు నేను కూడా క్రీస్తునొద్దకు రాకముందు అటువంటి వ్యర్థమైన పనులు చాలా చేశాను. ఆ అనుభవంతో ఆ పాత్రకు న్యాయం చేస్తాను."

"నేను కొవ్విన దూడ పాత్రను చేస్తాను" నవ్వుతూ అన్నాడు టినో. తప్పిపోయిన కుమారుని తండ్రి తన కుమారుడు తిరిగి వచ్చిన సందర్భంగా ఇచ్చిన విందు కొరకు దాన్ని వధించాడు. అతని పెద్ద కుమారుడు మంచివాడే కాని యేసు చెప్పినట్టు అతడు తన తమ్ముని పట్ల తండ్రి చూపించే కృపను మాత్రం సహించలేక పోయాడు. రోజులో కొంతసేపు మాత్రమే ద్రాక్షాతోటలో పనిచేసిన వారికి తమతో సమానంగా యజమాని జీతమివ్వడం సహించలేని పనివారి వంటివాడతడు. కొన్నిసార్లు ఘోరమైన పాపం చేసిన వారు ఉచితంగా పాపక్షమాపణ పొందడం చూసిన మంచివారు దేవుని కృపను వ్యతిరేకిస్తారు.

కాని మన సంఘ పెద్దలు అలా క్రొత్త పద్ధతులతో బోధించడానికి ఇష్టపడతారా? లోరీ అడిగింది.

"లోరీలో చాలా సృజనాత్మకత ఉంది. దానిలో ఆమె ఆనందిస్తుంది. ఆమె బాగా చదువుతుంది అంతేకాదు తాను చదివిన దానిలో ప్రాముఖ్యమైన విషయాలను బాగా గుర్తుపెట్టుకొంటుంది కూడ. ఇప్పుడు దేవుని వాక్యాన్ని సృజనాత్మకంగా క్రొత్త పద్ధతులు బోధించే స్వాతంత్ర్యం మనకుంది. మనం అహంకారంతో కూడిన మూర్ఖత్వంతో పోరాడి గెలిచాం. మీవంటి నూతన విశ్వాసులు స్వేచ్ఛగా దేవుని వాక్యాన్ని చర్చించకుండా మన పెద్దలు ఇక మనలను ఆటంకపర్చరు. మంచి ఫలితాన్నివ్వగల ఏ బోధనా పద్ధతినైనా మనం పాటించవచ్చు" అని వివరించాడు టినో.

"అద్భుతం" ఉత్సాహంగా అన్నది లోరీ.

"ఈ పిడివాదం లేదా అహంకారంతో కూడిన మూర్ఖత్వం అన్ని వేళలా తప్పుకాదని మీరు మాకు చెప్పారు కాని అదెప్పుడు? అని అడిగాడు విక్టర్.

"మనకెప్పుడూ దేవుని వాక్యాధారమైన బలమైన నమ్మకాలుండాలి. మనం దేవుని వాక్యం చదివేది అందరితో గర్వంగా వాదించడానికో లేక దేవుని కృపను సంపాదించడానికో కాదు గాని మనం పొందిన కృపను బట్టి ప్రస్తుతించడానికే చదువుతాం. తప్పు బోధనలను ఎదుర్కొని నిలబడాలంటే మనం కూడ పిడివాదాన్ని లేదా అహంకారంతో కూడిన మూర్ఖత్వాన్ని ఉపయోగించాలి" అని వివరించాడు టినో.

తప్పు బోధన అంటే ఏమిటి? మళ్ళీ ప్రశ్నించాడు విక్టర్.

"కొంత మంది బోధకులు తమ బోధవింటున్న వారంతా పెద్దచెవులు కలిగిన గాడిదలు అని అనుకొంటారు. తమ అనర్గళమైన పిడివాదాన్ని అందరూ నిశ్శబ్దంగా కూర్చొని వినాలని అనుకొంటారు. విశ్వాసులంటే ఒకరికొకరు పరిచర్య చేసుకొంటున్న సజీవమైన అవయవాలనీ ఒకే శరీరమనీ అనుకోరు. తమ పరిసరాలలో సాతానుతో పోరాడే యోధులని ఎంచరు. ఆకలిగా ఉన్న వారికి ఆహారమిచ్చి, వ్యాధిగ్రస్థులను స్వస్థపర్చేవారని కూడా భావించరు" అని వివరించాడు టినో.

"ఓ దేవా! మమ్మల్ని విడుదలచేయి" అన్నది లోరీ.

"ఆయన చేశాడు" అన్నది జూలీ.

టినో చెప్తున్న విషయాలన్నింటినీ జాగ్రత్తగా వ్రాసుకొంటున్న తన పుస్తకంలోకి చూశాడు విక్టర్ నేనెప్పటికైనా ఈ విషయాలన్నీ నేర్చుకొంటానా అంటూ నిట్టూర్చాడు.

"నీవు మరియు లోరీ ఇప్పటికే దేవుని గూర్చి చాలా విషయాలు అర్థం చేసుకొన్నారు. 40 సంవత్సరాలుగా విశ్వాసులుగా జీవిస్తున్న కొందరికన్నా ఎక్కువగా మీరు దేవుని కృపను అర్థం చేసుకొన్నారు. విక్టర్ క్రొత్త విషయాలను అన్వేషించే హృదయం నీకుంది. నాకు తెలిసినవారందరిలో నీవు ఎక్కువ ప్రశ్నలడుగుతావు" అన్నాడు టినో. "చాలా ఎక్కువ ప్రశ్నలడుగుతానా?" విక్టర్ అడిగాడు.

ఓ! లేదులే! నీ కుతూహలం మరియు మంచి చెడులను విశ్లేషించగల సామర్థ్యం కూడా దేవుని కృపా వరాలే. పరిశుద్ధాత్ముని సామర్థ్యమే.

"పరిశుద్ధాత్ముడు మనకు మంచి చెడుల వివేచనను ఎలా అనుగ్రహిస్తాడు?" మళ్ళీ అడిగాడు విక్టర్.

"ఆయన మన మనసులను వెలిగిస్తాడు. తద్వారా మనం దేవుని వాక్యాన్ని మన జీవితాలకు, మన స్నేహితుల జీవితాలకు మరియు మన శత్రువుల జీవితాలకు అన్వయించగలుగుతాం. ఈ లోకపు దేవుడైన సాతాను అవిశ్వాసుల కళ్ళకు గుడ్డితనం కలుగచేస్తాడని 2 కొరింథి 4:4 హెచ్చరిస్తుంది. మనం క్రీస్తునందు విశ్వాసముంచినప్పుడు దేవుని కృపఅనే అద్భుతం ద్వారా దేవుని సత్యాన్ని గుర్తించగలుగుతాం మంచి చెడులను వివేచించగలుగుతాం.

పరిశుద్ధాత్ముడు మనతో అంతరంగాలలో సాక్ష్యమిస్తాడు. రోమా 8లో వ్రాయబడినట్టుగా ఆయన మనలను నడిపిస్తాడు. మనం దేవుని బిడ్డలమన్న నిశ్చయతను మనలో కలిగిస్తాడు" అని వివరించాడు.

"ఎంత గొప్ప ధన్యత" ఆనందంగా అన్నది లోరీ.

"మన మనసులను వెలిగించడానికి పరిశుద్ధాత్ముడు కేవలం దేవుని వాక్యం మాత్రమే ఉపయోగిస్తాడా? మరింకేదీ వాడుకోడా?" విక్టర్ ప్రశ్నించాడు.

"దేవుని వాక్యమే మనకు ప్రమాణం. తుది నిర్ణయం వాక్యప్రకారమే జరగాలి. అయితే దేవుడు ఇతర విషయాల ద్వారా కూడా మనకు బోధిస్తాడని కీర్తన 19, రోమా 1 స్పష్టం చేస్తున్నాయి. అంటే ప్రకృతి, చరిత్ర, స్నేహితులు, మనస్సాక్షి, ఉద్దేశ పూర్వకంగాచేసే వాక్యధ్యానం, ప్రార్థన, అనుభవం మొదలైన వాటి ద్వారా, చాలా అరుదుగా కొన్ని సార్లు కలల ద్వారా ఆయన మనకు ఉపదేశిస్తాడు" అని జవాబిచ్చాడు టినో.

అబద్ధ ప్రవక్తలు తమ కలలను, దర్శనాలను అందరికీ బోధించినట్టుగా నేను యిర్మియా 29లో చదివాను జ్ఞాపకం చేసుకొన్నాడు విక్టర్. అబద్ధ బోధనను సత్యబోధనను ఎలా గుర్తించడం? సందేహం వ్యక్తం చేశాడు.

"అబద్ధబోధ ఎప్పుడూ దేవుని వాక్యంచెప్పే దానికి వ్యతిరేకంగా ఉంటుంది మరియు వాక్యాన్ని తప్పుగా అన్వయిస్తుంది. అంతేకాదు అది మన ప్రభువైన యేసు క్రీస్తును మహిమ పర్చదు. అది తరచుగా ఒక వ్యక్తినో లేదా ఒక సంస్థనో ఘనపరుస్తుంది. అధికార దాహంగల మతనాయకులను వారు ఆశించే అధికార స్థానంలో ఉంచుతుంది" స్పష్టంగా చెప్పాడు టినో.

అలాగా! ఆలోచనగా అన్నాడు విక్టర్. వారు దేవుని వాక్యాన్ని ఉపయోగిస్తారు కాని పరిశుద్ధాత్మ శక్తితో కాదు. వారా విధంగా తమ స్వంత ఆలోచనతో స్వంత బలంతో బోధిస్తే మనమెలా గుర్తించగలం? అని అడిగాడు.

"మరొక రకమైన అబద్ధబోధ ఉంది. అది చాలా మోసకరమైంది. ఎందుకంటే దానిలోని విషయం కాదు గాని దాని ఉద్దేశమే అసత్యం! తమ ప్రసంగాలకు, బోధనలకు దేవుని వాక్యాన్ని ఒక అంశంగా మాత్రమే ఉపయోగించుకొనే అహంకారంతో కూడిన మూర్ఖత్వపు వాదులను గూర్చి జాగ్రత్తగా ఉండాలి. బోధకులమైన మనం మన సహవాసం యొక్క కార్యక్రమాలకు కూడా దేవుని వాక్యమే ప్రమాణంగా ఉండేలా చూసుకోవాలి. మన సాక్ష్యాలను, ఆరాధనను అది నడిపించాలి, క్రొత్త విశ్వాసులను స్థిరపర్చడం, పరిచర్య విధానాలను రూపొందించడం, బోధకులకు శిక్షణ నివ్వడం, మిషనెరీలను పంపించడం వంటి ప్రాముఖ్యమైన విషయాలలో దేవుని వాక్యం మనలను నడిపించేలా చూసుకోవాలి. అంటే అన్ని విషయాలలో దేవుని వాక్యాధారంగానే నిర్ణయాలు తీసుకోవాలి. అబద్ధ బోధకులు తమ బోధలో దేవుని వాక్యాన్ని చక్కగా వివరిస్తారు కాని ఈ కార్యక్రమాలను చేపట్టేటప్పుడు తమకు నచ్చిన విధానాలను క్రొత్త నిబంధనకు వ్యతిరేకమైన పద్ధతులను పాటిస్తారు" టినో సవివరంగా చెప్పాడు.

"ఇక మీ ట్రెయిన్ బయలుదేరుతుందనుకుంటా" అన్నాడు విక్టర్. మనం కలిసి మాట్లాడుకొనేందుకు మంచి సమయం దొరికింది. మీరు ట్రెయిన్ ఎక్కక ముందు మరొక్క ప్రశ్న అడగాలి. పరిశుద్ధాత్ముని నడిపింపును గూర్చి! మనంచేసే పనిలేదా తీసుకొనే నిర్ణయంలో దేవుని చిత్తాన్ని తెలుసుకోవడం ఎలా?" ప్రశ్నించాడు విక్టర్.

"కొంత మంది క్రైస్తవులు కేవలం తమ భావాలు మరియు ఉద్వేగ భరితమైన అనుభవాల ద్వారా నడిపించబడుతుంటారు మరికొంత మంది కేవలం వాక్యం నుండి మరియు దాని విశ్లేషణాత్మక బోధన ద్వారా నడిపించబడుతుంటారు ఇంకొంత మంది తమ సంఘం లేదా సహవాసంలోని వ్యక్తులచేత నడిపించబడుతుంటారు. తమ నాయకులను సంతోషపర్చగల సత్యాలను మాత్రమే నమ్ముతుంటారు. అయితే మనం వీటన్నింటి మధ్య సమతుల్యతను పాటించాలి. ఈ అంశాలన్నింటిని బేరీజు వేసుకొని ఆ సారాంశాన్ని ఒక అనుభవసారంగా నేర్చుకోవడానికి పరిశుద్ధాత్ముడు సహాయం చేస్తాడు. తద్వారా ఆ మూడు మార్గాలను ఉపయోగించుకొని మనలను నడిపిస్తాడు. ఆయన మన అనుభవాలను మరియు భావాలను, మన జ్ఞానాన్ని మరియు తర్కాన్ని విశ్లేషణను మరియు ప్రేమగల సహ విశ్వాసులను ఉపయోగించుకొంటాడు. వీటి మధ్య సమతుల్యత లేకపోతే ఏదో ఒక అంశానికి మాత్రమే ప్రాధాన్యతనిచ్చి కేవలం ఆ మార్గంలోనే విశ్వాసులను నడిపించే సంఘాలు ఏర్పడతాయి. క్రీస్తు శరీరంలో చక్కటి సమతుల్యతను పాడుచేయడానికే సాతాను ఎప్పుడూ ప్రయత్నిస్తుంటాడు. చాలా సార్లు సంఘాలు తమ సామర్థ్యాలను లేదా తమ బలాలను అతి ఎక్కువగా ఉపయోగించడం లేదా వాటికే అధిక ప్రాధాన్యత నివ్వడం వారి బలహీనత అవుతుంది"ఎంతో విపులంగా చెప్పాడు టినో.

"ఇప్పటికీ ఆర్థర్ మరియు అతని స్నేహితులతోనే నాకు పెద్ద సమస్య! వారు నూతన విశ్వాసులలో అపరాధం చేశామన్న భావం రేకెత్తించి వారి మనస్సాక్షిని కష్టపెడతారు. అప్పుడు తాము పాపాన్ని అధిగమించడానికి మరియు ఇతరులను ప్రేమించడానికి దేవుడు తమకు సహాయపడ్డాడా? ఆయన తమతో ఉన్నాడా లేడా అని వారు సందేహిస్తారు. కానీ ఆ గుడ్లగూబ అంటే ఆర్థర్ తరచుగా పాత నిబంధన ప్రవక్తలు చెప్పిన విషయాలను ప్రస్తావిస్తూ దేవుడెలా శిక్షిస్తాడో చెప్తుంటాడు, అతని పిల్లనగ్రోవిలో ఒకటే స్వరం పలుకుతుంది!" నిట్టూర్చాడు విక్టర్.

"ఆర్థర్ మరియు అతని స్నేహితులు పాత క్రొత్త నిబంధనల మధ్య పెద్ద భేదమేమీ లేనట్టుగా మాట్లాడుతారు." హెచ్చరించినట్టుగా అన్నాడు టినో. అందువల్ల విశ్వాసులు గందరగోళంలో పడ్తారు. మనం ధర్మశాస్త్రానికీ, కృపకూ మధ్య భేదం గుర్తించాలి. పాతనిబంధనకు మరియు క్రొత్త నిబంధనకు మధ్యగల గొప్ప భేదాన్ని గుర్తించడంలో విఫలమయ్యే బోధకుల విషయంలో జాగ్రత్తగా ఉండండి. యేసు మరణం మరియు పునరుత్థానం, దేవుడు మానవులతో ప్రవర్తించే విధానాన్ని పూర్తిగా మార్చివేశాయి. దేవుని బిడ్డలు ధర్మశాస్త్రం నుండి కృపలోకి వచ్చారని రోమా 6:14 స్పష్టంగా నిర్ధారిస్తుంది. కాని నియమానుసారమైన జీవితాన్ని బోధించేవారు పాతనిబంధన నియమాలను పట్టుకొని వేలాడుతారు. తప్పుడు బోధకులు ఆ నియామాలను మరిన్ని రెట్లుపెంచుతారు. ప్రాచీన ఇశ్రాయేలీయులకు వర్తించే పాతనిబంధన నియామాలను వాడడం మాత్రమే గాక మానవులేర్పరచిన మరికొన్ని నియమాలను కనుగొని వాటిని పాటించడానికి ప్రయత్నిస్తారు" అన్నాడు టినో.

"పాత నిబంధన నియమాలు కేవలం ఇశ్రాయేలీయులకే వర్తిస్తాయన్నారు కదా, వాటిలో ఏ నియమం కూడా ఈనాడు మనకు వర్తించదా?"

సందేహం వ్యక్తపర్చాడు విక్టర్.

"యేసు మరియు ఆయన అపొస్తలులు క్రొత్త నిబంధనలోని సంఘానికి కొన్ని పాత నిబంధన నియమాలను కూడా నిర్దేశించారు. పాత నిబంధనకు పునాదియైన పది ఆజ్ఞలలో సబ్బాతు దినాన్ని గూర్చిన ఆజ్ఞ తప్ప మిగిలిన వాటిన్నంటిని వారు పునరుద్ఘాటించారు పాత నిబంధన ఆజ్ఞలను పేర్కొని వాటిలో కొన్నింటిని పాటించాలనీ, కొన్నింటిని వదిలేయాలనీ చెబితే విశ్వాసులు అయోమయంలో పడతారు గనుక మనం క్రొత్త నిబంధన నియమాలను మాత్రమే వివరిస్తాం" అని చెప్పాడు టినో.

ఈనాడు మనం పాటించని పాత నిబంధన నియమాలేమిటి? అడిగాడు విక్టర్.

చాలా ఉన్నాయి. నేనవన్నీ చెప్పేలోపు ట్రెయిన్ కదులుతుందేమో వాటిలో కొన్ని ముఖ్యమైన వాటిని చెప్తాను. పాత నిబంధన నిర్దేశించిన క్రింది నియమాలను మనం పాటించం.

సున్నతిలేని వారిని మన పవిత్ర దేవాలయాల లోనికి రానివ్వకపోవడం.

తమ తల్లిదండ్రులను శపించే పిల్లలకు మరణదండన విధించడం. వ్యభిచారులను రాళ్ళతోకొట్టి చంపడం.

విగ్రహారాధనచేసే వారిని చంపడం.

వారంలో ఏడవ రోజు పనిచేసే వారిని చంపడం.

నెరవేరని విషయాలను ప్రవచించిన వారిని హతమార్చడం.

ప్రజలంతా యెరూషలేములోనే పండుగలను ఆచరించాలని నిర్భంధించడం.

ఒక పెళ్ళైన వ్యక్తి, పిల్లలు కాకుండా మరణించిన తన సోదరుని భార్యను పెళ్ళిచేసుకొమ్మని బలవంతపెట్టడం.

ఏడు సంవత్సరాల కొకసారి సంవత్సరంపాటు తమ పొలాలను సేద్యం చేయకుండా బీడుగా వదిలేయమని రైతులను బలవంతపెట్టడం.

వారం వారం ఒక మేకపోతును వధించి ఆరాధనచేయడం, కేవలం యెరూషలేముకు వెళ్ళి ఆరాధించడం మొదలైనవి అని వివరించాడు టినో.

అబ్బా పాతనిబంధన ఎంత కఠినమైంది! అన్నది లోరీ. అవును! చాలా కఠినమైందే అన్నాడు టినో. 2 కొరింథి 3:6ను అనుసరించి, పాతనిబంధనలోని ఆజ్ఞలు మానవులకు తీర్పుతీర్చి మరణానికి దారితీశాయి.

“ఎందుకు? అని వెంటనే ప్రశ్నించాడు విక్టర్. వ్రాసుకోవడానికి పుస్తకం మరియు పెన్ సిద్ధంగా పట్టుకొని దేవుడు మోషేకిచ్చిన ధర్మశాస్త్రం యొక్క ఉద్దేశమేమిటసలు?” అన్నాడు.

పాతనిబంధనకు మూడు ప్రధాన ఉద్దేశ్యాలున్నాయి :

మొదటిది, మానవులంతా తాము పాపులమని గుర్తించగలుగునట్లు అతి పరిశుద్ధుడైన దేవుడు ధర్మశాస్త్రాన్ని ఇచ్చాడని రోమా 3:20 స్పష్టం చేస్తుంది. ధర్మశాస్త్రం పాపం అంటే ఏమిటో తెలిపింది తద్వారా మానవాళిని క్రీస్తు కొరకు సిద్ధపర్చింది. ఈ సత్యాన్ని రోమా 3వ అధ్యాయం మరియు గలతీ 3వ అధ్యాయం నిర్ధారిస్తున్నాయి.

రెండవది, గలతీ 3:24 ననుసరించి దేవుని ప్రజలను క్రీస్తు రాకడ కొరకు సిద్ధపర్చడానికి ధర్మశాస్త్రం ఒక బోధకునిగా పనిచేసింది.

మూడవది, ధర్మశాస్త్రం ఇశ్రాయేలు జనాంగానికి పరిపాలనను, స్థిరత్వాన్ని, నిరీక్షణను మరియు సంతోషాన్ని ఇచ్చింది. కీర్తనలు 119:127లో ధర్మశాస్త్రం పట్ల తనకుగల నమ్మకాన్ని దావీదు ప్రస్తావించాడు.

ధర్మశాస్త్రం యొక్క ఈ మూడు ముఖ్యమైన ఉద్దేశాలను విక్టర్ నోట్‌బుక్‌లో వ్రాసుకొన్నాడు. తర్వాత వాటిని గూర్చి వివరంగా అధ్యయనం చేయాలనుకొన్నాడు. ఆ యువ జంటను చూస్తూ టినో ఇలా అన్నాడు. “దేవుడు ధర్మశాస్త్రం ద్వారా మానవాళి యొక్క పాపాన్ని బహిర్గతం చేశాడు. తన కృప ద్వారా మన పాపాలను క్షమించి మనకు నిత్యజీవమిస్తాడు. యేసు జన్మించడానికి కొన్ని వందల సంవత్సరాల ముందే యిర్మీయా ప్రవక్త ప్రవచించిన కృపాసహితమైన క్రొత్త నిబంధనలో ఇప్పుడు మనం పాల్గొంటున్నాం. (యిర్మీయా 31:31) తాత్కాలికమైన పాత నిబంధన స్థానంలో, రాతిమీద కాక మన హృదయాలలో వ్రాయబడే క్రొత్త నిబంధన వస్తుందని దేవుడు యిర్మీయా ద్వారా బయలు పర్చాడు” అని వివరించాడు టినో.

పాతనిబంధన ఇక మనకు వర్తించదని యేసు మరియు ఆయన అపొస్తలులు చెప్పిన విషయం క్రొత్త నిబంధనలో ఎక్కడ వ్రాయబడింది? ప్రశ్నించాడు విక్టర్.

టినో ఆ వాక్యభాగాలు చెప్తుంటే విక్టర్ ఇలా వ్రాసుకొన్నాడు. దేవుడు విశ్వాసులందరికీ ఇచ్చే ఆత్మఫలమైన ప్రేమను గూర్చిన నిబంధనలో పాతనిబంధనలోని ధర్మశాస్త్ర మంతా నెరవేర్చబడింది. మత్తయి 22:38–40; గలతీ 5:22–23.

మనమింకే మాత్రం పాతనిబంధన కిందలేము, కాని కృప కింద జీవిస్తున్నాం, రోమా 6:8–18.

మనం ధర్మశాస్త్రాన్ని అనుసరించి చేసిన పనులను బట్టిగాక విశ్వాసం ద్వారా కృపచేత నీతిమంతులుగా తీర్చబడుతున్నాం. గలతీ 2:16–3:24.

యేసు తన మరణ పునరుత్థానాల ద్వారా దురాత్మలన్నింటిపై విజయం సాధించి మనకు వ్యతిరేకంగా వ్రాయబడిన మరణ శాసనాన్ని రద్దుచేశాడు. కొలస్సి 2:13–17.

అబ్బా ఎంత ఆదరణ! మనకు తేలికయయ్యింది. తన నియమాలన్నీ పాటించమని ఒత్తిడిచేయడానికి ఆర్థర్‌కేమీ ఆధారం లేదని నాకిప్పుడర్థమయ్యింది అన్నది తేలికగా ఊపిరి పీల్చుకొంటూ లోరీ.

ట్రెయిన్ బయలుదేరే వేళయ్యింది. నేను వెళ్ళకముందు 2 కొరింథి 3:6–10లోని వాక్యం కృపాసహితమైన క్రొత్త నిబంధనను గూర్చి ఏం చెప్తుందో వినండి. అంటూ ఆ వాక్య భాగం చదివాడు, టినో.

“ఆయన మమ్మును క్రొత్త నిబంధనకు అనగా అక్షరమునకు కాదుగాని ఆత్మకే పరిచారకులమవుటకు మాకు సామర్థ్యము కలిగించియున్నాడు. అక్షరము చంపునుగాని ఆత్మ జీవింపచేయును. మరణకారణమగు పరిచర్య, రాళ్ళమీద చెక్కబడిన అక్షరములకు సంబంధించినదైనను మహిమతో కూడినదాయెను. అందుకే మోషే ముఖము మీద ప్రకాశించుచుండిన ఆ మహిమ తగ్గిపోవునదైనను, ఇశ్రాయేలీయులు అతని ముఖము తేరి చూడలేకపోయిరి. ఇట్లుండగా ఆత్మసంబంధమైన పరిచర్య యెంత మహిమగలదై యుండెను? శిక్షావిధికి కారణమైన పరిచర్యయే మహిమ కలిగినదైతే, నీతికి కారుణమైన పరిచర్య యెంతో అధికమైన మహిమ కలదగును. అత్యధికమైన మహిమ దీనికుండుట వలన ఇంతకుమునుపు మహిమ కలదిగా చేయబడినది ఈ విషయములో మహిమలేనిదాయెను. తగ్గిపోవునదే మహిమ గలదైయుండిన యెడల, నిలుచునది మరి యెక్కువ మహిమ గలదైయుండును గదా!

విక్టర్ మరియు లోరీలు ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత, వారి కొరకు టినో తయారుచేసిన “ఛార్టును” జాగ్రత్తగా చదివారు దానిలో పాత నిబంధనకు మరియు క్రొత్త నిబంధనకు మధ్యగల ప్రధానమైన భేదాలున్నాయి.

## పాత మరియు క్రొత్త నిబంధనకు గల పోలికలు మరియు భేదాలు

చరిత్ర అంతటిని సిలువ రెండుగా విభజించింది. మెస్సియ్యా సిలువమీద మరణించి, తిరిగి లేచారు గనక దేవుడు తాను ఇశ్రాయేలు జనాంగానికి ఇచ్చిన ధర్మశాస్త్రాన్ని అనుసరించి మనం జీవించాలని ఏ మాత్రం కోరడంలేదు గాని పరిశుద్ధాత్మశక్తి ద్వారా జీవించాలని కోరుతున్నారు. ధర్మశాస్త్రానికి ప్రాధాన్యతనిచ్చే పాత నిబంధనకు మరియు కృపకు ప్రాధాన్యతనిచ్చే క్రొత్త నిబంధనకు మధ్యగల భేదాలు ఆ ఛార్టులో వ్రాయబడ్డాయి. ధర్మశాస్త్రము మోషే ద్వారా అనుగ్రహింబడెను, కృపయు సత్యమును యేసుక్రీస్తు ద్వారా అనుగ్రహింపబడెను, కృపయు సత్యమును యేసుక్రీస్తు ద్వారా కలిగెను” అని యోహాను 1:17 చెప్తుంది.

| **పాత నిబంధన (ధర్మశాస్త్రం)** | | **క్రొత్త నిబంధన (కృప)** |
|---|---|---|
| తాత్కాలికమైనది. యిర్మియా 31:31–32; హెబ్రీ 8:13. | **కాలపరిమితి** | శాశ్వతమైనది, హెబ్రీ 9:15; 10:10–14 |
| తాత్కాలికమైన విలువగల జంతు బలులు. హెబ్రీ 9:6–10, 10:1–4,8 | **క్షమాపణ లభించే మార్గం** | ఏకైక బలియాగం. యేసు బలిగా తన్నుతాను అర్పించుకొనుట, శాశ్వతమైన విలువగలది. ఎన్నటెన్నటికీ సరిపోతుంది హెబ్రీ 9:10–11, 10:9,10 |

| | | |
|---|---|---|
| ఇహలోక సంపద, తాత్కాలికం. ద్వితీ 30:15–20 | **బహుమానాలు ప్రతిఫలం మరియు శిక్ష** | ఆత్మీయమైనది, పరలోక సంబంధమైనది, శ్వాశతమైనది ఎఫెసి 1:3; యోహాను 3:16; ప్రకటన 20:13–15. |
| దేవుని ప్రజలు బానిసత్వం నుండి విడుదలపొంది, సముద్రాన్ని దాటి బయటకు వచ్చారు. నిర్గమ 14 | **అతి గొప్ప అద్భుతం** | యేసు పునరుత్థానం : మనమాయనతో పాటు లేపబడడం ద్వారా మరణాన్ని తప్పించుకొన్నాం. లూకా 24; రోమా 6:1–14; 1 కొరింథి 15. |
| శరీరరంలో సున్నతి. ఆదికాండం 17:10; ద్వితీ 10:16<br>పస్కా బలిపశువు : నిర్గమ 12:1–15 | **ప్రారంభోత్సవం జ్ఞాపకార్థ భోజనం** | బాప్తీస్మం (హృదయానికి సున్నతి) మత్తయి 28:18–20; రోమా 2:29<br>యేసు శరీరం మరియు రక్తం లూకా 22:19–20; యోహాను 6:25–68. |
| పాత నిబంధన, పాపమంటే ఏమిటో తెలియజేసింది మరియు అది శిక్షార్థమైనదని చెప్పింది రోమా 3:19–20. | **ఉద్దేశ్యం** | క్రొత్త నిబంధన ద్వారా దేవుడు మన పాపాలను క్షమించి మనలను విడుదల చేస్తాడు. కొలస్సి 2:11–17. |
| తాత్కాలికమైన గుడారంలో ఆ తర్వాత దేవాలయంలో ఒక తెర వెనుక. నిర్గమ 25:8–9,26; 40:35, లేవీయ 16:2. | **దేవుని సన్నిధి ఉండే స్థలం** | పరిశుద్ధాత్ముడు నిరంతరం మనలో జీవిస్తాడు. యోహాను 14:16–17, 1 కొరింథి 3:16. |
| మోషే ధర్మశాస్త్రాన్ని ఇచ్చాడు. మిగిలిన ప్రవక్తలు మోషే ధర్మశాస్త్రాన్ని అన్వయించారు. యోహాను 1:17; సంఖ్య 12:6–8 | **అతి ప్రాముఖ్యమైన ప్రవక్త** | యేసు కృపను సత్యాన్ని ఇచ్చాడు. యోహాను 1:1; 14–17; అ.కా. 3:22–26; కొలస్సి 1:15; హెబ్రీ 1:1–4 |
| ప్రధాన యాజకుడైన అహరోను ఇహలోకంలోని దేవాలయంలో అతి పరిశుద్ధ స్థలంలో పరిచర్య చేశాడు. లేవి 16:1–27. | **అతి ప్రాముఖ్యమైన యాజకుడు** | యేసు మన కొరకు మహిమలో విజ్ఞాపన చేస్తున్నాడు. హెబ్రీ 4:14–16; 5:14–16; 9:1–14; యోహాను 14:2–3. |
| దావీదు: అనేక రాజ్యాలను జయించాడు. లేవి 20:23; 1 సమూ 18:7; 2 సమూ 7:8–16; ద్వితీ 20:16–18. | **అతి ప్రాముఖ్యమైన రాజు** | యేసు: అన్ని జనాంగాల నుండి ఏర్పరచబడిన వారిని పరిపాలిస్తాడు. మత్తయి 28:18–20; అ.కా. 1:8; ఎఫెసి 5:23; ప్రకటన 19:15–16. |
| విభజన : విజయాలు, నిర్గమ 6:6–7; 19:1–6; ద్వితీ 2:31; 4:1–9. | **ఇతర జనాంగాలతో సంబంధాలు** | సమాధానపర్చబడడం అందరూ శిష్యులయ్యే అవకాశం. ఎఫెసి 1:4; 2:12–22; 3:1–6; కొలస్సి 1:19–22; ప్రకటన 7:9. |

| | | |
|---|---|---|
| దేవున్ని చూడడం లేదా ఆయనను సమీపించడమంటే మరణించడమే. న్యాయాధి 3:22; నిర్గమ 19:12; లేవి 10:1-2; యెషయా 6:1-7. | **దేవున్ని సమీపించే అవకాశం** | యేసు యొక్క నీతి మనకు ఇవ్వబడింది రోమా 5:18-19. |
| కఠినమైన శిక్ష పొందవల్సి వస్తుందన్న భయంతో నియమాలను పాటించడం, ద్వితీ 6:1-3; 28:15-26; నిర్గమ 20:18-20. | **ప్రవర్తన నియమావాళికి ఆధారం** | ఆత్మపూర్ణులై జీవిచడం ప్రేమతో లోబడడం. యోహాను 14:15; రోమా 13:8-10; 2 కొరింథి 3:3-11; గలతి 5:5-6; మత్తయి 22:37-40. |
| వారంలో ఏడవ రోజు ఆదిలో సృష్టి క్రమాన్ని అను సరించి, నిర్గమ 20:8-11; ప్రకటన 21:1; లేవీయాకాండం 25:1-7. | **ఆరాధనకు ప్రత్యేకించబడిన రోజు** | అపొస్తలుల కార్యముల గ్రంథంలోని సంఘాలు వారంలో మొదటి రోజున కలుసుకున్నారు. యేసు పునరుత్థానంతో ప్రారంభమైన నూతన సృష్టిని అనుసరించి, అయినా ఏ రోజైనా కూడుకునే స్వాతంత్ర్యం దేవుడు మనకిచ్చాడు. లూకా 24:1-7; అ॥కా॥ 20:7; ఎఫెసి 2:6; హెబ్రీ 4:4-11; ప్రకటన 21:1-4. |
| జంతు బలులు మరియు పండుగలు. లేవీ 1-7 మరియు 23వ అధ్యాయలు | **ఆరాధన సాధనములు** | మనము అత్మతో సత్యముతో ఆరాధించుదము విశ్వాసులతో రొట్టె విరుచుదము. యెహాను 4:24, అ॥కా॥2:42 |
| స్వంత ప్రయత్నం మరియు ప్రత్యేక నియమాలు లేవీ 11; యెషయా 55:7. | **శుద్దీకరణ** | మనం ఆత్మీయంగా తిరిగి జన్మించడం, రూపాం తరం చెందడం ద్వారా ఆత్మఫలం అనుభవిస్తాం. రోమా 14:1-9; 17; 1 పేతురు 1:3; 1 తిమోతి 4:3-5. |
| పది ఆజ్ఞలు పాటించడం నిర్గమ 20:1-17. | **కావల్సిన ప్రధాన విషయాలు** | పశ్చాత్తాపపడిన పాపి యేసునందు విశ్వాసముంచడం. యోహాను 8:16; లూకా 24:44-49. |
| జీవితంలో ప్రతి విషయానికి నిర్దిష్ట నియామాలున్నాయి. నిర్గమ 18:20; 24:3. | **నడిపింపు** | దేవుని పరిశుద్ధాత్మ మన హృదయాలను వెలిగించి మనలను నడిపిస్తాడు. ఎఫెసి 1:17-20; యోహాను14:26; రోమా 8:1-27. |
| నియమాలు మరియు దర్శనాలు దేవదూతలు మధ్య వర్తిత్వం ద్వారా ఇవ్వబడ్డాయి. సంఖ్యా 12:6; ద్వితీ 31:9. | **ప్రధాన ప్రత్యక్షత** | దేవుడు శరీరధారి అయ్యాడు సజీవ వాక్యం అయనే. యోహాను 1:1-3; హెబ్రీ 1:1-3; 2:2-4. |

| | | |
|---|---|---|
| క్రీస్తు కొరకు సిద్ధపర్చడం. గలతి 3:23–26. | **బోధించడం యొక్క ఉద్దేశ్యం** | జీవితాలను రూపాంతరపర్చి క్రీస్తు శరీరమైన సంఘాన్ని బలపర్చి, విశ్వాసులకు వివిధ పరిచర్యల నిమిత్తం కావల్సిన సామర్థ్యాలనివ్వడం రోమా 8:23; 28–30; ఎఫెసి 4:11–12. |
| న్యాయాధిపతులుగా కచ్చితంగా పరిపాలించారు. నిర్గమ 18:24–26; మార్కు 15:1; అ॥కా॥ 15:10. | **పెద్దల నాయకత్వం** | మనఃపూర్వకంగా ఇవ్వాలనిపించినంత, సంతోషంగా ఇవ్వాలి. 2 కొరింథి 9:7; 1 కొరింథి 16:2 |
| సంపాదనలో పదవ వంతు ఇవ్వాలనేది నియమం. ద్వితీ 12:11 | **ఇవ్వడానికి ప్రమాణం** | శాశ్వత సంపద; సర్వశక్తిమంతుడైన పరిశుద్ధాత్ముని ద్వారా వాగ్దానం చేయబడింది. ఆదికాండం 12:3; ఎఫెసి 1:3–14; హెబ్రీ 2:14–15; 1 పేతురు 1:3–5. |
| భూమి : బంధువులచేత సంరక్షించబడేది, తాత్కాలికమైనది. ఆదికాండం 12:1–2; 17:1–8; ద్వితీ 6:1–3; రూతు 4:13–17. | **వారసత్వం** | కాపరులుగా తగ్గింపుతో కూడిన పరిచర్య చేయడం. తీతు 1:5–9; 1 పేతురు 5:1–4; మత్తయి 20:25–28. |

టినో వెళ్ళిన తర్వాత జరిగిన మొదటి సమావేశంలో కొంత మంది పాత మిత్రులను చూసి విక్టర్ ఆశ్చర్యపడ్డాడు. ఎందుకంటే వారిలో కొందరు టినో ఇంట్లో జరిగే సహవాసానికి వచ్చేవారు మరికొందరు విక్టర్ ఇంటికి వచ్చేవారు. తర్వాత ఆర్థర్ సహవాసంలో చేరారు. వారు టినో ఇంట్లో జరిగే సమావేశాలకు రాక చాలా రోజులయ్యింది.

ఇంతలో "మనం ఒక ప్రాముఖ్యమైన కార్యక్రమానికి వచ్చాం" అని ప్రకటించాడు ఆర్థర్. ఇప్పుడు మనం ఈ సహవాసానికి ఒక నాయకున్ని ఎన్నుకొందాం. అవును టినో నాయకత్వంలో అంతా గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. అందుకే నేను క్రొత్త సహవాసాన్ని ప్రారంభించవల్సి వచ్చింది. ఆ సహవాసాన్ని దీనిలో విలీనం చేస్తున్నాను" అన్నాడు.

ఆర్థర్‌తో వచ్చిన ఒకతను మాట్లాడుతూ "నా పేరు షాజీ! ఇప్పుడు నేను ఈ సహవాసంలో సభ్యున్ని. టినో ఏ క్రమశిక్షణ లేకుండా ఈ సహవాసాన్ని ఎలా నడిపించాడో నేను విన్నాను.

విక్టర్ లాంటి నూతన విశ్వాసులు తమకు తోచిననట్టు చేయడానికి అతడనుమతించాడు. దేవుడు చెప్పిన నిజమైన విధానాలను పునరుద్ధరించడానికి మేం వచ్చాం. మనకు నూతన నాయకునిగా ఆర్థర్ ఉండాలని నేను ప్రతిపాదిస్తున్నాను.

అతన్ని చూస్తే నాకు "కప్ప" జ్ఞాపకం వస్తుంది అని విక్టర్ చెవిలో గుసగుసగా అన్నది లోరీ.

విక్టర్ నవ్వాడు. షాజీ నోరు చాలా పెద్దగా ఉండడం అతడు గమనించాడు. అతని స్వరం కూడ కొంత వరకు కప్పచేసే శబ్దాన్ని పోలి ఉంది.

"సార్ మీరెవరో మాకు తెలియదు. అంతేకాదు మా నాయకుడైన టినో లేని సమయంలో ఎన్నికలలో పాల్గొనడానికి నేనిష్టపడను" చాలా స్థిరంగా, కచ్చితంగా అన్నాడు ఇష్మాయేల్.

ఆర్థర్ కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి. నాలుకతో పెదాలు తడుపు కొన్నాడు" నాకు నీ మద్దతు తప్పకుండా ఉంటుందను కొన్నాను ఇష్మాయేల్" అన్నాడు.

నీవేం చేయాలనుకొంటున్నావో నాకు తెలుసు ఆర్థర్. నీవు నేను కలిసే ఆ ప్రణాళికలన్నీ వేశాము. అప్పుడు నేను నీతో

ఏకీభవించాను. నీవు మా అందరి సహవాసాలను నియంత్రించాలనుకొంటున్నానని అందరిపై అజమాయిషీ చేయాలను కొంటున్నావని నాకు తెలుసు. నీవు నిర్దేశించిన మతాచారాలను నియమాలను విశ్వాసులు పాటించకపోతే వారికి తాము తప్పుచేశామన్న అపరాధ భావన కలిగిస్తావు. ఒక వేళ వారు నీకు లొంగకపోతే దేవుడు తమను వీక్షిస్తాడేమోనని వారు భయపడేలా చేస్తావు. ఆ అపరాధ భావంతో వారు డబ్బు ఇచ్చేలా చేస్తావు. వారి భయాన్ని ఒక ఆయుధంగా వాడుకొని వారిని నీ చెప్పుచేతలలో ఉంచుకొంటావు" అని ఒక్క నిమిషం ఆగాడు. కన్నీళ్ళు తుడుచుకొన్నాడు. తర్వాత "ఇప్పుడు ఆ విషయాలను బట్టి సిగ్గుపడుతున్నాను" అన్నాడు.

అతడు చెప్పినవన్నీ నోరు తెరచుకొని ఆశ్చర్యంగా విన్న ఆర్థర్ "నీకు ఏ...ఏమయ్యింది?" అన్నాడు తడబడుతూ.

"నేను దేవుని కృపా ప్రవాహంలో దాహం తీర్చుకొన్నాను. సర్వశక్తిమంతుడైన దేవుడు నా ఆత్మను పునరుజ్జీవింపజేసాడు. ఇప్పుడు నీ అభిప్రాయాలను నేనే మాత్రం ఒప్పుకోను ఆర్థర్, దేవుడు తన కృపవల్ల అగ్నిప్రమాదంతోనా వ్యాపారం మూసివేశాడు. దానివల్ల ఎప్పుడూ డబ్బును గురించీ, ఇతరులమీద పెత్తనం చెలాయించడం గూర్చి ఆలోచించకుండా చేశాడు. ఆ అగ్నిప్రమాదాన్ని బట్టి నేను దేవునికి వందనాలు చెల్లిస్తున్నాను. ఇప్పుడు నేను మనప్రభువైన యేసు క్రీస్తును సేవించగలను. నా పూర్ణహృదయంతో మరియు పూర్ణమనసుతో ఆయనను ప్రేమిస్తున్నాను" అన్నాడు ఇష్మాయేల్.

ఈ గదిలో దయ్యాలున్నాయి గొణిగాడు షాజీ. అది పట్టించుకోకుండా ఇష్మాయేల్ ఇలా కొనసాగించాడు. మీరిక్కడికెందుకు వచ్చారో నాకు తెలుసు ఆర్థర్! మీరు తిరిగి ప్రారంభించిన సహవాసంలోని సభ్యులంతా తిరిగి వారివారి సహవాసాలకు వెళ్ళిపోయారు. నీవొక తోడేలువని వారు గుర్తించారు. నీవు దేవుని ప్రజలను విడదీస్తావనీ వారి మనసుల మీద పట్టు సంపాదించ డానికి విమర్శనాస్త్రాన్ని ఉపయోగిస్తావని గ్రహించారు. నీ మందమీద నీకు పట్టుపోయింది కాబట్టి ఇప్పుడు మా సహవాసం మీద పెత్తనం చెలాయించాలనుకొంటున్నావు. నీవు వారిని ప్రేమించడంలేదని గొర్రెలు గుర్తించాయి. మా సహవాసాలన్నింటి మీద అజమాయిషీ చేయాలన్న నీ ప్రణాళికకు మద్దతు సంపాదించడానికి వారిని వాడుకొన్నావని తెలుసుకొన్నాయి." "ఇది దైవదూషణ" గట్టిగా అంటూ అతన్ని అడ్డుకొన్నాడు, ఆర్థర్.

అవును ఇది కచ్ఛితంగా దేవదూషణే! ఇలాంటి దుష్టత్వంతో నిండిన మాటలు మాట్లాడవద్దు ఇష్మాయేల్! నీ వర్క్‌షాప్‌లో జరిగిన అగ్నిప్రమాదంవల్ల నీ మనసు స్థిమితం తప్పింది అవును అందుకే ఇలా మాట్లాడుతున్నావు" అన్నాడు ఆర్థర్.

"దయ్యాలు! దయ్యాలు! అని అరిచాడు షాజీ. చేతులుపైకి ఊపుతూ గట్టిగా పరిశుద్ధాత్ముడు నా కళ్ళు తెరిచాడు. నాకు దయ్యాలు కనబడుతున్నాయి. ఇష్మాయేల్ మరియు విక్టర్ వాటినిక్కడికి తెచ్చారు. వెళ్ళిపో సాతానా! వెళ్ళిపో దేవుని పేరట ఆజ్ఞాపిస్తున్నాను. వెంటనే వెళ్ళిపో "అంటూ గట్టిగా అరిచాడు. పైకి కిందికీ గెంతాడు అతని ముఖం కోపంతో వికృతంగా మారింది.

"దయచేసి ప్రశాంతంగా ఉండు షాజీ" అని అర్థించాడు విక్టర్.

హఠాత్తుగా షాజీ ఒక రకమైన స్వరంతో మాట్లాడడం మొదల పెట్టాడు ఆ సర్వం మరీ ఎక్కువగా కప్ప శబ్దం చేస్తున్నట్టుగా ఉంది. అతడిలా అన్నాడు. "రాత్రి నాకు ఒక కల వచ్చింది ఒక అపొస్తలుని కల వినండి. ఒక ప్రవక్త కల వినండి! దానికి నేనుచెప్పే శ్రేష్ఠమైన భావాన్ని వినండి. రాత్రంతా నేను నిద్రపోకుండా ధ్యానిస్తునే ఉన్నాను. ఇష్మాయేల్ షాప్ మండుతున్నప్పుడు ఏడు అపవిత్రాత్మలు దానిలో ఆజ్యం పోశాయి. టినో, ఇష్మాయేల్ మరియు విక్టర్ వాటి దగ్గరికి పరుగెత్తుకెళ్ళారు మంటలు మరింతగా మండుతున్నప్పుడు వారు ఆ దయ్యాలకు తలవంచి నమస్కరించారు. అప్పుడా దయ్యాలు ఆ ముగ్గురు ద్రోహులను ఎత్తి మంటలో పడేశాయి.

ఇక ఆపు! అన్నాడు విక్టర్ స్థిరంగా. మన కలలు బోధించడానికి మనమిక్కడ సమావేశం కాలేదు షాజీ! ఒకవేళ మన కలలు దేవుని వాక్యనుసారంగా ఉండి సంఘాన్ని బలపర్చేవైతే ఫర్వాలేదు. కాని నీవు చెప్పిన కల వినాశనకరమైంది మరియు అసహ్యం పుట్టించేది! అంతేకాదు దయచేసి అలా కప్పలాగ గెంతకు అది అందరి దృష్టిని చెదరగొడుతుంది!" అన్నాడు.

చాలా మంది నవ్వారు. ఆ నవ్వు షాజీని వాస్తవంలోకి తెచ్చింది. అతడు నిశ్శబ్దమయ్యాడు అప్పుడు విక్టర్ "మనం ఇక క్రమం పాటించాలి మనం దేవున్ని ఆరాధించడానికి మరియు ఆయన వాక్యాన్ని నేర్చుకోవడానికి ఇక్కడ కూడుకొన్నాం"

అన్నాడు. చాలా మంది విశ్వాసులు దానికి స్పదింస్తూ ఆమెన్ అన్నారు.

క్రమాన్ని కాపాడినందుకు థాంక్స్ విక్టర్ అన్నాడు ఆర్థర్ నిమ్మళంగా. "నాకు క్రమం అంటే ఇష్టం అవును! నేనొక ముఖ్యమైన విషయం చెప్పాలి. మన సహవాసం కొరకు కొన్ని యెతైన నియమాలు కావాలి. కాబట్టి ఈ సహవాసం కొరకు మనం ఇద్దరు పెద్దలను నాయకులుగా ఎన్నుకొందాం వారు 4 సంవత్సరాల పాటు బాధ్యతలు నిర్వహిస్తారు. వారు టినోకు మరియు అతనికి సహాయకులుగా పనిచేసిన వారికి బదులుగా నాయకత్వం వహిస్తారు. ఎందుకంటే టినో క్రమశిక్షణను, క్రమాన్ని సహవాసంలో కల్పించలేకపోయాడు" అన్నాడు ఆర్థర్.

"నేనా ప్రతిపాదనను బలపరుస్తున్నాను" అన్నాడు షాజీ.

"అది ప్రజాస్వామ్యబద్ధమైన చర్య కావచ్చు కాని అటువంటి నియమాలు ఆత్మలో మనకు గల స్వాతంత్ర్యాన్ని హరిస్తాయి. అదెలాగో వివరిస్తాను. ఒకవేళ పరిశుద్ధాత్ముడు ముగ్గురికన్నా ఎక్కువ మందికి కాపరిగా ఉండగల సామర్థ్యాన్ని ఇస్తే ఏం జరుగుతుంది? మీ నియమం దానిని ఇద్దరికే పరిమితం చేస్తుంది. ఒక మందకు అంటే ఇతర విశ్వాసులకు నాయకత్వం వహించే సామర్థ్యాన్ని దేవుడు ఒక వ్యక్తికి రెండు సంవత్సరాల వరకే ఇస్తాడా? ఆ తర్వాత ఆ సామర్థ్యం తీసేస్తాడా? అతనికి ఆ సామర్థ్యం తర్వాత ఉండదా? మానవులేర్పరచిన ఇటువంటి నియమాలు వ్యక్తులకు నాయకత్వం మరియు అధికారం ఇస్తాయేమో గాని క్రీస్తులో మనకున్న స్వాతంత్ర్యాన్ని నిరోధిస్తాయి. విశ్వాసులలో ఎవరైనా కాపరత్వపు బాధ్యతలు నిర్వర్తించే స్వేచ్ఛ మనకుంది అయితే దేవుని వాక్యానుసారంగా తగిన లక్షణాలు వారికుండాలి. దేవుడు ఏవైతే ఉండాలని నిర్దేశించాడో వాటిని మనం మానవ నియమాలనుపయోగించి మార్చలేము. ప్రస్తుతావసరాలకు మరియు అవకాశాలకు అనుగుణంగా మన పద్ధతులను మార్చుకొనే స్వేచ్ఛ మన సహవాసాలలో ఉంది. "దేవుని ఆత్మ ఎక్కడుంటే అక్కడ స్వాతంత్ర్యముందని 2 కొరింథి 3:17 నొక్కి చెప్తుంది" అన్నాడు విక్టర్.

"నీవు అచ్చు టినోలా మాట్లాడుతున్నావు" అన్నాడు ఆర్థర్ ముఖం గంటుపెట్టుకొని.

"బహుశా కావచ్చు! తాను లేని సమయంలో ఈ సహవాసాన్ని నడిపించడంలో సహాయం చేయమని అతడు నాకు చెప్పాడు. నేనది చేస్తాను. మనం మరో విషయం గూర్చి ఇప్పుడు మాట్లాడుకుందాం. మనమంతా ఒకరికొకరు నియమాలను ఎలా పాటించాలి, ఒకరికొకరం ఎలా పరిచర్యచేయాలి, తద్వారా ఒకరికొకరం ఎలా ఆశీర్వాదకరంగా ఉండవచ్చో చర్చించుకొందాం" అన్నాడు విక్టర్.

అది వినగానే "ఓ దేవా నీకు వందనాలు" అన్నది జూలీ.

ఆర్థర్ నుదురుపై చెమట పట్టింది. అందరివైపు చూస్తూ నిలబడ్డాడు. ఆరిపోతున్న పెదాలను నాలికతో తడుపుకొన్నాడు గుడ్లగూబలాంటి పెద్దపెద్ద కళ్ళతో గది అంతా కలయజూశాడు. అందరి స్పందన ఎలా ఉంటుందా అని ఒక్కొక్కరిని పరీక్షగా చూశాడు. తర్వాత ఒక్క మాటమాట్లాడకుండా గది వదిలి బయటకు వచ్చేశాడు. అతని వెనకే షాజీ మరియు వారితో పాటు వచ్చిన అతిథులు కూడా వెళ్ళిపోయారు. కాని చాలా మంది అలాగే కూర్చున్నారు. విక్టర్ మరికొంత మంది కలిసి ఒక బైబిల్ కథను నాటికగా ప్రదర్శించారు. తర్వాత దాని మీద చర్చను నడిపించాడు విక్టర్. వచ్చిన వారిలో ఒక నడి వయస్కురాలైన స్త్రీ ఉంది. ఆమె ప్రకాశవంతమైన రంగురంగుల దుస్తులు ధరించింది.

సమావేశం ముగిసిన తర్వాత "నేనామెను గుర్తు పట్టాను. నేను మొదటిసారి ఈ సమావేశానికి వచ్చిన రోజు ఆమె కూడా వచ్చింది. సహవాసమంతా క్రీస్తు యొక్క అద్భుతమైన కృపను బట్టి ఆయనను స్తుతిస్తుంటే ఆమె వెళ్ళిపోయింది" అని నెమ్మదిగా విక్టర్‌తో అన్నది లోరీ.

అందరూ వెళ్ళిపోయేదాకా ఆ స్త్రీ అటూ ఇటూ తచ్చాడింది. తర్వాత విక్టర్, లోరీల వద్దకు వచ్చి "నా పేరు జూడీ! స్వాతంత్ర్యం గూర్చి నీవు చెప్పింది చాలా బాగుంది విక్టర్. నేను విశ్వాసంతో ఉన్నత స్థాయికి చేరుకొన్నాను. చాలా మంది ఎప్పటికీ గ్రహించలేనని ఒక సత్యాన్ని నేనిప్పుడు తెలుసుకొన్నాను మతం కన్నా దేవుడు గొప్పవాడు! మనం యదార్థంగా ఉన్నంతకాలం దేనినైనా నమ్మవచ్చు మీరు చెప్పేది మీకు సత్యమనిపించవచ్చు. నేను చెప్పేది నాకు సత్యమనిపించవచ్చు.

ఇది నిజంగా ఎంత స్వేచ్ఛనిస్తుందో. బైబిల్‌లో వ్రాయబడిన విషయాలన్ని చాలా పరిమితమైనది. బైబిల్ లో హింస ఉంది! మనం క్రీస్తు రక్తంలో కడగబడ్డామని అది చెప్తుంది. అదెంత పురాతనమైన విషయం!" అన్నది.

"జూడీ, యేసు రక్తం మన పాపాలకు పరిహారం చెల్లించిందని మేము ధృఢంగా నమ్ముతున్నాం" అన్నది లోరీ.

"యేసు యొక్క ఎర్రరక్తకణాలు నాకేం మేలు చేస్తాయి?" అన్నది జూడీ.

"మీరు మీ స్వంత దేవున్ని తయారు చేసుకొంటున్నారా? అయితే అది విగ్రహారాధన" అన్నాడు విక్టర్.

"నాకు విగ్రహాలలో నమ్మకం లేదు యోవనుడా!" నేనెందుకు విగ్రహం చేసుకొంటాను?" అన్నది జూడీ.

"మీరు రాయి, మరియు ఉలి తీసుకొని విగ్రహం చెక్కడం లేదు కాని మీ పదాలతోనే ఒక దేవునికి రూపునిస్తున్నారు. దేవుని గూర్చి, ఆత్మీయ సత్యాలను గూర్చి మీ స్వంత నమ్మకాలను ఏర్పరచుకొంటున్నారు విగ్రహారాధికులైన అన్యజనాంగాలు ఆ పనే చేశాయి మీరు దేవుని కృపను స్వీకరించాలి, మరియు...." విక్టర్ మాటలు పూర్తికాకముందే ఆమె కలుగజేసుకొంది.

"నాకు కృపను గూర్చి వివరిస్తావా. నేను చెప్తానుండు. కృపను గూర్చి నీకంటే నాకే ఎక్కువ తెలుసు, నాయనా! దేవుని తీర్పును గూర్చిన మీ పురాతన సిద్ధాంతాన్ని నేను ఒప్పుకోను ఒక ప్రేమగల దేవుడు మనుషులనలా శిక్షించడు, రక్షణ అనేది సార్వత్రికమైనది" అన్నది.

"యేసు రక్తం ద్వారానే మనకు విడుదల లభిస్తుందని ఎఫెసి 1:7 చెప్తుంది. దేవుని పరిశుద్ధతను గూర్చి తెలుసుకొనే దాకా నేను కూడా దేవుని తీర్పును గూర్చి అర్థం చేసుకోలేక పోయాను జూడీ! దేవుడంటే పరిపూర్ణమైన ప్రేమ మరియు మంచితనం, అందుకే ఆయన పాపాన్ని శిక్షిస్తాడు. తన బిడ్డలు తనతోపాటు ఎల్లప్పుడూ జీవించాలని ఆయన ఇష్టం. అయితే ఆయన అతి పరిశుద్ధుడు. పాపం తన సన్నిధిలోకి ప్రవేశించడానికి ఆయన అనుమతించడు. ఒకవేళ ఆయన అలా చేయడానికి ఒప్పుకొంటే పరలోకం నరకమౌతుంది!" అన్నది లోరీ.

"నరకమా! నరకం గూర్చి మాట్లాడుతున్నావా అమ్మాయి! దేవుడొకవేళ అంత కోపంతో శిక్షించే వాడైతే ఆయన కృపగల దేవుడనడానికి వీలులేదు" వాదించింది జూడీ.

జవాబు చెప్పమన్నట్టుగా విక్టర్ వైపు చూసింది లోరీ. దేవుని తీర్పును గూర్చి టినో ఏం చెప్పాడో జ్ఞాపకం చేసుకొన్నాడు విక్టర్. బాధాకరమైన పాపం యొక్క నేపథ్యం, దానికి శిక్ష, పాపపరిహారార్థంగా రక్తబలి అర్పించడం మరియు పరిపూర్ణ న్యాయం అనే అంశాలను అర్థం చేసుకొంటేనే మనం కృప అంటే ఏమిటో గ్రహించగలుగుతాం. పరిపూర్ణమైన న్యాయం జరిగే చోటు నరకం. దేవుని తీర్పు ఎప్పుడూ న్యాయమైనదే లేకపోతే ఆయన దేవుడు కాదు. కృప మరియు దయవిలసిల్లే ప్రదేశం పరలోకం. ఈ సత్యాన్ని గ్రహించినప్పుడే నీవు దేవున్ని మనఃపూర్వకంగా ప్రేమించగలుగుతావు. మానవుడు తన ఊహలకు తగినట్టుగా ఇష్టం వచ్చినట్టుగా మలుచుకోగలిగిన చిన్న దేవునిగా ఆయనను చూడడానికి ప్రయత్నించవు" అన్నాడు విక్టర్.

జూడీ మనసెక్కడో ఉన్నట్టనిపించింది. ఆమె అతడు చెప్పేది వింటున్నట్టుగా తోచలేదు. కాని అతడు చెప్పేదాన్ని ఆటంక పర్చకుండా మర్యాదగా విన్నది.

"జూడీ! మేము అప్పుడప్పుడు నిన్ను దర్శించి ఈ విషయాలను గూర్చి అవగాహన కల్పించడానికి ప్రయత్నిస్తాం. నీకిష్టమేనా?" అని అడిగింది లోరీ.

"అవసరంలేదు. వాళ్ళు మీ ఇద్దరినీ బ్రెయిన్ వాష్‌చేసినట్టు అన్పిస్తుంది. నేను ఆ భావాజలం నుండి ఎలాగో బయటపడ్డాను. దేవునికి వందనాలు" సరే నే వెళ్తున్నాను గుడ్ నైట్, మీరిచ్చిన టీకి చాలా థ్యాంక్స్!" అన్నది జూడీ.

ఆమె పోగానే లోరీ ఒక కుర్చీలో కూలబడింది. చాలాసేపు నిశ్శబ్దంగా ఉన్న తర్వాత నిట్టూరుస్తూ "ఆమె పక్కన నిలబడ్డప్పుడు "మార్జువానా" (మత్తమందు) వాసన వచ్చింది అన్నది.

"అవును ఆమెచేతి మీద సూది గుచ్చిన మరకలు కూడా ఉన్నాయి. అంటే ఆమె మత్తుమందుకు బానిస అన్నమాట.

నిజమైన సత్యం మీద తమ నమ్మకాలను కట్టుకోని వారు చాలా తేలికగా అసత్య మతాలకు లొంగిపోతారు. జూడీ తన స్వంత అపనమ్మకానికే ఖైదీ అయ్యింది" అన్నాడు విక్టర్.

"ఎవరి కిష్టం వచ్చింది వారు నమ్మవచ్చని ఆమె అన్నది కదా" జ్ఞాపకం చేసింది లోరీ.

ఆమెలాగ ఆలోచించేవారు దేవుని వాక్యంలోని సత్యాల నుండి తమను తాము దూరం చేసుకొంటారు. అవి వినకుండా తమ చుట్టు తాము ఒక రక్షణ కవచాన్ని తయారు చేసుకొంటారు. జూడీ నిర్మించుకొన్న కవచం చాలా పరిమితమైంది ఆమె తన స్వంత స్వప్నలోకంలో తనను తాను బంధించుకొంది తాను స్వతంత్రంగా ఉన్నానని ఆమె అన్నది కాని దేవుడిచ్చే కృప ద్వారా కలిగే ప్రేమతో ప్రేమించగలిగిన వారే స్వతంత్రులు" సాలోచనగా అన్నాడు విక్టర్.

ఇద్దరు కలిసి జూడీ కొరకు ప్రార్థించారు. ఇంటికెళ్ళే దారిలో "నీవు మాట్లాడుతుంటే టినో మాట్లాడుతున్నట్టుగా ఉంది. ప్రేమిస్తేనే విశ్వాసులు స్వతంత్రులౌతారు అన్నావు. అంటే ఏమిటని అడిగింది లోరీ.

టినో ఆ విషయం నాకు వివరించాడు. పాప స్వభావంగల మనుషులు ఏదనుకొంటే అది చేయలేరు. చేయకూడదు కూడ ఎందుకంటే, వారు చెడ్డ పనులు చేయాలనుకొంటారు. పోలీసులు, సమాజం, మనస్సాక్షి మరియు దేవుడు వారిని నిరోధిస్తుంటారు. కేవలం పరిణితి చెందిన ప్రేమగల వ్యక్తులు మాత్రమే తమ కిష్టం వచ్చింది చేయడానికి అనుమతించబడాలి. ఎందుకంటే వారికిష్టమైనదెప్పుడూ మంచిదే అయి ఉంటుంది. మన పొరుగు వారిని ప్రేమిస్తే ధర్మశాస్త్రమంతా నెరవేర్చినట్టేనని యేసు చెప్పాడు" వివరించాడు విక్టర్.

"ఇప్పుడు నాకర్థమయ్యింది విక్టర్! ఇతరులను ప్రేమించేవారు ఏదైనా చేయడానికి స్వాతంత్ర్యంగలవారు. ఎందుకంటే వారు చేయాలనుకొనేది ఎప్పుడూ ఇతరులకు మేలు కలిగించేది అయి ఉంటుంది. దానిని నేను ఊహించుకోగలను. పునరుత్థానంలో, ఆ తర్వాత నిత్యత్వంలో పాపమనేది ఉండదు. మనం దేవున్ని మరియు ఇతరులను ఎంతగా ప్రేమిస్తామంటే చివరికి మనమేమనుకొంటే అది చేయగల పరిపూర్ణ స్వతంత్రులమౌతాం దేవునికి మహిమ కల్గును గాక!" అన్నది లోరీ.

టినో తన పనులు ముగించుకొని తిరిగి వచ్చిన తర్వాత విక్టర్‌ను అభినందించాడు. "అర్థర్ మరియు అతని సహాయకులు మన సహవాసం మీద అజమాయిషీ చేయడానికి ప్రయత్నించినప్పుడు నీవెలా ఎదుర్కొన్నావో క్రమాన్ని ఎలా పునరుద్ధరించావో ఇష్మాయేలు చెప్పాడు. చాలా కృతజ్ఞతలు. నీవు మరియు లోరీ తమకెంతో ఆశీర్వాదకరంగా ఉన్నారని మరికొంత మంది కూడ చెప్పారు. మీ క్రొత్త సహవాసం మరి రెండు సహవాసాలను ఏర్పాటు చేసింది, వారి నాయకులకు నీవు శిక్షణ నిస్తున్నావు కూడ మన ప్రభువైన యేసుకు స్తుతి కలుగును గాక" అన్నాడు.

"నేను పెద్దగా చేసిందేమీ లేదు. నీవు మా కొరకు ఏం చేశావో నేనూ అదే చేస్తున్నాను. నేను నిన్ను అనుకరిస్తున్నాను టినో. ఇది చాలా సులభమైన పద్ధతి నిజంగా చాలా సులభం" అన్నాడు విక్టర్.

"ఓహో దేవుని కృప ఎలా ప్రవహిస్తుందో కుటుంబం నుండి కుటుంబానికి, స్నేహితుని నుండి స్నేహితునికి! ఆయనకే స్తుతి కలుగునుగాక!" ఆనందంగా అన్నది లోరీ.

"దేవుని కృప ఎన్నో ప్రదేశాలలో ప్రవహిస్తుంది. మన మిషనెరీలు స్థాపించిన సహవాసాలు వేగంగా అభివృద్ధి చెందు తున్నాయి. వారు ధైర్యంగా సాతాను సామ్రాజ్యాన్ని ఆక్రమిస్తున్నారు. మనమిక్కడ నియమాల ప్రకారం జీవించాలనే వారితో ఎలా ఇబ్బందులు పడుతున్నామో వారూ అలాగే ఇబ్బంది పడుతున్నారు. అయినా ప్రతి చోటా విశ్వాసులు కృప మరియు శక్తి కొరకు ఆయన నామంలో మొరపెడుతున్నారు. సర్వశక్తిమంతుడైన దేవుడే సాతాను కన్నా వాని దురాత్మలకన్నా శక్తిగలవారని పరిశుద్ధాత్ముడు వారికి చూపిస్తున్నాడు."

లోరీ ఏడ్చేసింది!

"ఏంటి ఏమైంది?" విక్టర్ అడిగాడు.

"చాలా మందికి ఈ గొప్ప ఆశీర్వాదం గురించి తెలియదు దేవుని అద్భుతమైన కృపను గూర్చి నేనొక కవిత వ్రాయాలను కొంటున్నాను. అప్పుడు ఇతరులు కూడా దానిని చదివి మనతో పాటు సంతోషిస్తారు. కాని కవితలు వ్రాసే

విషయంలో నాకంత పాండిత్యంలేదు. పదాలను లయబద్ధంగా వ్రాయడం నాకు రాదు” అన్నది లోరీ.

“లోరీ! మృదువుగా పిలిచాడు టినో. దయచేసి నీవనుకొన్నట్టు కవిత వ్రాయి. ప్రాస నియమాలు లేకపోయినా ఫర్వాలేదు. నీ భావాలు స్వేచ్ఛగా ప్రవహించకుండా ఏ నియమాలూ నిన్ను నిరోధించలేవు. చందోబద్ధమైన పద్యాలను గూర్చి ఆలోచించకు. దేవుడు మనసులో ఏమి ఉంచితే అదే వ్రాయి అంతే అన్నాడు.”

నిజంగా వ్రాయనా? విక్టర్ వైపు చూసింది లోరీ. దానిలో సిద్ధాంతపరంగా లోపాలుంటే సరిచేస్తావా. అని అడిగింది.

కొన్ని రోజుల తర్వాత విక్టర్ మరియు లోరీ, టినో, జూలీ మరియు ఇష్మాయేలు కలుసుకొన్నారు. లోరీ ఏదో చదవాలను కొంటుంది అన్నాడు విక్టర్. లోరీ సిగ్గుపడుతూ తన మృదవైన స్వరం వణుకుతుండగా తాను వ్రాసిన కవిత చదివింది.

## దేవుని క్రొత్త సృష్టి మీద వృద్ధ సర్పము యుద్ధము చేయుచున్నది.

విడుదలనిచ్చు దేవుని కృప హిమాలయములకన్న ఎత్తైన స్థలము నుండి క్రిందికి ప్రవహించుచున్నది.
ఇది గంగా, అమెజాన్, యాంగ్ ట్జ్, మరియు నైలు నదులన్నింటిని కలిపిన దానికంటె గిప్పనది.
దీనికి అగుగావచ్చు గోడలను అణగ ద్రొక్కుచూ భూమి మీద ప్రతి ఖానమునకు చేరుచున్నది.
ఆహా! దీనియొక్క స్వస్థపరచు, జీవమునిచ్చు, ప్రతిది క్షమించగల ప్రవాహమును రుచి చూచెదను గాక!

తొలుదొల్త భూమి మీది బలహీనమైన భూపొర, అణగద్రొక్కు దీని బరువును మోయలేకపోయెను.
పాప భూయిష్టమైన మానవ హృదయము స్పర్శకు మలినమైన దీని పరిశుద్ధత నిలిచిపోవును.
ఎక్కడైతే అపవిత్రాత్మల కుళ్ళు, ఆత్మను పొగుచేయు జిగల మన్ను, విస్తరించెనో,
ఎక్కడ ఆదాము పడి పోయెనో, అక్కడే నరకము యొక్క దాడు సిగ్గుమాలిన విజయ గీతము పాడెను.

అప్పుడు, గంభీరమైన, దేవుని గట్టి నమ్మకము ధ్వనించెను. “సర్పము భూమిని మనుష్యులను, తన బలి పశువుగా, స్త్రీకి మానవుడు జన్మించెను.
ఘట సర్పము యొక్క తలను చితక ద్రొక్కును! దయ్యములు అపహసించెను.
“పాపము మనుష్యులందరిని మలినపరచెను. కాబట్టి ఎవరును దేవుని శాపమును తప్పించుకొనలేరు!
మేమే వారి పాపమును చూపించెదము మరియు అతడు త్వరలోనే చనిపోయి దుమ్మగాగలడు.”

మహోన్నతుడైన ఒకని, భక్తితో భయంతో దూతలు విన్నారు, తండ్రియైన దేవుడి, తన కుమారుని పిలిచెను,
“వేళ్ళు, మార్గము నిర్మించుము, మనయొక్క ఉన్నతమైన సింహాసనము నుండి కృప మానవులంది యొద్దకు ప్రవహించనీయుడి.” దురాత్మలు వెక్కిరించెను.
“భూమి యొక్క సన్నని పొర ఎంతో బలహీనమైనది మరియు
పునాదులను బలపరచ తగినంత యివ్వలేదు; ఆనది నీళ్ళు ఎంతో బరువుగా వున్నది.”

దేవుడు తన కుమారునితో అంటున్నాడు “వెళ్ళి మానవ శరీరముతో భూమి మీద నడువుము, అది బలహీనమైనప్పటికి
దేవుడు తనకుమారునితో అనెను “వెళ్ళిమానవశరీరముతో భూమి మీద నడువుము, ఇది దుర్భలమైనటికి. మానవల యొక్క తెగుళ్ళలోను, బాధలలోను పాలు పొందుము.
వెళ్ళి పాపముయొక్క చేదైన శాపము రుచిచూడుము! నీవు నిరంతరము ప్రవహించునట్లు రక్తముచేత గొడలను కరిగించి అడ్డు తొలగించుము.
భూమి మీద ఎవరైతే నివసించేరో యిపుకు నివసించుచున్నారో, యికముందు నివసించాదురో వారి ఆత్మలను విడుదల కలుగునట్లు”.

దురాత్మలు ఎగతాళి చేసి, పండ్లిగిలించుచు దేవునిశాసనము ధిక్కరించి,
ప్రధానదూతలు గమనించుచుండెను. విస్మయముండెను మరియు అడిగెను. “ఇది నిజముగా ఏమైయుండెను?
పరిశుద్ధుడైన వాడు ఏవిధంగా అవమానము మరియు అసహ్యమైన దానిని సమీపించి తాకును,
ఆ సాతానుడు, మానవుని కౄరమైన శత్రువు, భూమియంతాట విత్తిన దానిని.”

తిరుగుబాటు చేసిన ఆత్మలు డంబములు పలికెను, “మానవ రక్షకుడు ప్రయత్నించనిద్దాము! దేవుని పరిశుద్ధత నిషేధించాను!
పాపముచేసి మనుష్యులు వారి ఆత్మలను మనకిచ్చేరు” నిత్యవినాశనమునకు.
ఉపద్రవకరమైన పురుగును నదికి లోతైన పునాదిని వేయనిద్దాం.
ప్రయత్నించు! ఆ తరువాత మనము సంతోషంగా, తేలికంగా నిరాశగానున్న, ఆశగల ప్రణాళికలు పొగుచేద్దాము.!”

ప్రధానదూత కేక పెట్టెను. “కాలము మరియు ఎడము యొక్క గొలుసులు దేవుని చేతని ఆపలేవు.
అంధకారము ఆయనకు గ్రుడ్డి తనము తీసుకురాదు. హద్దులులేని దూరమును ఆయన జానెడు చేయగలడు.
ఆయనే అంతటనున్నావాడు మరియు “ప్రతి ఎప్పుడైనను” ఆయన కాలమునకు బయట నివసించును.
గొప్ప ఉన్నాను అనువాడు ఏ సహాయములోనైనా కాలములోనికి లేక దూరములోనికి ప్రవేశించగలడు.

ఆ విధంగా ప్రపంచములను నిర్మించెను, కనబడునవి మరియు మరుగైనవి. క్రిందికి వచ్చెను.
సృష్టిలోనికి చొచ్చుకొని, ఒప్పుకొనునట్టి మరియమ్మ గర్భములోనికి జీవ కణమాయేను.
మరియు ఆమె కన్యాత్వమును కాపాడుచూ, దేవుని మరియు మనుష్యకుమారుని కనెను.
అప్పుడు దురాత్మలదండు ఆ బలహీనమైన పరిశుద్ధ బాలుని చంపవలెనని కౄరమైన యుద్ధము చేసెను.

పాతాళముయొక్క విశాచములు కేక పెట్టెను, “అతనిని కొట్టండి! ప్రక్కలోపోడవండి, రక్తము కారుచున్న అనిని చూడండి”అతని మరణించెను.
భూమి కంపెంచెను మరియు ఉరుములు మెరియెను. వర్షము ఆయన రక్తమును చెల్లాచెదర చేసెను.
క్రూర మృగము యొక్క ఆకలి కొరలు అన్యాయముగా సంపాదించిన బవబమానము బలాత్కారముగా తీసికొనుటకు సమీపించెను.
యోనా యొక్క ఆకలిగొనిన మత్స్యమువలె, యోనా యొక్క పచ్చి, గాయపడిన శరీరమునువాడు మ్రింగివేసెను.

పొంగిన గర్వముతో, సర్పము డంబములు పలికెను. “నేను గెలిచితిని! నా స్నేహితులారా, పండుగ చేసుకొనండి.
ఒక మానవుడు చనిపోయినప్పుడెల్లా నా సంపద ఎలా పెరుగుతుందో స్వరల్లోక దూతలను గమనించ నీయండి.
ఇప్పుడు మన రాజ్యములో క్రీస్తు నిస్సహాయుడై నా చేతులలో నా రాజ్యములో వున్నాడు.
దేవుడు మనలను క్రిందికి పడద్రొసెను. కాని మనమిప్పుడు పూర్తి పగ తీర్చుకొందము.

పాతాళలోమంతట సంతోషము ప్రతిధ్వనించెను. “దేవుడు తన మాట నిలబెట్టుకొనవలెను!”
ఆయనే తన యేసు చనిపోవునట్లు చేసెను, ఆ ‘రక్షకుడు’ బుద్ధిలేని వాడుగా ఋజువాయెను!
అతను ఓడిపోయెను! దేవుని యొక్క చట్టమే పాపులైన మనుష్యులు తప్పి చావలెనని కొరుచున్నది.
మన నిందలు వారి సమాధులకు ముద్రవేసెను: స్వర్లోకము యొక్క చట్టము కొరివల్లె అది జరిగెను.”

విశ్రాంతి దినమంతా మరిణించిన మన ప్రభువు పూర్ణ విశ్రాంతిలో పరుండ బెట్టబడెను,
దేవుని యొక్క న్యాయమంతటిని సంపూర్ణ మార్గముగా ప్రతి దానిలోను నెరవేర్చిన ఒకే ఒక్క మానవుడు.
ఘట సర్పము వట్టి ద్వేషము చేత గ్రుడ్డిగా చేయబడెను, ప్రేమతో కూడిన పనులను ముందుగా చూడలేనివాడు;
కడపటి ఆదాము యొక్క రక్తము ప్రతిమానవుని పాపములను శుద్ధి చేయగలదు!.

నూతన వారము యొక్క మొదటి దినము వచ్చింది. (మరోముఅనేసు) ఘుడ సర్పము యొక్క గట్టిపట్టును విరగగెట్టిలనాడు.
పాతాళము యొక్క దురాత్మలు శ్వాస తీసుకొనుట కష్టమాయెను. ఇటమ! దిగులు! కాని దూతలు ఆశ్చర్యముతో కేకలు వేసిరి,
"ఏమి సంతోషము! ప్రవక్తలవలనను, దావీదు మరియు కీర్తనలు ముందుగ చెప్పిన విధముగనే,
ఇప్పుడు స్పష్టమైనది. మనము చూడలేకపోయినాము! పరలోక సైన్య సమూహము దేవుని స్తుతించునుగాక!

"క్రీస్తు తిరిగి లేవవలెను" ప్రధాన న్యాయాధిపతి వివరించెను, "ఆయన పరిశుద్దుడు!
పాపమునకు మరణము ఆజ్ఞ ఇచ్చిన అదే శాసనము, మంచి మనుషులు బ్రతకాలంటున్నది.
ఏ నీతిమంతుడు మరణించరాదు. కాని దేవుని యందు ఎల్లప్పడు ఆనందించుచు జీవించాలి.
సర్పము యొక్కవాడియైన, నేరముమోపు కోరలు పాపము లేనివానిని పెట్టుకొన జాలదు.

యేసు మరణద్వారమును పగులగొట్టుకొని మరియు లేచినపుడు దూతలు సంతోషించెను.
మరియు నోవాకు ఓడవలె మునిగి పోవువారిని పట్టుకొనినట్లు,
ఖాల యొక్కకాలము మరియు దూరము అవతల చనిపోయి బంధీలై యున్నవారిని ఆవానతో కూడలేపెను.
మరియు ఇక ముందుకూడ త్వరలో చనిపోవు వారిని సహితము, క్రీస్తు యొక్క కార్యము నిత్యత్వమునకు చెందిన కాలము.

దురాత్మలకు ఇప్పుడు శక్తిలేదు. మోసగించు శక్తి తప్ప,
ఏ మనుష్యులు ఆ అబద్దములు నమ్ముటకు ఇష్టపడితున్నారో వారు ప్రాణాంతకమున ఆ జిగట మన్నంటిని తాగ్ర నివ్వండి.
మిగిలిన వారందరి నిమిత్తము దేవుని యొక్క నది ప్రవహించుచున్నది. దప్పిగొనియున్న వారందరిని ఉచితముగా త్రాగ నివ్వండి!
ఆహా! క్రీస్తు ప్రేమను రుచిచూడండి! ఆయన కృపను ఎల్లప్పడు కౌగలించుకొనండి.

## అభ్యాసం

దేవుని కృపా ప్రవాహాన్ని ఆటంకపర్చుదానికి సాతాను ఉపయోగించే పద్ధతులేమిటి?

- ❑ వ్యక్తిగతమైన విశ్వాసాన్ని ప్రోత్సహించే వ్యక్తిగత ప్రాధ్యాన్యతా వాదం.
- ❑ ఇతరుల అభిప్రాయాలను వినడానికి ఇష్టపడని అహంకారంతో కూడిన మూర్ఖత్వం. ఈ వాదం క్రైస్తవ పరిచర్యను కేవలం బోధనకే పరిమితం చేస్తుంది.
- ❑ దేవుని వాక్యానికి బదులుగా మనుషులేర్పరచిన నియమాలను పాటించడం.
- ❑ వినేవారు కేవలం వినేవారుగా మాత్రమే ఉండేలా బోధించే విధానం.
- ❑ విగ్రహారాధన, తాను యదార్థంగా ఉన్నంత వరకు ఏది నమ్మినా ఫర్వాలేదని అనుకోవడం కూడా విగ్రహారాధనే.
- ❑ అధికార దాహంగల నాయకులు. వారు కేవలం నియమాలు ఏర్పరచి వాటిని పాటించమని ఇతరులను బలవంతపెడతారే తప్ప తమ నాయకత్వ బాధ్యతలను ఇతరులతో పంచుకోవడానికి ఇష్టపడరు.
- ❑ విశ్వాసులంతా తమకున్న ఆత్మవరాలతో ఒకరికొకరు పరిచర్యచేసుకొనే విధానాన్ని విఫలం చేయడం.
- ❑ ప్రేమతో కాక ఇతర కారణాలను బట్టి దేవునికి లోబడమని చెప్పడం. అంటే భయంతో, బెదిరింపుతో లేదా తిరస్కరించబడతా మేమోనని.

- ❑ ఎంత సంపద ఉందో దానిని బట్టి దేవుని కృపను కొలిచే ఆలోచనా విధానం – భౌతిక వాదం.
- ❑ దేవుని కృప మనకు మానవాతీత విధానంలో లభిస్తుందని ఒప్పుకోని హేతువాదం.

(దేవుని కృపపట్ల ఆయన బిడ్డల కుండే నమ్మకాన్ని దుష్టుడు ఈ ఆయుధాలనన్నింటిని ఉపయోగించి బలహీనపరుస్తాడు)

నూతన నిబంధనలో తిరిగి పేర్కొనబడినవి కాక మిగిలిన పాతనిబంధన నియమాలను మనమెందుకు పాటించము?

.....................................................................................................................

.....................................................................................................................

.....................................................................................................................

.....................................................................................................................

పాతనిబంధన స్థానంలో క్రీస్తు పూర్తిగా క్రొత్తదైన కృపాసహిత నూతన నిబంధనను స్థాపించాడని వివరించే ఏ వాక్యభాగాలను నీవు పేర్కొంటావు?

.....................................................................................................................

.....................................................................................................................

.....................................................................................................................

.....................................................................................................................

దేవుని కృపా ప్రవాహం రూపంతో మన వద్దకు ప్రవహించే వెలుగును మరియు స్వాతంత్ర్యాన్ని ప్రజలు అనుభవించేలా చేయడానికి మీరు రూపొందించిన ప్రణాళికలేమిటో వివరించండి.

.....................................................................................................................

.....................................................................................................................

.....................................................................................................................

.....................................................................................................................